

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

హైదరాబాద్


fb.com/vaartha Digital

Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

28-8-2026 శుక్రవారం సంపుటి: 32 సంచిక: 209 పేజీలు: 10+4 వెల: 6.50


క్రీడల్లో భారత్ అగ్రస్థానమే లక్ష్యం: కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

కర్ణాటక విద్యుత్ అవసరాలకు సింగరేణి బొగ్గు: డి.సిఎం భట్టి 3



# పెను విపత్తే!

హిమనదం కూలడంతోనే జలప్రళయం: ఇస్రో

మంచుకొండే విరిగిపడింది: యుఎస్ అధికారులు

332కు చేరిన మృతుల సంఖ్య...

1400 మందికి పైగా గల్లంతు

500 మంది పర్యాటకుల ఆచూకీ లేదు

నేపాల్ విదేశీ వ్యవహారాల అధికారుల వెల్లడి

ఇషా ఫౌండేషన్ క్యాంప్‌లో 80 మంది అదృశ్యం

ఇదొక ఊహించని ప్రకృతి విపత్తు: భారత్‌కు బాలేన్ షా కృతజ్ఞతలు 5

## వరదల్లో 23 మంది తెలంగాణ వాసులు

న్యూఢిల్లీలోని తెలంగాణ భవన్, సచివాలయంలో ప్రత్యేక హెల్ప్‌లైన్, కంట్రోల్ రూమ్‌లు

కుటుంబ సభ్యులు ఆందోళన చెందవద్దు: మంత్రి పొంగులేటి 2

# 'మిర్ ఆలం'లో వాటర్ స్పోర్ట్స్ పార్క్

చెరువులో సస్పెన్షన్ బ్రిడ్జి, ఐలాండ్ల అభివృద్ధికి ప్రణాళికలు



గురువారం క్రేన్ ఎక్కి మిర్ ఆలం చెరువును పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

## ఫ్యామిలీ టూరిస్టు హబ్‌గా అభివృద్ధి చేస్తాం..

### ఆకస్మికంగా పరిశీలించిన సిఎం రేవంత్ రెడ్డి

### గడువులోగా పనులు పూర్తి చేయాలని ఆదేశం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఆగస్టు27:** చారిత్రక ప్రాధాన్యం కలిగిన మిర్ ఆలం చెరువుకు తెలంగాణ ప్రభుత్వం కొత్త రూపు, సరి కొత్త హంగులు ఇవ్వాలని యోచన చేస్తోంది. కుటుంబ సమేతంగా వచ్చి రోజంతా ప్రకృతి, వినోదం,విశ్రాంతిని ఆస్వాదించేలా దీనిని ప్రముఖ పర్యాటక, వినోద కేంద్రంగా అభివృద్ధి చేయాలని నిర్ణయించింది. మిర్ ఆలం చెరువును ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి గురువారం అకస్మికంగా పరిశీలించి, అక్కడ జరుగుతున్న అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్షించారు. చెరువు చుట్టూ జరుగుతున్న పనులు, మిర్‌ఆలం చెరువుపై నిర్మిస్తున్న ఐకానిక్ సస్పెన్షన్ బ్రిడ్జి పనులను సీఎం పరిశీలించారు. అధికారులు ఫొటో ప్రదర్శన ద్వారా పనుల పురోగతిని సీఎంకు వివరించారు. నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయాలని సీఎం ఆదేశించారు. మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ ఆధ్వర్యంలో మిర్ ఆలం ట్యాంక్ అభివృద్ధి పనులు సాగుతున్నాయి. చెరువు పునరుజ్జీవనం, చెరువు పరిసర ప్రాంతాలు, అందులోని ఐలాండ్ల అభివృద్ధి, చెరువుపై ఐకానిక్ బ్రిడ్జి నిర్మాణం. ఈ మూడు ప్రధాన అంశాలపై సమగ్ర ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. అయితే, మిర్‌ఆలం చెరువులోకి మురుగు నీరు చేరకుండా పటిష్ఠ >>2

## గవర్నర్ శుక్లాకు అస్వస్థత

### ఆసుపత్రికెళ్లి సిఎం పరామర్శ



గురువారం ఆసుపత్రిలో గవర్నర్ శుక్లాను పరామర్శించిన సిఎం రేవంత్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఆగస్టు27:** అనారోగ్యంతో హై టెక్ సిటీలోని యశోదా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాను ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి పరామర్శించారు. గవర్నర్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. సిఎం రేవంత్ వెంట ఎంపీ వేం నరేందర్‌రెడ్డి కూడా ఉన్నారు. కాగా, మధ్యాహ్నం తర్వాత ఆసుపత్రి నుంచి గవర్నర్ డిశ్చార్చ్ అయి రాజ్‌భవన్‌కు చేరుకున్నారు. పక్షం రోజుల పాటు ఆయన విశ్రాంతి తీసుకోవాల్సి ఉంటుందని వైద్యులు తెలిపారు.



## సన్నాల సేకరణతో ఖజానాకు

# కోట్లు గుల్ల

### ఆ బియ్యం మాకొద్దన్న కేంద్రం

### 'ఎ' గ్రేడ్ నుంచి సాధారణ వెరైటీగా మార్పు

### రాష్ట్ర ప్రభుత్వానికి రూ.728 కోట్లు నష్టం

### 14 లక్షల మె.టన్నుల ధాన్యం మార్పుకు మెమో జారీ

**హైదరాబాద్, ఆగస్టు 27,ప్రభాతవార్త:** భారత ఆహార సంస్థ సన్నరకం ధాన్యం గ్రేడ్ ఏ గుర్తించడానికి నిరాకరించడంతో తెలంగాణ ప్రభుత్వం క్వింటాల్‌కు రూ.520 నష్టం జరుగుతున్నా సన్నాలను కామన్ వెరైటీగా ప్రకటించింది. ఖరీఫ్2025-26 సంవత్సరం 38లక్షల మెట్రిక్ టన్నుల సన్నధాన్యం రైతుల నుంచి తెలంగాణ ప్రభుత్వరంగ సంస్థ సివిల్ సప్లయ్ కార్పొషన్ కొనుగోలు చేసింది. ఇందులో 24లక్షల మెట్రిక్ టన్నులు చౌకధరల దుకాణాల ద్వారా రేషన్ కార్డు లబ్దిదారులకు పంపిణీ చేయడానికి సరిపోతాయి. మిగితా 14లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యంకు చెందిన బియ్యంను కస్టమ్ మిల్డ్‌రైస్‌గా ఎఫ్‌సిఐకి అప్పగించాలని >>2

తెలంగాణలో ఐదు నుంచి పదిలక్షల మె.ట సామర్థ్యంతో ధాన్యాగారపు గాదెల నిర్మాణం: మంత్రి ఉత్తమ్ 2

భూపాలపల్లి మైన్స్ ఎడి ఇంట్లో ఎసిబి సోదాలు

## 100 కోట్ల ఆస్తులు గుర్తింపు






జమ్మూలో గురువారం బిఎస్ఎఫ్ జవాన్లకు రాఖీలు కడుతున్న విద్యార్థులు

## 'మిర్ ఆలం'లో వాటర్‌స్పోర్ట్స్

>>చర్యలు తీసుకోవాలని సీఎం అధికారులను సందర్శన సందర్భంగా ఆదేశించారు. చెరువు నుంచి మూసీ నదిలోకి వరద నీరు సాఫీగా వెళ్లేలా నాలాలను విస్తరించాలని సూచించారు. చెరువు పునరుజ్జీవనంతో పాటు నీటి నాణ్యతను మెరుగుపరచడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని చెప్పారు. మిర్ ఆలం చెరువులో వాటర్ స్పోర్ట్స్ నిర్వహించేలా అభివృద్ధి ప్రణాళికలు రూపొందించాలని సీఎం సూచించారు. అవసరమైన సాంకేతిక, పర్యావరణ, భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా బోటింగ్, జల క్రీడలు, అడ్వెంచర్ కార్యకలాపాలకు అవకాశాలను పరిశీలించాలన్నారు. దీంతో యువతతో పాటు కుటుంబాలకు కూడా ఆకర్షణీయమైన వినోద కేంద్రంగా మిర్ ఆలం మారుతుందని అభిప్రాయపడ్డారు. చెరువు చుట్టూరా ఫుడ్‌కోర్టులు, పచ్చని పార్కులు, విశ్రాంతి ప్రదేశాలు, కుటుంబ వినోద సదుపాయాలు ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. చిన్నారుల కోసం ప్రత్యేక ఆట స్థలాలు, వినోద, కార్యకలాపాల కేంద్రాలను కూడా అభివృద్ధి చేయాలన్నారు. పాదచారులకు అనుకూలంగా వాకింగ్, పబ్లిక్ స్పేస్‌లను తీర్చిదిద్దడంతో పాటు రాకపోకల సౌకర్యాన్ని మెరుగుపరచనున్నారన్నారు.

మిర్ ఆలం చెరువులో ఉన్న ఐలాండ్లను అభివృద్ధి చేయాలని సీఎం సూచించారు. ప్రకృతి ఆధారిత విశ్రాంతి కేంద్రాలు, గ్లాంపింగ్(టెంట్లు వేయడం), ఇతర పర్యాటక కార్యకలాపాలకు ఈ ప్రాంతాన్ని వినియోగించుకునే అవకాశాలను అధికారులను పరిశీలించాలని చెప్పారు. వెడ్డింగ్, ఈవెంట్ డెస్టినేషన్ల ఏర్పాటుకు కూడా ప్రణాళికలు సిద్ధం చేసే అంశంపై దృష్టి సారించాలన్నారు. నాణ్యమైన పర్యాటక, వినోద సదుపాయాల అభివృద్ధిలో పీపీపీ విధానంలో ప్రైవేటు భాగస్వామ్యాన్ని ప్రోత్సహించి ఉపాధి అవకాశాలు కల్పించాలని వెల్లడించారు. సమీపంలోని నెహ్రూ జూలాజికల్ పార్కుతో మిర్ ఆలం ట్యాంక్ అభివృద్ధిని అనుసంధానం చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. జూ సందర్శన, ప్రకృతి, చెరువు అందాలు, కుటుంబ వినోదం అన్నీ ఒకే పర్యాటక అనుభవంగా అందించడమే లక్ష్యంగా ఉండాలని చెప్పారు. ట్యాంక్ పునరుజ్జీవనం, పరిసర ప్రాంతాలు, ఐలాండ్ల అభివృద్ధికి సంబంధించిన డీపీఆర్ ప్రస్తుతం రూపుదిద్దుకుంటుందన్నారు. కాగా, మిర్ ఆలం ట్యాంక్‌పై నిర్మిస్తున్న ఐకానిక్ బ్రిడ్జి పనులు కూడా పురోగతిలో ఉన్నాయి. ఆగస్టు 27, 2026 నాటికి లక్ష్యంగా పెట్టుకున్న 544 పైల్స్‌లో 273 పూర్తయ్యాయి. అంటే 50.18 శాతం పనులు పూర్తయ్యాయి. 62 పైల్ క్యాప్స్‌లో 28 పూర్తికాగా, 45.16 శాతం పురోగతి నమోదైంది. 62 పియర్ కమ్ పియర్ క్యాప్స్‌లో ఇప్పటివరకు ఆరు పూర్తయ్యాయి. విమానాశ్రయానికి సమీపంలో ఉన్న మిర్ ఆలం చెరువును పర్యాటకులను ఆకర్షించేలా అభివృద్ధి చేయాలని సీఎం రేవంత్ రెడ్డి సందర్భంగా సూచించారు.



గురువారం హన్మకొండలో హరీష్‌రావును తరలిస్తున్న పోలీసులు

# హరీష్ అరెస్టు

### విద్యార్థులను కలిసేందుకు వెళ్తుండగా అదుపులోకి తీసుకున్న పోలీసులు

### విద్యార్థులు, టీచర్లు, ఉద్యోగుల సమస్యల పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలం: బిఆర్ఎస్ నేత హరీష్‌రావు మండిపాటు

**ఉమ్మడి వరంగల్ జిల్లా బ్యూరో, ఆగస్టు 27 ప్రభాతవార్త:** ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కా రంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మాజీ మంత్రి, బిఆర్ఎస్ నేత హరీశ్‌రావు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. రేవంత్‌రెడ్డి విద్యాశాఖ మంత్రిగా ఉండటం దౌర్భాగ్యమని అన్నారు. బిటెక్, పాలిటెక్నిక్ విద్యార్థులను ప్రభుత్వం అవమానపరుస్తోందని ఆరోపించారు. గురువారం వరం గల్ పాలిటెక్నిక్ విద్యార్థులను కలిసేందుకు వెళ్తున్న ఆయనను పోలీసులు అడ్డుకోవడంతో హన్మకొండ కలెక్టరేట్ వద్ద బిఆర్ఎస్ నాయకులు, పోలీసుల మధ్య కొద్దిసేపు ఉద్రిక్తత నెలకొంది. హరీశ్‌రావును కారులో ఎక్కించి అదుపులోకి తీసుకునేందుకు పోలీసులు ప్రయత్నించగా కార్యకర్తలు అడ్డుకున్నారు. దీంతో పోలీసులు ఆయనను కాలినడకన సుబేదారి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. హరీశ్‌రావును అదుపులోకి తీసుకోవడాన్ని నిరసిస్తూ బిఆర్ఎస్ నాయకులు పోలీస్‌స్టేషన్ ఎదుట ధర్నా చేయడంతో అక్కడ కొంతసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. అనంతరం హరీశ్‌రావు మీడియాతో మాట్లాడుతూ ఉద్యోగులు, ఉపాధ్యాయుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా ఉద్యోగుల ఆరోగ్య పథకం ఇహెచ్ఎస్ అమలు కావడం లేదని తీవ్రంగా ఆక్షేపించారు. గతంలో ఉద్యోగుల కోరిక మేరకు ఒక శాతం కాంట్రిబ్యూషన్‌తో ఇహెచ్ఎస్ పథకాన్ని తీసుకొచ్చామని, ప్రస్తుత ప్రభుత్వం ఉద్యోగులను సంప్రదించకుండానే కాంట్రిబ్యూషన్‌ను ఒకటిన్నర శాతానికి పెంచిందని ఆరోపించారు. "భార్యాభర్తలిద్దరూ ఉద్యోగులైతే ఇద్దరి జీతాల నుంచీ కాంట్రి బ్యూషన్ కట్ చేస్తున్నారని, కుటుంబంలో రిటైర్డ్ ఉద్యోగులు ఉన్నా వారి నుంచి కూడా కాంట్రిబ్యూ షన్ తీసుకుంటున్నారని విమర్శించారు. ప్రభుత్వం ఇప్పటివరకు ప్రైవేట్ ఆసుపత్రులతో ఒప్పందాలు చేసుకోకపోవడంతో ఇహెచ్ఎస్‌కింద వైద్యం అందించలేమని ఆసుపత్రుల యాజమాన్యాలు చెబుతున్నా యని తెలిపారు. ఆరోగ్యశ్రీ బకాయిలు పెండింగ్‌లో ఉండటం,ప్రభుత్వం నిర్ణయించిన ప్యాకేజీలు గిట్టుబాటు కాకపోవడం వల్లే ఆసుపత్రులు ఇహెచ్ఎస్‌కు ముందుకు రావడంలేదని వివరించారు.

## కోట్లు గుల్ల

>>తెలంగాణ ప్రభుత్వం ప్రయత్నించినప్పటికి ఎఫ్‌సిఐ మాత్రం సన్నాలు గ్రేడ్ ఏ పొడవు వెడల్పు నిష్పత్తిగా లేవని వాటిని కామన్ రకంగానే చూస్తామని తీసుకోవడానికి తిరస్కరించింది. బియ్యం పొడవు 6.1ఎం.ఎం. వెడల్పు 2.0నుంచి 2.5 ఎం.ఎం ఉన్న వాటిని మాత్రమే గ్రేడ్ ఎగా గుర్తిస్తామని ఖరాఖండిగా తేల్చి చెప్పింది. దీనితో బిపిటి,సాంబా మసురి,జెజిఎల్ వంటి సన్నాలను కామన్ రకంగా ప్రకటన చేస్తూ ఆగస్టు 24 మెమో నెంబర్ 2261/సిఎస్ఐ-సిసిఎస్/2026 పేరుతో ఉత్తర్వులు జారీచేశారు. మెదక్, కరీంనగర్, మంచిర్యాల జిల్లాల కలెక్టర్లు 2025-26 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించిన గ్రేడ్ ఎ ధాన్యాన్ని కామన్ కేటగిరీగా మార్చాలని అభ్యర్థించారు. రైస్ మిల్లర్లు గ్రేడ్ ఎ మరియు కామన్ కేటగిరీల మధ్య ఉన్న వ్యత్యాస ధరను చెల్లించేందుకు సిద్ధంగా ఉన్నారు. నిజామాబాద్ జిల్లా కలెక్టర్ తెలిపిన ప్రకారం, రైస్ మిల్లర్లు 2025-26 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించిన గ్రేడ్ ఎ సన్నరకం ధాన్యాన్ని కామన్ వెరైటీగా మార్చేందుకు అంగీకరించారు. ప్రభుత్వం నిర్ణయించిన వ్యత్యాస మొత్తాన్ని చెల్లించడానికి కూడా సిద్ధంగా ఉన్నారు. తద్వారా సిఎంఆర్ కార్యకలాపాలు సజావుగా కొనసాగేందుకు అవకాశం ఉంటుంది. సన్నరకం ధాన్యానికి క్వింటాల్‌కు రూ.520/ అదనపు ప్రయోజనం (రూ.500/ బోనస్ ప్రోత్సాహకం + రూ.20/ గ్రేడ్ వ్యత్యాసం) రూ. 728కోట్ల కొనుగోలు నష్టం రాష్ట్ర ప్రభుత్వం భరిస్తుందనీ మెమోలో పేర్కొందిప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం, తెలంగాణ స్టేట్ సివిల్ సప్లైస్ కార్పొరేషన్ లిమిటెడ్ అదనంగా ఉన్న సన్నబియ్యాన్ని ఎఫ్‌సిఐ రా బాయిల్డ్ రూపంలో లేదా బాయిల్డ్ రూపంలో అందజేయడానికి అనుమతించబడింది. ఎఫ్‌సిఐ గ్రేడ్ఎ కేటగిరీకి చెందిన బాయిల్డ్ సన్నబియ్యాన్ని స్వీకరించదు కాబట్టి, మిల్లర్లు దానిని కామన్ కేటగిరీ కింద ఎఫ్‌సిఐ అందజేయవచ్చు. ప్రభుత్వ అసమర్థత మిల్లర్లకు అయాచితంగా వరమైంది. తెలంగాణలో సరఫరా చేసే రేషన్ బియ్యం మొత్తం కంటే 14లక్షలు అధికంగా ఉండటంతో మిగితా సన్నాలను ఎఫ్‌సిఐ తీసుకోదని వాటిని తమకు క్వింటాల్‌కు 2712 రూపాయల చొప్పున విక్రయించాలని కొంత మంది రైసు మిల్లర్లు ప్రతిపాదన చేసినా సివిల్‌సప్లయ్‌శాఖ అధికారులు వారి ప్రతిపాదనలు తిరస్కరించినట్లు సమాచారం. ఎఫ్‌సిఐ బియ్యం లెంథ్ బ్రిడ్త్‌కు తూగని రైసుఇప్పుడు తిరస్కరించడంతో మిల్లర్లు ఒక్కటై మాకు ఆ ధాన్యం అవసరంలేదని సహాయనిరాకరణ చేసినట్లు మిల్లర్ల సర్కిల్‌లో ప్రచారంజరుగుతోంది. నవ్వే వారి ముందు బొక్కబోర్ల పడ్డట్లు ప్రభుత్వం కక్కలేక మింగలేక చివరకు గ్రేడ్ ఎ ను కామన్ రకంకు మార్చుకొని రైసు మిల్లర్లను ఏదో ఒక కామన్ రైస్ ఎఫ్‌సిఐకి ఇవ్వాలనే బేరంకు దిగివచ్చిందని రైసుమిల్లర్లు పౌరసరఫరాలశాఖపై ఎగతాళి వ్యాఖ్యలు చేస్తున్నారు.

### వారం - వర్జ్యం

28-08-2026, శుక్రవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
శ్రావణ మాసం, దక్షిణాయణం
వర్ష ఋతువు, శుక్లపక్షం, మఖకార్తె
○ తి.పౌర్ణమి ఉ.9.46
న.శతభిష రా.3.12
వ.ఉ.9.43-ఉ.11.23
దు1. ఉ.8.23-ఉ.9.13
దు2. మ.12.33-మ.1.23
రాహు. ఉ.10.30-మ.12.00
శుభ ఉ.5.00-ఉ.6.00

### వార్తాఫలం

**మేషం :** ఉద్యోగంలో నూతన బాధ్యతలు సక్రమంగా నిర్వహించి పై అధికారుల ప్రశంసలు పొందుతారు. ధన లాభం.

**వృషభం :** సంతానం విషయంలో బాధ్యతగా వ్యవహరిస్తారు. నూతన పరిశ్రమలను ప్రారంభిస్తారు. దీర్ఘకాలిక సమస్యలు తీరుతాయి.

**మిథునం :** విధుల నిర్వహణలో వ్యాపార రంగాలలో అభివృద్ధి విదేశీ యానాలు చేయాలనే ఆలోచనలు బలపడతాయి.

**కర్కాటకం :** బంధువులతో ఏర్పడిన విభేదాలు పరిష్కారమవుతాయి. కుటుంబ సభ్యులను కలిసి ఆనందంగా గడుపుతారు.

**సింహం :** అనుకోని అతిథుల నుండి శుభ వార్తలు అందుకుంటారు. ఆస్తి విషయంలో నూతన ఒప్పందాలు కుదురుతాయి.

**కన్య :** ఉద్యోగాలలో మంచి మార్పులు వుంటాయి. శ్రమకు తగిన ప్రతిఫలం దక్కుతుంది. భూముల కొనుగోలు చేస్తారు.

**తుల :** సన్నిహితుల నుండి ఆశ్చర్యకరమైన వార్తలు అందుకుంటారు. చాకచక్యంగా వ్యవహరించి ముందుకు సాగుతారు.

**వృశ్చికం :** నూతన ఉద్యోగానికై చేసే దరఖాస్తులు, సంప్రదింపులు, పర్యటనలు లాభిస్తాయి. క్రయవిక్రయాలలో లాభాలు.

**ధనుస్సు :** ఆస్తి తాలూకూ వివాదాలను సాధ్యమైనంత తొందరగా పరిష్కారం చేసుకోవడమే మంచిదని భావిస్తారు.

**మకరం :** ఋణ యత్నం ఫలిస్తుంది. ఆరోగ్యం సాధారణంగా ఉంటుంది. పనులు నెమ్మదిగా పూర్తి చేస్తారు.

**కుంభం :** పెట్టుబడులకు తొందరపాటు వద్దు. భూముల విషయంలో నెలకొన్న వివాదాలు పరిష్కార దశకు చేరుకుంటాయి.

**మీనం :** సాంకేతిక విద్యావైద్య రంగాలలో రాణిస్తారు. మీ పేరు మీద ఇతరులు చేసే వ్యాపారాలు లాభిస్తాయి.

-శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# వరదల్లో 23 మంది తెలంగాణ వాసులు

### న్యూఢిల్లీలోని తెలంగాణ భవన్, సచివాలయంలో ప్రత్యేక హెల్ప్‌లైన్, కంట్రోల్ రూమ్‌లు

### కుటుంబ సభ్యులు ఆందోళన చెందవద్దు: మంత్రి పొంగులేటి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఆగస్టు27:** నేపాల్‌లో సంభవించిన ఆకస్మిక వరదలు, ఫ్లాష్‌ఫ్లడ్స్ నేపథ్యంలో అక్కడ ఉన్న తెలంగాణకు చెందిన పర్యాటకులు, యాత్రికులు, ఇతర పౌరుల భద్రతపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. నేపాల్‌లో చిక్కుకున్న తెలంగాణ వాసుల కుటుంబ సభ్యులు, బంధువులు, సన్నిహితులు అందించిన సమాచారాన్ని ఆధారంగా చేసుకుని ప్రాథమికంగా 23 మంది తెలంగాణ వాసులను గుర్తించినట్లు మంత్రి వెల్లడించారు. గుర్తించిన వారి వివరాలను కేంద్ర విదేశాంగ శాఖకు పంపించడం జరిగిందని తెలిపారు. వారి ప్రస్తుత పరిస్థితి, ఆచూకీ తెలుసుకోవడంతో పాటు అవసరమైన సహాయం అందించేందుకు కేంద్ర విదేశాంగ శాఖ, కాఠ్మాండు భారత రాయబార కార్యాలయం, నేపాల్ అధికారులతో రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం సమన్వయం చేస్తోందని తెలిపారు. నేపాల్‌లో నెలకొన్న పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు న్యూఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో ప్రత్యేక హెల్ప్‌లైన్, కోఆర్డినేషన్ సెంటర్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అదే విధంగా హైదరాబాద్‌లోని డా. బి.ఆర్. అంబేద్కర్ సచివాలయంలో సాధారణ పరిపాలన శాఖ (ఎన్ఆర్ఐ విభాగం) ఆధ్వర్యంలో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి, బాధితుల కుటుంబాల నుంచి సమాచారం సేకరించి సంబంధిత అధికారులతో సమన్వయం చేస్తున్నట్లు వెల్లడించారు. నేపాల్ లో నెలకొన్న పరిస్థితులు, అక్కడ తెలంగాణ వాసులు ఎంతమంది ఉండే అవకాశం ఉంది వంటి అంశాలపై డిజాస్టర్ మేనేజ్మెంట్ అధికారులతో గురువారం నాడు టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. నేపాల్‌లో నెలకొన్న పరిస్థితులను తెలంగాణ ప్రభుత్వం అత్యంత అప్రమత్తంగా, సీరియస్‌గా పర్యవేక్షిస్తోంది. కుటుంబ సభ్యులు, బంధువులు, సన్నిహితులు అందించిన సమాచారంతో 23 మంది తెలంగాణ వాసులను ప్రాథమికంగా గుర్తించాం. గుర్తించిన 23 మంది వివరాలను కేంద్ర ప్రభుత్వానికి పంపించాం. వారి ఆచూకీ, భద్రతపై కేంద్ర అధికారులతో నిరంతరం సమన్వయం చేస్తున్నాం. ఇంకా ఎవరైనా తెలంగాణ వాసులు నేపాల్‌లో చిక్కుకున్నట్లయితే వారి కుటుంబ సభ్యులు వెంటనే ప్రభుత్వానికి సమాచారం అందించాలి. బాధితుల పేరు, పాస్‌పోర్ట్ వివరాలు, మొబైల్ నంబర్, నేపాల్‌లో చివరిగా ఉన్న ప్రదేశం, ట్రావెల్/టూర్ ఆపరేటర్ వివరాలు, కుటుంబ సభ్యుల సంప్రదింపు నంబర్లు అందిస్తే సంబంధిత అధికారులతో సమన్వయం చేసి అవసరమైన సహాయం అందించేందుకు చర్యలు తీసుకుంటాం. తెలంగాణ భవన్ అధికారులు కేంద్ర విదేశాంగ మంత్రిత్వ శాఖ (ఎంఇఎ), కాఠ్మాండు భారత రాయబార కార్యాలయం, నేపాల్ అధికారులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నారు. పరిస్థితి పూర్తిగా సాధారణ స్థితికి వచ్చే వరకు తెలంగాణ ప్రభుత్వం అప్రమత్తంగా ఉండి, రాష్ట్రానికి చెందిన ప్రతి ఒక్కరి భద్రతకు అవసరమైన సహాయాన్ని అందిస్తుంది. తెలంగాణ భవన్ ప్రత్యేక హెల్ప్‌లైన్ నంబర్లు 9871999044, 9949351270, 9618597969. తెలంగాణ సచివాలయం ప్రత్యేక కంట్రోల్ రూమ్‌నేపాల్‌లో చిక్కుకున్న లేదా ప్రభావితమైన తెలంగాణ ప్రజల కుటుంబ సభ్యులు సమాచారం కోసం అధికారులను సంప్రదించవచ్చు:ఎస్. లక్ష్మీనారాయణ - అసిస్టెంట్ సెక్రటరీ 9885371189, కె.శ్రీనివాస్‌రెడ్డి-సెక్షన్ ఆఫీసర్ 7997959754, ఇ.చిట్టిబాబు-సెక్షన్ ఆఫీసర్ 9440854433. నేపాల్‌లో చోటుచేసుకున్న విషాదకర పరిస్థితులపై మంత్రి పొంగులేటి తీవ్ర విచారం వ్యక్తం చేశారు.

విపత్తులో చిక్కుకున్న తెలంగాణ ప్రజలకు సాధ్యమైనంత త్వరగా సహాయం అందేలా రాష్ట్ర ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని,నేపాల్‌లో ఉన్న వారి కుటుంబ సభ్యులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అన్నారు.

### భూపాలపల్లి మైన్స్ ఎడి ఇంట్లో ఎసిబి సోదాలు

# 100 కోట్ల ఆస్తులు గుర్తింపు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఆగస్టు27:** జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని మైన్స్ అండ్ జియాలజీ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్‌గా, ప్రస్తుతం వరంగల్ మైన్స్ అండ్ జియాలజీ శాఖ డిప్యూటీ డైరెక్టర్‌గా ఫుల్ అడిషనల్ చార్జ్ నిర్వహిస్తున్న బొజ్జ జయరాజుపై వరంగల్ రేంజ్ ఏసీబీ ఆదాయానికి మించిన ఆస్తుల కేసు నమోదు చేసింది. విధి నిర్వహణలో అవినీతికి పాల్పడి అక్రమాస్తులు కూడబెట్టినట్లు ఆయనపై ఆరోపణలు ఉన్నాయి. గత కొన్ని నెలలుగా ఆయన స్థిర చరాస్తులపై నిఘా పెట్టిన ఏసీబీ అధికారులు ఈ రోజు తెల్లవారుజాము నుంచి హైదరాబాద్, వరంగల్, సూర్యాపేట, తుంగతుర్తి ప్రాంతాల్లో సోదాలు చేసింది. అనిశా జాయింట్ డైరెక్టర్ సాయి మనోహర్ ఆధ్వర్యంలో సోదాలు చేసిన అధికారులు హైదరాబాద్ బోడుప్పల్‌లోని అయన నివాసం, బంధువులు ఇళ్లు, సూర్యాపేట, తుంగతుర్తి లోని బంధువుల ఇళ్లు, అతని డ్రైవర్ నివాసం సహా మొత్తం 8 ప్రాంతాల్లో ఏక కాలంలో అనిశా అధికారులు సోదాలు నిర్వహించారు. సోదాల్లో భాగంగా ఏసీబీ అధికారులు జయరాజుకు చెందిన భారీగా అక్రమాస్తులు గుర్తించారు. హైదరాబాద్‌లోని బోడుప్పల్‌లో మూడంస్తుల భవనం, హైదరాబాద్ కేపీహెచ్‌బీ కాలనీలో అపార్ట్మెంట్ ఫ్లాట్, హైదరాబాద్ కీసరలో రెండు ఓపెన్ ప్లాట్లు, తుంగతుర్తి, తూప్రాన్, సూర్యాపేటలో ఒక్కో ప్లాట్‌ను ఏసీబీ గుర్తించింది. సూర్యాపేటలో 3.21 ఎకరాల వ్యవసాయ భూమి, బోడుప్పల్ ఆయన నివాసంలో సోదాల సమయంలో రూ.10 లక్షల నగదు, ఎల్ఐసీ, మ్యాక్స్ సేవింగ్స్ డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకున్నారు. వీటిలో పాటు మూడు కార్లు, రెండు ద్విచక్ర వాహనాలు, రూ.20 లక్షల పోస్ట్ ఆఫీస్ సేవింగ్స్, 629 గ్రాముల బంగారు ఆభరణాలు సోదాల్లో గుర్తించింది. రూ.10 లక్షల విలువ చేసే గృహోపకరణాలు, మొత్తం మూడు బ్యాంకు ఖాతాల్లోని రూ.71.27 లక్షల నిల్వ గుర్తించారు. అంతే కాకుండా సోదాలు, ప్రాథమిక విచారణ సమయంలో జైరాజు డ్రైవర్ సత్తునూరి యాదయ్య మొబైల్ ఫోన్‌లో కీలక సమాచారాన్ని ఏసీబీ అధికారులు గుర్తించారు. డ్రైవర్ బ్యాంకు ఖాతా నుంచి నిందిత అధికారి కుమార్తె బ్యాంకు ఖాతాకు పలు లావాదేవీల ద్వారా సుమారు రూ.24.80 లక్షలు బదిలీ అయినట్లు ప్రాథమికంగా గుర్తించారు. దీనిపై విచారించగా ఇసుక రవాణా, సంబంధిత కార్యకలాపాల్లో పాల్గొన్న వ్యక్తుల నుంచి ఆ మొత్తాన్ని వసూలు చేసి తన ఖాతాకు పంపి వాటిని తిరిగి కుమార్తె ఖాతాకు బదిలీ చేసినట్లు డ్రైవర్ తెలిపాడు. ఏడీ జయరాజు ఇళ్లల్లో జరిగిన ఏసీబీ సోదాల్లో రూ.100 కోట్ల ఆస్తులను గుర్తించారు. కాగా జైరాజు అరెస్ట్ చేసిన ఏసీబీ హైదరాబాద్ తరలించనున్నారు. విచారణ అనంతరం రిమాండ్ కు తరలించే అవకాశం ఉంది.




గురువారం అధికారులతో నిర్వహించిన సమీక్షలో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

## తెలంగాణలో ఐదు నుంచి పదిలక్షల మె.ట సామర్థ్యంతో ధాన్యాగారపు గాదెల నిర్మాణం

### జిఇఎం, తెలంగాణ ఇ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా పారదర్శకంగా ధాన్యం వేలం: మంత్రి ఉత్తమ్ కుమార్

**హైదరాబాద్, ఆగస్టు 27 ప్రభాతవార్త:** తెలంగాణలో ఏటేటా వరి సాగు విస్తీర్ణం తోపాటు, ధాన్యం దిగుబడి పెరగడంతో శాస్త్రీయ పద్దతిలో వాటిని నిల్వ చేయడానికి అత్యాధునిక ధాన్యాగారాల గాదెల నిర్మాణానికి సమగ్ర ప్రణాళిక రూపొందించాలని నీటిపారుదల, పౌర సరఫరాల మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ తెలంగాణ రాష్ట్ర పౌర సరఫరాల సంస్థను ఆదేశించారు. పౌర సరఫరాల సంస్థ కార్యకలాపాలపై సీనియర్ అధికారులతో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి గురువారం సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో ఐదు నుంచి పది లక్షల అదనపు మెట్రిక్ టన్నుల నిల్వ సామర్థ్యాన్ని సృష్టించే దిశగా ప్రణాళికలు సిద్ధం చేయాలని స్పష్టం చేశారు. ఆహారభద్రత, మహిళా ఆర్థిక భరోసాకు ఊతం ఇచ్చే విధంగా మహిళా స్వయం సహాయక సంఘాలను గాదెల నిర్మాణం, నిర్వహణలో పెద్ద భాగస్వాములను చేయాలని మంత్రి సూచించారు.సాంప్రదాయరీతిలో గోదాములు నిర్మాణం చేస్తే తరుగు నష్టం ఎక్కువగా ఉంటాయనీ అభిప్రాయపడ్డారు.తేమ, పురుగులు, ఇతర నిల్వ సంబంధిత కారణాలతో ధాన్యం నష్టపోకుండా సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించాలని సూచించారు. ధాన్యం నిల్వ నుంచి తరలింపు వరకు ప్రతి దశలో నాణ్యత, భద్రత, సామర్థ్యాన్ని పెంచే విధంగా సైలో వ్యవస్థ ఉండాలని పేర్కొన్నారు.మహిళా స్వయం సహాయక సంఘాలు, గ్రామస్థాయి సంస్థలు, పౌర సరఫరాల సంస్థ భాగస్వామ్యంతో ఆధునిక సైలోల నిర్మాణం, నిర్వహణ చేపట్టేందుకు అనువైన నమూనాలను అధ్యయనం చేయాలని మంత్రి ఆదేశించారు. ఆటోమేటెడ్ హ్యాండ్లింగ్, శాస్త్రీయ సంరక్షణ, యాంత్రిక రవాణా, డిజిటల్ పర్యవేక్షణ వంటి అత్యాధునిక సాంకేతిక వ్యవస్థలతో కూడిన నిల్వ నెట్‌వర్క్ అవసరమన్నారు.ఇందులో పౌర సరఫరాల సంస్థ, మహిళా సంఘాలు, ఇతర భాగస్వామ్య సంస్థల బాధ్యతలను స్పష్టంగా నిర్వచించాలని చెప్పారు. సైలోలు రాబోయే దశాబ్దాల అవసరాలను ముందుగానే అంచనా వేసి నిర్మించాల్సిన ఆవశ్యకత ను ఆయన వివరించారు.ప్రస్తుతం తెలంగాణలో పౌర సరఫరాల సంస్థ, తెలంగాణ రాష్ట్ర గిడ్డంగుల సంస్థ, కేంద్ర గిడ్డంగుల సంస్థ, భారత ఆహార సంస్థ, వ్యవసాయ మార్కెట్ కమిటీలు, ప్రైవేటు పెట్టుబడిదారుల గోదాముల ద్వారా ధాన్యం నిల్వ సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని మంత్రి పేర్కొన్నారు.తెలంగాణ రాష్ట్ర గిడ్డంగుల సంస్థకు సొంతంగా సుమారు 6 లక్షల మెట్రిక్ టన్నుల నిల్వ సామర్థం ఉన్నప్పటికీ, ప్రతి సీజన్‌లో భారీగా సేకరిస్తున్న ధాన్యాన్ని నిల్వ చేసేందుకు ఇతర సంస్థలు, అద్దె గోదాములపై ఆధారపడాల్సి వస్తోందన్నారు.90లక్షల మెట్రిక్ టన్నుల సేకరణకు సిద్ధమైన వ్యవస్థ ఉండాలిని అన్నారు. డిఫాల్టర్ కస్టమ్ రైస్ మిల్లర్ల నుంచి రావాల్సిన బకాయిల వసూలును వేగవంతం చేసేందుకు సమర్థవంతమైన కార్యాచరణ రూపొందించాలని మంత్రి పౌర సరఫరాల సంస్థను ఆదేశించారు..డిఫాల్టర్లపై చేపట్టే న్యాయపరమైన, విజిలెన్స్, పరిపాలనాపరమైన చర్యలన్నింటిలోనూ ప్రజాధనం తిరిగి రాబట్టడమే ప్రధాన లక్ష్యంగా ఉండాలని మంత్రి స్పష్టం చేశారు.ధాన్యం వేలంలో పూర్తి పారదర్శకధాన్యం నిల్వల ప్రతిపాదిత వేలంపైనా మంత్రి సమీక్షించారు. తదుపరి విడత వేలం ప్రారంభించే ముందే లాట్ పరిమాణాలు, బిడ్డింగ్ నిబంధనలు, వేలం నిర్వహించే వేదికలను ఖరారు చేయాలని అధికారులను ఆదేశించారు . జి ఇఎం, తెలంగాణ ఈప్రొక్యూర్‌మెంట్ ద్వారా పారదర్శకంగా ధాన్యం వేలం ప్రక్రియలో పారదర్శకత, ఏకరూపత, విస్తృత భాగస్వామ్యం ఉండేలా చూడాలని అన్నారు. గవర్నమెంట్ ఈమార్కెట్‌ప్లేస్ , తెలంగాణ ఈప్రొక్యూర్‌మెంట్ పోర్టల్ వంటి గుర్తింపు పొందిన ప్రభుత్వ వేదికలను వినియోగించే అవకాశాలను పరిశీలించాలని సూచించారు. ఈ సమీక్ష సమావేశంలో పౌర సరఫరాల అదనపు సంచాలకులు రోహిత్ సింగ్, పౌర సరఫరాల సంస్థకు చెందిన ఇతర సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

## సర్ ప్రక్రియపై ప్రశాంతంగా సాగిన గ్రామ, వార్డు సభలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఆగస్టు27:** ఓటరు జాబితా ప్రత్యేక సవరణ(సర్) ఫేజ్2 ప్రక్రియలో భాగంగా గురువారం రాష్ట్రవ్యాప్తంగా గ్రామ, వార్డు సభలు ప్రశాంతంగా జరిగాయి. వివిధ కారణాలతో ఇప్పటికే తొలగించిన ఓటర్లలో అర్హులుంటే గుర్తించేందుకు ఈ సభలు నిర్వహించారు. కొత్త ఓటర్ల నమోదు, అడ్రస్, ఇతర వివరాల మార్పుపై అవగాహన కల్పించారు. ఎస్ఐఆర్‌లో భాగంగా అధికారులు ఇప్పటికే నోటీసులు జారీ చేసి వివరణలు నమోదు చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 92 లక్షల మంది ఓటర్లకు నోటీసులు జనరేట్ చేసి పంపిణీ చేస్తున్నారు. రాష్ట్రంలోని 36,353 పోలింగ్ కేంద్రాల పరిధిలో ఈ సభలు నిర్వహించారు. గ్రామ, వార్డు సభల నిర్వహణపై జిల్లా కలెక్టర్లు, ఈఆర్ఓలు, ఏఈఆర్‌వోలపై సీఈవో సుదర్శన్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి మార్గదర్శకాలపై దిశానిర్దేశం చేశారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు 3.38 కోట్ల ఓటర్లు ఉండగా ఇటీవల ఎన్యుమరేషన్ ప్రక్రియ తర్వాత 73.39 లక్షల ఓట్లు తొలగించారు.

మరణించిన, చిరునామా మార్చిన డూప్లికేట్, అందుబాటులో లేని ఓటర్లను తొలగించినట్లు సీఈవో కార్యాలయం ప్రకటించింది. అలా తొలగించిన ఓటర్ల పేర్లను గ్రామసభల్లో చదివి వినిపిస్తారు. తొలగించిన ఓటర్లలో అర్హులుంటే గుర్తించి తిరిగి చేర్చే ప్రక్రియ చేపడతారు. ముసాయిదా జాబితాలో అనర్హులు, బోగస్ ఓటర్లున్నా స్థానికుల నుంచి అభ్యంతరాలు, వివరాలు నమోదు చేస్తారు. అక్టోబరు 1 నాటికి 18 ఏళ్లు నిండే యువతకు ఓటు నమోదు చేసేందుకు ఫారం 6, డిక్లరేషన్ ఇస్తారు. కొత్త ఓటు లేదా వివరాల మార్పు కోసం గ్రామసభల్లోనే ఫారం నింపి ఇవ్వొచ్చు. గ్రామ, వార్డు సభల్లో జరిగిన విషయాలన్నీ బీఎల్వోలు నమోదు చేయనున్నారు. నోటీసుల ప్రక్రియను వివరించి అవసరమైన ఫారాలు అందుబాటులో ఉంచుతారు. ముసాయిదా జాబితాలో ఉన్న 92.87 లక్షల ఓటర్లకు నోటీసులు జనరేట్ చేశారు. ఇప్పటికే పలు ప్రాంతాల్లో నోటీసులు ఇచ్చి వాటికి సమాధానాలు సేకరిస్తున్నారు. ఒకేసారి ఇస్తే రద్దీ ఏర్పడుతుందన్న ఉద్దేశంతో రోజూ కొద్ది మందికి ఇచ్చేలా జిల్లా కలెక్టర్లు ఏర్పాట్లు చేశారు. రాష్ట్రంలో 2002లో జరిగిన ఎస్ఐఆర్ వివరాలు ప్రస్తావించని వారితో పాటు వివరాల్లో స్పష్టత లేని వారికి కూడా నోటీసులు జారీ చేస్తున్నారు.

అన్‌మ్యాపింగ్, అనామలీస్ ఓటర్లుగా పేర్కొంటూ నోటీసులు ఇస్తున్నారు. నోటీసు ఎందుకు వచ్చింది? ఆధారాలు ఎప్పుడు? ఎక్కడ? ఎవరికి? సమర్పించాలో కూడా అందులో వివరిస్తున్నారు. ఎన్నికల కమిషన్ ప్రకటించిన 12 డాక్యుమెంట్లలో అవసరమైనవి తీసుకొని నమోదు చేసే ప్రక్రియ కొనసాగుతోంది.

సరైన ఆధారాలు ఇచ్చిన వారి ఓటు వెంటనే ఆన్‌లైన్‌లో తుది జాబితాలో చేరుస్తున్నారు. అక్టోబరు 15 నాటికి నోటీసులు, అభ్యంతరాలన్నీ పరిష్కరించి అక్టోబరు 19న తుది ఓటర్ల జాబితాను సీఈవో కార్యాలయం వెల్లడించనుంది.

## రాట్కో మ్లాడిచ్ మృతి

### 84 యేళ్ల వయసులో కన్నుమూత

**సరజేవో, ఆగస్టు 27:** బోస్నియా యుద్ధంలో మారణహోమం, యుద్ధ నేరాలకు పాల్పడినట్లు తేలి జీవిత ఖైదు అనుభవిస్తున్న మాజీ బోస్నియన్ సెర్బ్ సైనిక కమాండర్ రాట్కో మ్లాడిచ్ 84 ఏళ్ల వయసులో మృతి చెందాడు. నెదర్లాండ్స్‌లోని ది హేగ్‌లో ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలోని జైలు ఆసుపత్రిలో ఆయన కన్నుమూసినట్లు ఐరాస అధికారి, ఆయన న్యాయవాది వెల్లడించారు. ్యుగోస్లావియా విచ్ఛిన్నం అనంతరం 1992-95 మధ్య జరిగిన బోస్నియా యుద్ధంలో మ్లాడిచ్ అత్యంత కీలక వ్యక్తిగా ఉన్నాడు. సారాజేవో ముట్టడికి నాయకత్వం వహించిన ఆయన యుద్ధంలో జరిగిన అత్యంత దారుణమైన అకృత్యాలకు బాధ్యుడిగా నిలిచాడు. బోస్నియన్లు, క్రొయాట్లను లక్ష్యంగా చేసుకుని బోస్నియన్ సెర్బ్ దళాలు చేపట్టిన జాతి నిర్మూలన కార్యక్రమంలో ఆయన కీలక పాత్ర పోషించాడు. 2017లో ఐరాస యుద్ధ నేరాల ట్రైబ్యునల్ మ్లాడిచ్‌ను మారణహోమం, మానవాళికి వ్యతిరేక నేరాలు, యుద్ధ నేరాల్లో దోషిగా నిర్ధారించి జీవిత ఖైదు విధించింది. 1995లో జరిగిన స్రెబ్రెనికా మారణహోమం కూడా ఆయనపై నమోదైన నేరాల్లో ప్రధానమైనది. ఈ ఘటనలో 8,000 మందికి పైగా బోస్నియాక్ ముస్లిం పురుషులు, బాలురను హతమార్చారు. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత యూరప్‌లో జరిగిన అత్యంత ఘోరమైన దారుణంగా దీనిని పరిగణిస్తారు. మ్లాడిచ్ 2011లో సెర్బియాలో అరెస్టయ్యే వరకు దాదాపు 16 ఏళ్ల పాటు పరారీలో ఉన్నాడు.

అరెస్టు అనంతరం ఐరాస కస్టడీలోనే ఉన్నాడు. ఇటీవలి సంవత్సరాల్లో ఆయన ఆరోగ్యం క్షీణించడంతో పలుమార్లు ఆసుపత్రిలో చికిత్స పొందాడు. బోస్నియా యుద్ధంలో 1 లక్ష మందికి పైగా ప్రాణాలు కోల్పోగా, 10 లక్షల మందికి పైగా ప్రజలు నిరాశ్రయులయ్యారు.

# ఫ్లైఓవర్లు సంక్రాంతికి అందుబాటులోకి రావాలి



సెక్రెటేరియట్‌లో గురువారం రోడ్లు, జాతీయ రహదారుల ప్రాజెక్టుల పురోగతిపై సమీక్ష సమావేశం నిర్వహిస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

## హైదరాబాద్ - విజయవాడ రహదారి
## 6 ప్లస్-2గా విస్తరణ కోసం ప్రయత్నం
### ఆర్అండ్‌బి మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

**హైదరాబాద్, ఆగస్టు 27,ప్రభాతవార్త:**హైదరాబాద్ -విజయవాడ రహదారిపై నిత్యం ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్న 17 బ్లాక్‌స్పాట్‌లపై నిర్మించే ఫ్లైఓవర్లు దశల వారీగా సంక్రాంతి వరకు అన్ని అందుబాటులోకి రావాలని చిట్యాల ఫ్లైఓవర్ దసరనాటికి పూర్తికావాలని ఆర్అండ్‌బి మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అధికారులను ఆదేశించారు. సెక్రెటేరియట్‌లో గురువారం రోడ్లు భవనాల శాఖ పరిధిలోని పలు రోడ్లు, జాతీయ రహా దారుల ప్రాజెక్ట్స్ పురోగతిపై మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. హైదరాబాద్-విజయ వాడ రహదారిపై నిత్యం జరుగుతున్న ప్రమాదాలతో ఇప్పటికే వేల మంది తమ ప్రాణాలను కోల్పోయారని రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. గత వారం పది రోజుల్లో బావుల్లో చెరువుల్లో వాహనాలు పడటం కూడా జరిగిందని నీటివనరులు ఉన్న చోట రక్షణ లేని రోడ్లను గుర్తించాలని కోరారు. కోదాడ వద్ద జరిగిన బస్సు ప్రమాదంతో పాటు ఇటీవల జరిగిన పలు ప్రమాదాలపై మంత్రి అధికారులతో చర్చించి నివారణ మార్గాలను అన్వేషణ చేయాలని కోరారు. హైదరాబాద్ - విజయవాడ రహ దారిలో గుర్తించిన 17 బ్లాక్ స్పాట్స్ పై నిర్మిస్తున్న ఫ్లై ఓవర్లు,హై మాస్ట్ లైట్స్ పనులు వేగంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దాదాపు అన్ని ఫ్లై ఓవర్ల నిర్మాణ చివరి దశలో ఉన్నాయని అధికారులు మంత్రికి వివరించారు.పెద్దకాపర్తి ఫ్లై ఓవర్ ఇప్పటికే ట్రాఫిక్ అనుమతిస్తుండగా, సూర్యాపేట ఫ్లై ఓవర్ ట్రాఫిక్ అనుమతికి సిద్ధంగా ఉందన్నారు. చిట్యాల ఫ్లై ఓవర్ ఈ దసరా నాటికి పూర్తి చేయాలనీ,మిగతావి డిసెంబర్ చివరి నాటికి అందుబాటులోకి తేవాలని మంత్రి ఆదేశించారు. ఆ ఫ్లై ఓవర్ల నుండి ఈ సంక్రాంతికి వాహనాల రాకపోకలు సాగాలని అధికారులకు తేల్చి చెప్పారు.ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదాలపై,కొన్ని చోట్ల రహదారికి రెయిలింగ్ లేని వార్తలపై ఆరా తీసిన మంత్రి ఎన్‌హెచ్‌ఏఐ అధికారులకు పలు సూచనలు చేశారు. మూగ జీవులు రహదారిపైకి రాకుండా రెయిలింగ్ తో పాటు,రోడ్ సేఫ్టీ జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. నిత్యం జరుగుతున్న ప్రమాదాలు నివారించాలంటే ఈ రహదారి విస్తరణ పనులు త్వరగా చేపట్టాలన్నారు.6+2 రహదారి విస్తరణ కోసం ఇప్పటికే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారితో కలిసి కేంద్రమంత్రి నితిన్ గడ్కరీని పలుమార్లు కలిశామని గుర్తు చేశారు.తెలంగాణ రాష్ట్ర అభివృద్ధే తమ ధ్యేయమని, అందుకోసం తమకు ఎలాంటి భేషజాలు లేవు అని మంత్రి స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని ఇప్పటికే స్పష్టం చేశారన్నారు.రాష్ట్రం నుండి ప్రాతినిధ్యం వహిస్తున్న కేంద్ర మంత్రులతో కలిసి మరోక్కసారి కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ గారిని కలుస్తాం.. అవసరమైతే ప్రధాన మంత్రిని కలు స్తామన్నారు. ఎన్‌హెచ్ 65 విస్తరణ పనులతో పాటు, బుల్లెట్ ట్రైన్స్, ఇతర ఎన్‌హెచ్‌ఏఐ ప్రాజెక్ట్స్ త్వరగా చేపట్టాలని కోరతామని మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి పేర్కొన్నారు. సమీక్షలో ఆర్ అండ్ బి ఈఎన్సి లింగారెడ్డి, సి.ఇఇ వసంత్ నాయక్, ధర్మారెడ్డి, పలువురు ఎన్‌హెచ్ అధికారులు ఉన్నారు.

# రాఖీ పౌర్ణమికి 5,000 ప్రత్యేక బస్సులు

### టిజిఎస్ఆర్టీసీ విస్తృత ఏర్పాట్లు: మంత్రి పొన్నం ప్రభాకర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,ఆగస్టు27:**రాఖీ పౌర్ణమి పండుగ సందర్భంగా ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ) ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. ఆగస్టు 27 గురువారం నుంచి ఆగస్టు 31 సోమవారం వరకు ప్రయాణికుల సౌకర్యార్థం 5,000 ప్రత్యేక బస్సులను నడపనున్నట్లు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.ఈనెల 26న మిలాద్‌ఉన్‌నబీ, 28న రాఖీ పౌర్ణమి, 30న ఆదివారం సెలవు రావడంతో పండుగకు ముందే ప్రయాణికుల రద్దీ ప్రారంభ మవుతుందని మంత్రి తెలిపారు.

అలాగే తిరుగు ప్రయాణాల రద్దీ ఆగస్టు 30 ఆదివారం మధ్యాహ్నం నుంచి ఆగస్టు 31 సోమవారం వరకు కొనసాగే అవకాశం ఉందన్నారు.గత ఏడాది రాఖీ పౌర్ణమి సందర్భంగా 4,760 ప్రత్యేక బస్సులను నడిపించగా, ఈ ఏడాది ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా 240 బస్సులను అదనంగా పెంచి మొత్తం 5,000 ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసినట్లు మంత్రి వెల్లడించారు.

గత ఏడాది ప్రత్యేక బస్సుల ద్వారా సుమారు 3.68 కోట్ల మంది ప్రయాణికులు ప్రయాణించగా, అందులో 2.51 కోట్ల మంది మహిళా ప్రయాణికులు ఉన్నారని తెలిపారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఈసారి కూడా ప్రయాణికులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా రద్దీ ఉన్న ప్రాంతాలకు అదనపు బస్సులను అందుబాటులో ఉంచేలా చర్యలు చేపట్టినట్లు చెప్పారు.

రాఖీ పౌర్ణమి, తిరుగు ప్రయాణాల రద్దీ నేపథ్యంలో అవసరమైన చోట అదనపు బస్సులను నడపడంతో పాటు ప్రయాణికుల రద్దీని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించినట్లు మంత్రి తెలిపారు.

మహిళా ప్రయాణికులకు మహాలక్ష్మి పథకం కింద ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం యథావిధిగా కొనసాగుతుందని మంత్రి స్పష్టం చేశారు. పండుగ రద్దీ సమయంలో ఆర్టీసీ ఉద్యోగులు సమష్టిగా, ఓర్పుతో విధులు నిర్వహిస్తూ ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు.

రాఖీ పౌర్ణమి సందర్భంగా సొంతూళ్లకు వెళ్లే ప్రతి ఒక్కరూ సురక్షితంగా ప్రయాణించేలా టీజీఎస్ఆర్టీసీ అన్ని చర్యలు తీసుకుంటుందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.

# కోటి మంది మహిళలు కోటీశ్వరులే బృహత్‌సంకల్పం

### రాఖీ పౌర్ణమి పండుగ సందర్భంగా
### అక్కా చెల్లెళ్లకు సిఎం రేవంత్ శుభాకాంక్షలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఆగస్టు 27:** రాఖీ పౌర్ణమి పండుగ సందర్భంగా ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి రాష్ట్రంలోని అక్కచెల్లెళ్లకు శుభాకాంక్షలు తెలిపారు. అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల అనుబంధానికి ప్రతీకైన ఈ పండుగను అందరూ ఆనందంగా జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు. ప్రతి ఇంట్లో సుఖసంతోషాలు, ఆరోగ్యం వెల్లివిరియాలన్నారు. మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసి, ఆడబిడ్డలను కోటీశ్వరులను చేయాలనే లక్ష్యంతో ప్రజాప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోందన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే బృహత్ సంకల్పంలో భాగంగా అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తోందని సిఎం రేవంత్‌రెడ్డి తెలిపారు.

**అత్యంత గొప్ప బంధం సహోదరత్వం: మాజీ సిఎం కెసిఆర్**

సోదర సోదరీ ప్రేమాభిమానాలకు ప్రతీక, రాఖీ పండుగ సందర్భంగా బీఆర్ఎస్ అధినేత కే చంద్రశేఖర్ రావు రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. మానవ సంబంధాల్లో అత్యంత గొప్పదైన బంధం సహోదరత్వమని తెలిపారు. అక్కా తమ్ముళ్లు, అన్నా చెల్లెళ్ల అనుబంధం అజరామరమని అన్నారు. సహోదరత్వానికి ప్రతీకగా నిలిచిన రాఖీ బంధన్ పర్వదినం, భారత కుటుంబ జీవనంలో ప్రత్యేక సంప్రదాయ, సాంస్కృతిక వేడుకగా నిలిచిందని కేసీఆర్ తెలిపారు.ద్వేషము స్వార్థము వీడి, దేశ ప్రజలందరూ సౌభ్రాతృత్వంతో కలిసిమెలిసి జీవించడం ద్వారానే వసుధైక కుటుంబ భావన పరిఢవిల్లుతుందని కేసీఆర్ పేర్కొన్నారు.

**పరస్పర గౌరవం, బాధ్యతలకు నిదర్శనం: మంత్రి కొండా సురేఖ**

రాఖీ పండుగ కేవలం అన్నాచెల్లెళ్ల, అక్కాతమ్ముళ్ల అనుబంధానికి ప్రతీక మాత్రమే కాదని ప్రేమ, ఆప్యాయత, పరస్పర గౌరవం, బాధ్యతలకు నిదర్శనంగా భారతీయ సంస్కృతిలో ఈ పండుగకు చారిత్రక ప్రాధన్యత వున్నదని అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి శ్రీమతి కొండా సురేఖ అన్నారు. శుక్రవారం (ఆగస్టు 28) రాఖీ పౌర్ణమిని పురస్కరించుకుని మంత్రి కొండా సురేఖ రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. భారతీయ తాత్విక దృక్పథంలో అనుబంధం అనేది కేవలం రక్త సంబంధంతో మాత్రమే ఏర్పడేది కాదని,ఇరువురు వ్యక్తుల మధ్య పరస్పర విశ్వాసం,బాధ్యతలతో ఈ బంధం బలపడుతుందని మంత్రి పేర్కొన్నారు. రక్తసంబంధం లేకపోయినా ఎంతోమంది సోదరసోదరీమణులు ఈ పండుగను తమ ఆప్యాయత, అనురాగాలకు ప్రతీకగా జరుపుకుంటారని మంత్రి అన్నారు. రాఖీ కట్టడం ద్వారా సోదరి తన ప్రేమను, నమ్మకాన్ని వ్యక్తం చేస్తే, సోదరుడు ఆమెకు అండగా నిలవాలనే బాధ్యతను స్వీకరించే సంప్రదాయం ఈ పండుగలో అంతర్లీనంగా వుందని మంత్రి తెలిపారు.

**ప్రేమ, ఆప్యాయతకు ప్రతీక: మంత్రి పొన్నం ప్రభాకర్**

రాఖీ పౌర్ణమి సందర్భంగా రాష్ట్ర ప్రజలందరికీ రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల మధ్య ఉన్న ప్రేమ, ఆప్యాయత, అనుబంధానికి ప్రతీకగా రాఖీ పౌర్ణమి నిలుస్తుందని మంత్రి పేర్కొన్నారు. కుటుంబ బంధాలను మరింత బలోపేతం చేసే ఈ పవిత్రమైన రోజున ప్రతి కుటుంబంలో ఆనందం, సంతోషం వెల్లివిరియాలని ఆకాంక్షించారు. తెలంగాణ ఆడబిడ్డల సంక్షేమం, భద్రత, సాధికారతకు ప్రజా ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.

# క్రీడల్లో భారత్‌ను అగ్రస్థానానికి చేర్చడమే లక్ష్యం

### కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి
### ఇఫ్లూలో సందడిగా ఖేలో ఇండియా డైలాగ్ : 'ఖేల్ కీ బాత్ పిఎం కే సాత్' కార్యక్రమం

**హైదరాబాద్ (తార్నాక), ఆగస్టు 27, ప్రభాతవార్త:** క్రీడలకు సమాన ప్రాధాన్య మిస్తూ యువ క్రీడాకారులను ప్రోత్సహించాల్సిన బాధ్యత విద్యార్థులు, తల్లి దండ్రులు, ఉపాధ్యాయులు, విద్యాసంస్థలపై ఉందని కేంద్రమంత్రి జి. కిషన్‌రెడ్డి అన్నారు. జాతీయ క్రీడాదినోత్సవం సందర్భంగా గురువారం ఉస్మా నియా యూనివర్సిటీ సమీపంలోని ఇఫ్లూలో గురువారం 'ఖేలో




క్రీడాకారులు, విద్యార్థులతో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

ఇండియా' కార్యక్రమంలో భాగంగా దేశంలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించడంతోపాటు యువతను ప్రోత్సహించడానికి ఏర్పాటుచేసిన ఖేలో ఇండియా డైలాగ్ – 'ఖేల్ కీ బాత్ పిఎం కే సాత్' కార్యక్రమంలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఈ కార్యక్రమనికి 10 లక్షల మంది పాల్గొన్నారని, ప్రధాని మోడీ నాయకత్వంలో క్రీడల అభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని కిషన్‌రెడ్డి తెలిపారు. గతంలో రాజకీయ జోక్యం, నిరక్ష్యం కారణంగా ప్రతిభ ఉన్న క్రీడాకారులకు తగిన అవకాశాలు దక్కలేదని పేర్కొన్నారు. కింది స్థాయి నుంచే క్రీడలను ప్రోత్సహించడంతో అంతర్జాతీయ పోటీల్లో భారత్ పతకాల సంఖ్య పెరుగుతోందన్నారు. అంతర్జాతీయ పోటీలకు వెళ్లే క్రీడాకారులను ప్రధాని మోదీ స్వయంగా కలసి ప్రోత్సహిస్తున్నారని తెలిపారు. విజయం సాధించినప్పుడు అభినందించడంతో పాటు ఓటమి ఎదురైనప్పటికీ నిరుత్సాహపడకుండా ధైర్యం చెబుతున్నారని పేర్కొన్నారు. క్రీడాకారులకు పౌష్టికాహారం, నచ్చిన దేశంలో నచ్చిన కోచ్‌లతో శిక్షణ వంటి సౌకర్యాలను ప్రభుత్వం కల్పిస్తోందన్నారు.2030 కామన్వెల్త్ గేమ్స్‌కు భారత్ ఆతిథ్యం ఇవ్వనుందని, 2036 ఒలింపిక్స్ భారత్ లో నిర్వహించేలా ప్రయత్నాలు కొనసాగుతున్నాయని కిషన్‌రెడ్డి తెలిపారు. అప్పటికి ప్రపంచ క్రీడా రంగంలో భారత్‌ను అగ్రస్థానంలో నిలపాలన్నదే లక్ష్యమన్నారు. చదువుతో పాటు క్రీడలకూ సమాన ప్రాధాన్యం ఇస్తే భవిష్యత్తులో భారతదేశం ప్రపంచ క్రీడా చిత్రపటంలో అగ్రస్థానానికి చేరుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇఫ్లూ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్. ఎన్. నాగరాజు, రిజిస్టర్ సిని మంచాల, యూత్ ఐకాన్ శ్రీజా జాదవ్, స్పోర్ట్స్ ఐకాన్ శ్రీమాన్షి వాలిశెట్టి, ఎడిజి. పిఐబి శ్రుతిపాటిల్‌తోపాటు పలువురు విద్యా ర్థులు ఉపాధ్యాయులు హాజరయ్యారు.




మహాధర్నాలో ప్రసంగిస్తున్న కూనంనేని సాంబశివరావు

# ధరలకు అనుగణంగా వేతనాలు పెంచకపోవడం సిగ్గుచేటు: కూనంనేని సాంబశివరావు విమర్శ

**హైదరాబాద్ (ధర్నాచౌక్), ఆగస్టు 27, ప్రభాతవార్త:** పెరిగిన ధరలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ కార్మికులకు వేతనాలు పెంచాల్సిందిపోయి తగ్గించడం సిగ్గు చేటని ఎమ్మెల్యే, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు విమర్శించారు.ప్రభుత్వ రంగంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులకు కనీస వేతనాలు పెంచుతున్నామని ప్రకటించి, అమలు చేయకపోవడం దుర్మార్గమని అగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ మున్సిపల్ స్టాఫ్ అండ్ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) ఆధ్వర్యంలో బుధవారం ఇందిరాపార్కు వద్ద జరిగిన మహాధర్నా కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. ప్రభుత్వం జిహెచ్‌ఎంసిని మూడు కార్పోరేషన్‌లుగా విభజించి మల్కాజ్‌గిరి, సైబరాబాద్ కార్పోరేషన్‌లలో మున్సిపల్ వేతనాలు ఇవ్వడం అన్యాయమని, 2వ పిఆర్‌సిని అమలు చేయడంతోపాటు జిహెచ్‌ఎంసిలో చెల్లించే వేతనాలను కార్మికులకు చెల్లిం చాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాకు యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఏసురత్నం అధ్యక్షత వహించగా, ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్‌రాజ్, కార్యదర్శి బి.వెంకటేశం, యూనియన్ ప్రధాన కార్యదర్శి జైపాల్‌రెడ్డి పి.వెంకటయ్య, బోడుపల్లి కిషన్, కమతం యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

# జిందాల్ గ్లోబల్ యూనివర్సిటీకి కెటిఆర్‌కు ఆహ్వానం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఆగస్టు 27:** బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు మరో ప్రతిష్ఠాత్మక ఆహ్వానం అందింది. హర్యానాలోని ప్రముఖ ఒపి జిందాల్ గ్లోబల్ యూనివర్సిటీకి విచ్చేసి విద్యార్థులు, అధ్యా పకులతో సంభాషించడంతో పాటు వారిని ఉద్దేశించి డిస్టింగ్విష్డ్ పబ్లిక్ లెక్చర్ ఇవ్వాలని యూనివర్సిటీ కేటీఆర్‌ను ఆహ్వానించింది. జిందాల్ గ్లోబల్ యూనివర్సిటీ వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ (డాక్టర్) సి. రాజ్ కుమార్ ఈ మేరకు కేటీఆర్‌కు ప్రత్యేకంగా లేఖ రాశారు. కేటీఆర్ రాక, ఆయన ఆలోచనలు, ప్రసంగం విద్యార్థులకు ఎంతో స్ఫూర్తి, ప్రేరణ కలిగిస్తాయని పేర్కొన్నారు. కేటీఆర్‌కు అను కూలమైన తేదీ, సమయాన్ని బట్టి సెప్టెంబర్, అక్టోబర్ 2026లో కార్యక్రమాన్ని నిర్వహిం చేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఈ సంద ర్భంగా యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన భారత్‌లోనే తొలి రాజ్యాంగ మ్యూజియం, రైట్స్ అండ్ ఫ్రీడమ్స్ అకాడమీని సందర్శించాలని కూడా కేటీఆర్‌ను ఆహ్వానించారు. భారత రాజ్యాంగం ఆమోదానికి 75 ఏళ్లు పూర్తైన సందర్భంగా ఏర్పాటు చేసిన ఈ రాజ్యాంగ మ్యూజియంలో రాజ్యాంగ నిర్మాణ సమయంలో ఎదురైన పోరాటాలు, సవాళ్లు, రాజ్యాంగ నిర్మాతల కృషిని ప్రతిబింబించేలా ప్రదర్శనలు ఏర్పాటు చేశారు.2009లో స్థాపించిన ఓ.పీ. జిందాల్ గ్లోబల్ యూనివర్సిటీ ప్రస్తుతం దేశంలోని ప్రముఖ బహుళ విభాగాల, పరిశోధనాధారిత విద్యా సంస్థల్లో ఒకటిగా గుర్తింపు పొందింది. ఇక్కడ 16 వేల మందికిపైగా విద్యార్థులు, 1,100 మందికిపైగా పూర్తిస్థాయి అధ్యాపకులు ఉన్నారు. 50కి పైగా దేశాలకు చెందిన అధ్యాపకులు, 160 దేశాలకు చెందిన విద్యార్థులతో అంతర్జాతీయ స్థాయిలో ప్రత్యేక గుర్తింపు పొందిన ఈ విశ్వవిద్యాలయం, ప్రపంచవ్యాప్తంగా 80 దేశాల్లోని 600కుపైగా ప్రముఖ సంస్థలతో భాగస్వామ్యాలు కలిగి ఉంది. జాతీయ, అంతర్జాతీయ స్థాయి ర్యాంకింగ్స్‌లోనూ జిందాల్ గ్లోబల్ యూనివర్సిటీ విశేష గుర్తింపు సాధించింది. టైమ్స్ హయ్యర్ ఎడ్యుకేషన్ ఆన్‌లైన్ లెర్నింగ్ ర్యాంకింగ్స్-2024లో గోల్డ్ రేటింగ్ పొందడంతో పాటు, క్యూఎస్, టైమ్స్ హయ్యర్ ఎడ్యుకేషన్ ర్యాంకింగ్స్‌లో వివిధ విభాగాల్లో ప్రముఖ స్థానాలు దక్కించుకుంది. 2020లో భారత ప్రభుత్వ విద్యా మంత్రిత్వ శాఖ నుంచి ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ ఎమినెన్స్ హోదాను కూడా పొందింది. గతంలో రాష్ట్రపతులు, ఉప రాష్ట్ర పతులు, భారత ప్రధాన న్యాయమూర్తులు, కేంద్ర మంత్రులు, గవర్నర్లు, సుప్రీంకోర్టు న్యాయ మూర్తులు సహా పలువురు ప్రముఖులు జిందాల్ గ్లోబల్ యూనివర్సిటీ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కేటీఆర్ ఈ ఆహ్వానాన్ని స్వీకరించి యూనివర్సిటీ విద్యార్థులు, అధ్యాపకులతో తన ఆలోచనలను పంచుకుంటారని వర్సిటీ వర్గాలు ఆశాభావం వ్యక్తం చేశాయి.

# కర్ణాటక విద్యుత్ అవసరాలకు సింగరేణి బొగ్గు

### యేటా మిలియన్ టన్నుల సరఫరాకు సిద్ధం
### గనుల్లో జాయింట్ వెంచర్‌గా పనిచేస్తాం
### ఆ రాష్ట్ర విద్యుత్ మంత్రి కె.కె.జార్జ్‌తో డిప్యూటీ సిఎం భట్టివిక్రమార్క భేటీ




**హైదరాబాద్, అగస్టు 27, ప్రభాతవార్త :** కర్ణాటక విద్యుత్ అవసరాల కోసం ఒడిస్సా రాష్ట్రంలోని నైని బొగ్గు గని నుంచి ఏడాదికి ఒక మిలియన్ టన్ను బొగ్గును అందించేందుకు సంసిద్ధంగా ఉన్నట్లు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ఇందులో భాగంగా కర్ణాటక పవర్ కార్పొరేషన్ లిమిటెడ్‌కి రోజుకు 4 బొగ్గు రేకులను సరఫరా చేయాలని సింగరేణి అధికారులను ఆదేశం చినట్లు తెలిపారు. బెంగళూరు పర్యటనలో గురువారం డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క కర్ణాటక విద్యుత్ శాఖ మంత్రి కె.జె. జార్జ్‌తో భేటీ అయ్యారు. రెండు రాష్ట్రాల మధ్య ఇంధన రంగ పురోగతి, బొగ్గు సరఫరా, బొగ్గు కొనుగోళ్ల చెల్లింపులు, సాంకేతికత మార్పిడిపై ఈ భేటీలో విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ కర్ణాటక జెన్కో క్యాప్టివ్ బొగ్గు గనులలో జాయింట్ వెంచరుగా పనిచేయడానికి ఆసక్తి చూపుతున్నట్లు తెలిపారు. పెరుగుతున్న విద్యుత్తు డిమాండుకు అనుగుణంగా తగినంత బొగ్గును అందించడం కోసం సింగరేణి, కర్ణాటక పవర్ కార్పొరేషన్ లిమిటెడ్ సంస్థలు భాగస్వామ్యంతో కలిసి పని చేద్దామని ప్రతిపాదించారు. పెరుగుతున్న కర్ణాటక విద్యుత్ అవసరాల నేపథ్యంలో కర్ణాటక పవర్ కార్పొరేషన్ లిమిటెడ్ ఛత్తీస్ గఢ్, ఒడిషా రాష్ట్రాల్లో చేపట్టిన క్యాప్టివ్ కోల్ బ్లాక్ లలో బొగ్గు తవ్వకం లో అనుభవం కలిగిన సింగరేణి సంస్థతో ఆ బ్లాకుల్లో మైనింగ్ జరపడానికి రెండు సంస్థలు కలిసి ముందుకుపోతే మంచిదన్నారు. సింగరేణి సంస్థకు బొగ్గు మైనింగ్ లో దాదాపు 137 సంవత్సరాల అనుభవం ఉందని, కర్ణాటక పవర్ కార్పొరేషన్ లిమిటెడ్ సంస్థ చేపట్టిన బొగ్గు బ్లాక్ లలో మైనింగ్ జరపగలదని తెలియచేశారు. అలాగే కర్ణాటక రాష్ట్రానికి విద్యుత్ రంగంలో ఉన్న అపార అనుభవాన్ని సింగరేణి సంస్థ కూడా తాను చేపట్టబోయే పవర్ ప్లాంట్ ల నిర్వహణలో వినియోగించుకోవచ్చని, ఈ విధంగా ఇరు రాష్ట్రాల ప్రభుత్వ సంస్థల పరస్పర సహకారంతో అభివృద్ధి విస్తరణ లక్ష్యంగా కలిసి పనిచేసే విషయమై అధ్యయనం చేయాలని సూచించారు. దీనిపై కర్ణాటక విద్యుత్ మంత్రి జార్జ్ సానుకూలంగా స్పందించారు. ఈ సందర్భంగా సింగరేణి సంస్థ కర్ణాటక రాష్ట్రానికి సరఫరా చేస్తున్న బొగ్గు పై కూడా చర్చించారు. కర్ణాటకలో పారిశ్రామిక ప్రగతి కారణంగా విద్యుత్‌కు విపరీతమైన డిమాండ్ పెరుగుతోందని, థర్మల్ పవర్ ప్రాజెక్టుల నిర్వహణకు తెలంగాణ నుంచి బొగ్గును నిరంతరం సరఫరా చేయాలని కోరారు. దీనిపై స్పందించిన భట్టి కేంద్ర బొగ్గు గనుల మంత్రిత్వ శాఖ కేటాయింపుల మేరకు బొగ్గు సరఫరా జరిగేలా చూస్తామన్నారు. కర్ణాటకకు ఇప్పటికే సింగరేణి ఏడాదికి బొగ్గు లింకేజీ ద్వారా 10.54 మిలియన్ టన్నుల బొగ్గును సరఫరా చేస్తోందన్నారు. సింగరేణి ప్రస్తుతం కర్ణాటకలోని ఎర్రమారుస్ థర్మల్ పవర్ ప్లాంట్ కు 5.24 మిలియన్ టన్నుల బొగ్గును, పాక్షిక లింకేజీ తో రాయచూరు లోని థర్మల్ పవర్ ప్లాంట్ కు 3.01 మిలియన్ టన్నులు, బళ్ళారి యూనిట్3 థర్మల్ ప్లాంట్ కు 2.29 మిలియన్ టన్నుల బొగ్గు సరఫరా చేస్తున్నామని వివరించారు. రోజుకు కనీసం 4 రేకుల ద్వారా బొగ్గు సరఫరా జరుగుతోందన్నారు. ఈ భేటీలో కర్ణాటక అడిషనల్ చీఫ్ సెక్రెటరీ గౌరవ్ గుప్తా, సింగరేణి సిఎండి డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి, కెపిసిఎల్ ఎం.డి రాజేంద్ర చోళన్, కెపిసిఎల్ ఫైనాన్స్ డైరెక్టర్ నాగరాజు, సింగరేణి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బి. వెంకన్న, జిఎం శ్రీనివాస్ తదిరులు పాల్గొన్నారు.

# హౌస్ అరెస్టులతో ప్రజాఉద్యమాలను ఆపలేరు

### బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు

**హైదరాబాద్ (తార్నాక), ఆగస్టు 27, ప్రభాతవార్త:** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎమర్జెన్సీ తరహా నిరంకుశ పాలన సాగిస్తోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు ఆరోపించారు. రామంతాపూర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ విద్యార్థులను పరామర్శించేందుకు గురువారం వెళ్తున్న తనను తార్నాకలోని నివాసంలో పోలీసులు హౌస్‌అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. పోలీసు నిర్బంధాలతో ప్రజా ఉద్యమాలను అడ్డుకోలేరని అన్నారు. పాలిటెక్నిక్ విద్యార్థుల భవిష్యత్తును జీవో 97 సంక్షోభంలోకి నెట్టిందని రాంచందర్‌రావు విమర్శించారు. ఇంజినీరింగ్‌లో ప్రవేశానికి ఉన్న ఈసెట్ అవకాశాలను దూరం చేసే ప్రయత్నాలను విరమించుకోవాలని, జీవో 97ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల సమస్యలపై ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీతో కాలయాపన చేయకుండా తక్షణ చర్యలు తీసుకోవాలన్నారు.ఆయుష్, మెడికల్ పీజీ విద్యార్థులకు స్టైఫండ్ విషయంలో ప్రభుత్వం అన్యాయం చేస్తోందని ఆరోపించారు. ఆంధ్రప్రదేశ్‌లో పీజీ విద్యార్థులకు రూ.26 వేలు, సూపర్ స్పెషాలిటీ విద్యార్థులకు రూ.30 వేల వరకు ఇస్తుండగా.. తెలంగాణలో రూ.13 వేల నుంచి రూ.15 వేలకే పరిమితం చేయడం సరికాదన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల విషయంలోనూ విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. పాలిటెక్నిక్ విద్యార్థుల సమస్యలపై బీజేపీ పోరాటం కొనసాగుతుందని



పోలీసులతో మాట్లాడుతున్న బిజెపి రాష్ట్ర చీఫ్ రాంచందర్‌రావు

రాంచందర్‌రావు స్పష్టం చేశారు. పోలీసు ఆంక్షలు తొలగిన వెంటనే విద్యార్థులను కలిసి వారికి అండగా నిలుస్తామని తెలిపారు. ఈ సందర్భంగా ఆయనను కలిసేందుకు మల్కాజ్గిరి ఎంపీ ఈటెల రాజేందర్, మాజీ మేయర్ బండ కార్తీక చంద్రారెడ్డి, నాయకులు శ్రీరామ్ వెంకటేష్, సీనియర్ నాయకులు బండ శివారెడ్డి, డివిజన్ అధ్యక్షులు ఉపేందర్ యాదవ్, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

# తుమ్మిడిహట్టి బ్యారేజ్‌పై సెప్టెంబరు 1న ఢిల్లీలో కీలక సమావేశం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,ఆగస్టు27:**ప్రాణహిత నదిపై తెలంగాణ ప్రభుత్వం ప్రతిపాదించిన తుమ్మిడిహట్టి బ్యారేజ్ నిర్మాణానికి సంబంధించిన సాంకేతిక, అంతర్రాష్ట్ర అంశాలపై సెప్టెంబర్ 1న ఢిల్లీలో కీలక సమావేశం జరగనుంది. కేంద్ర జల సంఘం (దిజూది) చైర్మన్ అధ్యక్షతన ఉదయం 11 గంటలకు సేవా భవన్‌లో జరిగే ఈ సమావేశంలో తెలంగాణ, మహారాష్ట్ర జలవనరుల శాఖల ఉన్నతాధికారులు పాల్గొంటారు. ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి చేసిన నిరంతర ప్రయత్నాల నేపథ్యంలోనే కేంద్ర జల సంఘం ఈ సమావేశాన్ని ఏర్పాటు చేసింది. తుమ్మిడిహట్టి ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లేందుకు సీఎం రేవంత్‌రెడ్డి మే 26న మహారాష్ట్ర ముఖ్యమంత్రికి లేఖ రాసి, రెండు రాష్ట్రాల మధ్య సమావేశం ఏర్పాటు చేసి పరస్పర ఆమోదయోగ్యమైన పరిష్కారం సూచించాలని కోరారు. ఈ అంశాన్ని ప్రధానమంత్రి దృష్టికి కూడా తీసుకెళ్లగా, ప్రధానమంత్రి కార్యాలయం జలశక్తి మంత్రిత్వ శాఖకు పంపించింది. అనంతరం ఆగస్టు 5న కేంద్ర జలశక్తి మంత్రి సి.ఆర్.పాటిల్‌కు సీఎం ప్రత్యేకంగా లేఖ రాసి కేంద్రం జోక్యం చేసుకోవాలని కోరారు. మహారాష్ట్ర గతంలో అంగీకరించిన 148 మీటర్ల ఎత్తుకు బదులుగా 152 మీటర్ల ఎత్తు ఉండేలా అంగీకారం సాధించేందుకు తెలంగాణ ప్రయత్నిస్తోంది. 148 మీటర్ల వద్ద అవసరమైన నీటిని గ్రావిటీ ద్వారా తీసుకోవడం సాధ్యం కాదని, భారీ పంపులు వినియోగిస్తే విద్యుత్ వ్యయం పెరుగుతుందని తెలంగాణ కేంద్రానికి వివరించింది.

తక్కువ విద్యుత్ వ్యయంతో, దీర్ఘకాలికంగా రాష్ట్రానికి ప్రయోజనం కలిగేలా ప్రాజెక్టును నిర్మించాలన్నదే తెలంగాణ ప్రభుత్వ ప్రధాన వాదన. సీడబ్ల్యూపీఆర్ఎస్ అధ్యయనాల ప్రకారం జలమట్టం పెంపుతో అదనపు ముంపు పరిమితంగానే ఉంటుందని కూడా ప్రభుత్వం కేంద్రం దృష్టికి తీసుకెళ్లింది. వెనుకబడిన, కరవు ప్రభావిత ప్రాంతాలకు సాగునీరు అందించే ఈ కీలక ప్రాజెక్టును త్వరగా కార్యరూపంలోకి తీసుకురావాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం కేంద్రం, మహారాష్ట్రతో వరుసగా సంప్రదింపులు కొనసాగిస్తోంది.

# నేను ఆంధ్ర ప్రాంతం వ్యక్తిని కాదు, కవిత వ్యాఖ్యలు అవమాకరం

### బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ చైర్మన్ శ్రీనివాస్

**హైదరాబాద్, ఆగస్టు 27,ప్రభాతవార్త:** చెప్పుడు మాటలు చేటు తెస్తాయని అది గమనించి మెదలు కోవాలని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవితకు తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ అధ్యక్షులు బసవరాజు శ్రీనివాస్ సూచించారు. గురువారం గాంధీ భవన్‌లో వైస్ చైర్మన్ సుబ్రహ్మణ్య ప్రసాద్ తో కలిసి ఆయన మీడియా తో మాట్లాడారు.వ్యక్తుల ప్రాంతీయతను ముందుకు తెచ్చి ఒక సామాజిక వర్గాన్ని విభజించే ప్రయత్నం చేయడం తగదన్నారు.తనను చైర్మన్‌గా ప్రభుత్వం నియమించడం వెనుక ఎలాంటి ప్రాంతీయ అంశం లేదని, బ్రాహ్మణ సమాజ సంక్షేమం కోసం పనిచేయాలన్న ఉద్దేశంతోనే బాధ్యతలు అప్పగించారని తెలిపారు. తాను ఆంధ్ర ప్రాంత వ్యక్తిని కాదని పూర్వికులు ఖమ్మం ప్రాంతావాసులని తాను నల్గొండ జిల్లా నడిగూడెంలో జన్మించానని విద్యాబ్యాసం మొత్తం తెలంగాణ లోనే సాగిందని ఆయన వివరించారు.పదవులు ప్రాంతంతో పాటు వారి సామర్థ్యం సేవా భావం, సమాజానికి చేసిన కృషిని పరిగణనలోకి తీసుకుని ఇస్తారని ఆ విషయం ఎంపి, ఎమ్మెల్సీగా చేసిన కెసిఆర్ బిడ్డ కవితకు తెలవక పోవడం విచారకరమన్నారు. తెలంగాణ ఉద్యమంలో బ్రాహ్మణ సమాజం కూడా తన వంతు పాత్ర పోషించిందని శ్రీనివాస్ పేర్కొన్నారు. తెలంగాణ లోని బ్రాహ్మణుల సంక్షేమం, పేద కుటుంబాలకు ఆర్థిక సహాయం, విద్యార్థులకు విద్యా అవకాశాలు, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే తన ప్రధాన లక్ష్యమన్నారు.బ్రాహ్మణ సమాజాన్ని రాజకీయాలకు అతీతంగా చూడాలని అన్నీ పార్టీల చెందిన బ్రాహ్మణ బంధువులు తన పదవి ప్రమాణ కార్యక్రమంలో పాల్గొన్నారని ఆ విషయం రక్షణ సేన లోని బ్రాహ్మణ వ్యక్తులను అడగాలని ఆయన కవితకు సూచించారు. పార్టీలు వ్యక్తులను పరిషత్ పట్టించుకోదని అది అందరికి ఉపయోగపడుతుందని తెలిపారు.

**వేలం ప్రకటన**

ఇందుమూలముగా సాధారణ ప్రజానీకానికి సమాచారం నిమిత్తం ప్రకటించునది ఏమనగా మల్హోత్రా ట్రైనింగ్ రెజిమెంట్, ఆర్టీ సెంటర్, గోల్కొండ, హైదరాబాద్ యొక్క ప్రాంగణంలోని 05 నం.ల ఆకుపచ్చని నిట్టనిలువు చెట్లు 10.09.2026న ఉ.11.30 గం. వద్ద డిఫెన్స్ ఎస్టేట్ కార్యాలయం, తెలంగాణ & ఆంధ్రప్రదేశ్ సర్కిల్, సికింద్రాబాద్-500003 యొక్క కార్యాలయంలో జరుగనున్న బహిరంగ వేలం ద్వారా విక్రయించబడునని తెలియచేయడమైనది. ఆ చెట్లు లొకేషన్ వద్ద 09.09.2026న ఉ.11.00 గం వద్ద కాంట్రాక్టర్‌కు చూపబడును. ఉద్దేశంగల కాంట్రాక్టర్లు స్థానిక మిలటరీ అథారిటీ (మొబైల్ నం.92844 35589)తో సంప్రదించి వాటిని సందర్శించటానికి మరియు సదరు చెట్లను తనిఖీ చేసుకోవటానికి అనుమతి పొందగలరు.

సం/- డిఫెన్స్ ఎస్టేట్స్ ఆఫీసర్
T & AP సర్కిల్, సికింద్రాబాద్


వార్త

శత్రువులోని మంచిని, మిత్రుడిలోని చెడును సమదృష్టితో చూడగలవాడు మహాత్ముడు.

- న-కన్ఫూషియస్

# మానవాళి తప్పిదాలతోనే.. విపత్తులు!

హఠాత్తుగా సంభవించిన విపత్తుకు హిమాలయ దేశం నేపాల్ చివురుటాకులగా వణికిపోయింది. వాతావరణంలో తలెత్తుతున్న అనూహ్య మార్పులు వైపరీత్యాలకు దారి తీస్తున్నాయి. హటాత్తుగా సంభవించిన మూడు జిల్లాల వరదలకు మృతులసంఖ్య ఐదు వందలకు చేరిందని అంచనా. ఇంచుమించుగా 1400మందికిపైగా ఆచూకీ కోసం అన్వే షిస్తున్నారంటే నేపాల్ చరిత్రలో ఇంతటి భారీ ఉపద్రవం ఇంతకుముందెన్నడూ చూడలేదనే చెప్పాలి. గ్రామాలకు గ్రామాలే కొట్టుకునిపోయాయి. లక్షలాదిమంది నిరాశ్రయులు కావడంతో ముందు వరదల్లో చిక్కుకున్న వారిని రక్షించడం ప్రధాన బాధ్యతగా మారింది. అసలే పర్యాటక దేశం కావడంతో 30 దేశాలకు పైగా యాత్రీకులు ఈ దేశ పర్యటనకు వచ్చారు. ఆకస్మిక వరదల్లో వీరంతా ఏమ య్యారన్నదే ఆయా దేశాల ఆందోళన. ఇంతటి భారీ విపత్తుకు మానవాళి తప్పిదాలేనా, లెక్కకుమించిన అంచనాలను అధిగమించిన పారిశ్రామికీకరణ కూడా కారణమేనా అన్న ప్రశ్నలు ఉత్పన్నం అవుతున్నాయి. హరిత వనాలు అంతరించిపోతూ ఆ ప్రాంతాల్లో పట్టణీకరణ పెరగడం కూడా ఇందుకు కారణమన్న పర్యావరణ వేత్తల హెచ్చరికలు పట్టించుకోకపోవడం కూడా ఇందుకు ప్రధాన కారణం అన్న భావన వ్యక్తం అవుతోంది. ఇందుకు ప్రధానంగా తప్పుపట్టాల్సింది నిందించాల్సింది మానవుని పర్యావరణ విధ్వంసక చర్యలే బీభత్సాలకు, విపత్తులకు కారణం అవుతున్నాయని ఇప్పటికే ఎన్నో అధ్యయనాలు స్పష్టం చేసాయి. పర్యావరణాన్ని కాపాడుకోలేకపోతే మానవుని మనుగడే భవిష్యత్తులో ప్రశ్నార్థకంగా మారుతుందని ఎందరో పర్యావరణ శాస్త్రవేత్తలు దశాబ్దాల తరబడి పదేపదే ఆందోళన వ్యక్తం చేస్తున్నా పట్టించుకున్న నాధుడే లేకుండా పోతున్నాడు. అభివృద్ధి పేరుతో ఆయా దేశాల ప్రభుత్వాలు చేస్తున్న కొన్ని కార్యక్రమాలు పర్యా వరణానికి చేటుచేస్తున్నాయి. తాజాగా ప్రకృతి ధాటికి బుధవారం నేపాల్ చివురుటాకులగా వణికిపోయింది. రాజధాని ఖాట్మండు సమీపంలోని రాసువా, దాడింగ్ జిల్లాల ఎగువప్రాంతాల్లో సంభవించిన ప్రకృతి ప్రకోపంతో మంచుకొండ విరిగి పడటంతో అనూహ్య రీతిలో నది ప్రవాహం నీటిమట్టాలు పెరిగాయి. ఒక్కసారిగా మెరుపు వరదలు సంభవించి లోతట్టుప్రాంతాలను ముంచెత్తి వేసాయి. టిబెట్‌లో మొదలయిన వరద, బురద ఉప్పెన ఉరుములేని మెరుపుల్లా వచ్చి నేపాల్ మధ్యప్రాంతాన్ని దాదాపు తుడిచిపెట్టేసిందనే చెప్పొచ్చు. గ్రామాలు, పట్టణాలు జలసమాధి అయ్యాయి. ఇప్పటివరకూ అందిన సమాచారం ప్రకారం దాదాపు 500 మందికిపైగా మృతిచెందినట్లు చెపుతుంటే వీరిలో భారతీయులే 300మందికిపైగా ఉన్నారు. వాస్తవంగా నేపాల్, టిబెట్ సరిహద్దుల్లోని బోటికోశి నది బుధవారం ఉదయం ఒక్కసారిగా ఉప్పొంగింది. మొత్తంగా ఏడు జిల్లాలకు పైగా విరుచుకుపడింది. అమెరికా, మలేసియా, దక్షిణాఫ్రికా, బ్రిటన్, నెదర్లాండ్స్, దక్షిణకొరియా తదితర దేశాల నుంచి వచ్చిన పర్యాటకుల జాడ తెలియడంలేదని చెపుతున్నారు. ఆ వరద ధాటికి నేపాల్ చైనా రోడ్డు మార్గం పూర్తిగా ధ్వంసం అయింది. బురదలో కూరు కుపోయిన ఆ ప్రాంతాన్ని భీతావహంగా మార్చింది. ఎటుచూసినా అడుగుల ఎత్తులో పేరుకుపోయిన బురద సాయం కోసం అర్థిస్తున్న జనం హాహాకారాలతో ఆప్రాంతం విషాద వాతావరణం రాజ్యమేలింది. సమాచారం అందుకున్న నేపాల్ సైన్యం సాయుధ పోలీస్ బలగాలు, నేపాల్ పోలీసులు జాతీయ విపత్తు విభాగ బలగాలు హుటాహుటిన రంగంలోకి దిగి బాధితులను కాపాడేందుకు సహాయక చర్యలు యుద్ధప్రాతిపదికన తీసుకున్నారు. అయితే మంచు కొండ విరిగిపడి వరదలు ఉధృతంగా వస్తున్న విషయం దాదాపు 45 నిమిషాలముందే చైనాకు తెలిసినా ఏమాత్రం సంకేతాలివ్వలేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే ఈ ఆరోపణలను చైనా తోసిపుచ్చుతున్నది. భారత్‌లోకూడా ఈ ఉపద్రవాలకు ఏమాత్రం లోటులేదు. మొన్న ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్‌లలో వరదల బీభత్సాన్ని చవిచూసింది. గతంలో కేరళలాంటి దేవభూమి, అసోంలలో వరదలతో ప్రకృతి బీభత్సం సృష్టించింది. భారత్ ఉపద్రవాల మాట ఎలా ఉన్నా తరచూ భూకంపాలకు లోనయ్యే నేపాల్‌లో ఈసారి చైనా సరిహద్దువైపునుంచే ముప్పేట ముప్పు వచ్చిందన్న ఆరోపణలకు ఈ వరదలు కూడా కారణం అవుతున్నాయి. ఈ ఆరోపణలకు మూలం కూడా ఉంది. నేపాల్, భారత్ సరిహద్దుల్లో భారత్‌ను లక్ష్యంగా చేసుకుని చైనా భారీ ఎత్తున జలవిద్యుత్‌ప్రాజెక్టులు చేపడుతున్న సంగతి తెలిసిందే. ఈ ప్రాజెక్టుపరిధిలో నీటిని వదిలిన పక్షంలో ముందుగా దెబ్బతినేది నేపాల్ ప్రాంతం. ఆపై భారత్‌లోని ఈశాన్యప్రాంతం అని ప్రత్యేకించి చెప్పాల్సిన పనిలేదు. ఈ ఆరోపణలన్నింటినీ డ్రాగన్ పాలకులు ఖండిస్తున్నా పర్యావరణ సమతుల్యత దెబ్బతినడం వల్లనే ఇలాంటి ముప్పు సంభవిస్తున్నదని విదేశీ శాస్త్రసాంకేతిక సంస్థలు చేస్తున్న హెచ్చరికలు ఈ దేశం పెడచెవిన పెట్టిందన్న భావన వ్యక్తం అవుతోంది. ముందు భూ కంపం వల్లనే ఈ వరదలు సంభవించాయని ఒకింత ఆందోళన వ్యక్తంచేసినా భారత అంతరిక్ష సంస్థ ఇస్రో, ఎన్ఆర్ఎస్ఎ, అమెరికా భూగర్భసర్వే సంస్థలు చేసిన అధ్యయన నివేదికలతో కేవలం మంచుకొండ పగలడం వల్లనే దిగువ ప్రాంతం మొత్తం జలమయం అయినట్లు నిర్ధారించారు. ఇలాంటి ఉపద్రవాల సమయంలో జరిగే ప్రాణ, ఆస్తినష్టాలను తగ్గించుకోగలిగితే అదే మేలు. ప్రస్తుత పరిస్థితుల నుంచి కోలుకునేందుకు ఈ దేశానికి వందలకోట్ల సాయం అవసరమేనన్నది నిర్వివాదాంశం. ఇలాంటి విపత్కరంలోనే ప్రపంచదేశాలు ఆపన్న హస్తం అందించాల్సిన అవసరముందని ప్రత్యేకించి చెప్పనవసరంలేదు.



మారణాయుధాలు మనల్ని నాశనం చేయకముందే మనం వాటిని నాశనం చేయడం మంచిది.

- జాన్ కెనడీ



యజమాని కావడం కోసం సేవకుడిగా నటిస్తాడు రాజకీయ నాయకుడు.

- చార్లెస్ డీగాల్

# సాంకేతిక సాక్ష్యాలను చట్టంలో చేర్చండి!

**నిజాలు బహిర్గతం కావడానికి ఒక అవకాశం ఉన్నట్లే అని ఎందుకు భావించకూడదు? పోలీసులు 'ఫేషియల్ రికగ్నిషన్‌న ఎక్విప్మెంట్ గొడవ జరుగుతున్న ఏరియాలో ఉందనీ, దాన్ని వినియోగించుకున్నామని ఎఫిడవిట్ ద్వారా కోర్టుకు తెలియపర్చారు. (ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ కెమెరాలు కూడా ఉన్నాయని చెబుతున్నారు) అయితే ఈ ఎక్విప్మెంట్ ప్రైవేట్ కాంట్రాక్టర్స్ ద్వారా వినియోగించుకోవడం జరిగింది. ఆ విధంగా చేయడం చట్టపరమా కాదా అనేది తేల్చాల్సి ఉంది. ఇలాంటి ఫేషియల్ ఎక్విప్మెంట్ వాడేందుకు చట్టమేమీలేదు. చట్టపరంగా చెల్లే విషయాన్ని అటుంచితే ముందుముందు ఇలాంటి ఉద్యమాలు చేసే వారికి ముఖ్యంగా జొరబడే సంఘ విద్రోహులకు భయాన్ని మాత్రం కలిగిస్తుంది. రైట్ టు ప్రైవసీ లాంటి విషయాలు కూడా వాదనపరంగా బయటకు వస్తాయి. చట్టపరమైన నిబంధనలు ఇలాంటి సాక్ష్యాలను బయటపెట్టే విషయంలో పరికరాల వాడకాన్ని ప్రభుత్వాలు చేయగలుగుతే పోలీసులు చట్టపరంగా పనిచేసే అవకాశం మరింతగా పెరుగుతుంది.**



రావులపాటి సీతారాంరావు

పోలీసు దర్యాప్తు కొత్త పుంతలు త్రొక్కుతున్న మాట నిజం! అయితే ఈ దర్యాప్తు చట్ట ప్రకారంగానే వుందా అన్న అనుమానాలు మీడియాతో పాటు, మేధావులు కూడా లేవనెత్తుతున్నారు! చట్టపరంగా పోలీసు పనితనాన్ని బలోపేతం చేయాల్సిన అవసరం సాంకేతికంగా అభివృద్ధి జరుగుతున్న ఈ తరుణంలో అవసరంగా మారింది! ప్రభుత్వాలు ఈ సందర్భంగా చట్టపరమైన నిబంధనలు త్వరగా చేయక తప్పదు!పోలీసులు చట్టానికి బాధ్యులు! చట్టప్రకారం ఏ చర్య అయినా వుండక తప్పదు! స్వాతంత్ర్యం తర్వాత కూడా పోలీసులను ప్రజలు తమలో కలుపుకోలేకపోతున్నారు. ఇప్పుడు ఆ కారణాలను వెతకాల్సిన అవసరం ప్రస్తుతానికి లేదు! బ్రిటిష్ వారి పాలనలో పోలీసులను మన దేశస్థులతో కఠినంగా వ్యవహరించే రీతిలో తీర్చిదిద్దారు! వారి అవసరాల నిమిత్తమే వాడుకున్నారు. అయితే బ్రిటిష్ దేశంలోని పోలీసులను మరోవిధంగాఅక్కడి ప్రభుత్వాలు చూసుకున్నాయి! ఇక్కడి పోలీసుల ముందు నిందితులు నేరాన్ని ఒప్పుకుంటే అది ఇక్కడి చట్టం ఒప్పుకోదు! అలాంటి నిబంధన ఏ ఇతర దేశాల్లో కూడా లేదని అంటారు. బ్రిటిష్ వారు వారి స్వార్థం కోసం అలాంటి పోలీసు యాక్టను అమలు చేసారు. వారు దేశం వదిలి వెళ్ళిన తర్వాత మన రాజ్యాంగ నిపుణులు కానీ, రాజకీయ నాయకులు కానీ, ప్రజాస్వామ్య వాదులు కానీ, ఈ చట్టాలను ముఖ్యంగా పోలీసులకు సంబంధించిన నిబంధనలను సవరించక పోవటంవల్ల, మన దేశ కాలమాన పరిస్థితులకు అనుగుణంగా మార్పులు, చేర్పులూ తేకపోవటం వల్ల ఇంకా మన పోలీసును మనమే నమ్మలేని స్థితిలో వున్నాం, వుంచుతున్నాం! బ్రిటిష్ పాలకులు మన దేశం వదిలి వెళ్లినా మన రాజకీయ నాయకులు ప్రజాస్వామ్య పరిధిలో పోలీసుల వృత్తి వ్యవహారాలకు సంబంధించి తగు మార్పులు, సంస్కరణలు పేరుకే తలపెట్టారు కానీ, వాటిని ఆచరణలో పెట్టిన దాఖలాలు లేనే లేవు! స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఈ ఎనభై ఏళ్ల చరిత్ర తవ్వుకోవాల్సిన అవసరం లేదు కానీ ఇప్పటి పాలకులు, అప్పటి పాలకులు వదిలివెళ్ళిన తర్వాత పోలీసులకు ఏం చేసారు అని విశ్లేషించుకోవటానికి పదవిలో వున్న రాజకీయ నాయకులు ఎవర్ని అడిగినా, చిరునవ్వుతో 'అడిగినవన్నీ ఇస్తున్నాం కదా! గ్రేహౌండ్స్, స్పెషల్ పోలీసు దళాలు పోలీసులకు ఇళ్ళు కట్టించటాలు' లాంటివి ఏకరవు పెడ్తారు! అదే మాటను అధికారంలో లేని వారిని అడిగితే 'అవ్వన్నీ మేము ఇచ్చినవే కదా! వాళ్ల ఖాతాలో వేసుకుంటున్నారు! అయినా పోలీసులు మాత్రం తక్కువా? ఎవరు పవర్లో వుంటే వారి భజనే చేస్తారు!' అని సన్నాయినొక్కులు బోనస్‌గా ఇస్తారు! పూర్వం రాజుల దగ్గర వుండే 'దెబ్బల అబ్బాయి' పరిస్థితిలా మారింది!ఎవరు అధికారంలో వున్నా, ప్రజాస్వామ్య పరిధిలో వున్నా, పోలీసుల పనితీరు ఎవరు అధికారంలో వుంటే వారికే వత్తాసు పలుకుతారు, చట్టాలకు కాదు అన్న అవగాహనతోనే ఈనాటి భారత పౌరులువుండటం దురదృష్టం! బ్రిటిష్ వారి పాలన తర్వాత పోలీసులకు సంబంధించినంతవరకూ సౌకర్యాలు కలిగించటం వేతనాలు పెంచటం, ఆరోగ్యభద్రత కల్పించటం లాంటి సంక్షేమ కార్యక్రమాలు ఏపార్టీ అధికారంలోకి వచ్చినా చేస్తునే వుంది.కానీ వారి 'ఇమేజ్'ను వృత్తిపరంగా వున్న బాధ్యతలను గౌరవించే ఏ చట్టం, ఏ సంస్కరణా, ఏ నిబంధనా, అర్థవంతంగా చేయకపోవటం, విశ్లేషణలో ఒక భాగంగా ఎవరైనా ఎత్తిచూపినా రాజకీయ నాయకులు పట్టించుకోవటం లేదు. ప్రజలు ఎన్నికల సమయంలో ఓటు వినియోగించుకోవటం మాత్రమే ప్రస్తుత పరిస్థితుల వల్ల చేయగలుగుతున్నారు. పోలీసులు ఈ సందర్భంగా ఎవర్నీ నిందించలేని అగమ్యగోచర పరిస్థితులలో వున్నారు! అత్యున్నతాధికారులు (అందరూ కాదు ఎక్కువమంది) అధికారంలో వున్నవారి ఆదేశాలనే (చట్ట ప్రకారం కాకపోయినా) పాటిస్తున్నారు! ఇతర దేశాల్లోమాదిరి కనీసం పోలీసు ముందు నేరం ఒప్పుదలను చట్ట పరిధిలోకి తీసుకొని వచ్చే అవకాశం పరిశీలించండి అని ప్రభుత్వాలకు విన్నవించుకొనే పరిస్థితిని కూడా కోల్పోయారు. ఇక సంస్కరణల మాట సరేసరి! అటకెక్కిన రిపోర్టులతో సరిపుచ్చుకుంటున్నారు! అనేక వైవిధ్యభరితమైన నేరాలను కానీ, ఛాలెంజి ధోరణిలో విస్తరిస్తున్న శాంతి భద్రతల సమస్యలను కానీ అందుబాటులోకి వచ్చిన సాంకేతిక నైపుణ్యాన్ని క్రమపద్ధతిలో, శాస్త్రీయంగా వినియోగించుకొనే ఎన్నో అవకాశాలను, అవగాహన వున్నా నిష్ణాతులైన ఉన్నతాధికారులు ఇంకా కొందరు పోలీసు వ్యవస్థలో బలమైన స్థంభాలుగా మారి శాఖాపరంగా సామర్థ్యాన్ని పెంపొందించాలని తహతహలాడుతున్నా, వారికి అధికారంలో వున్న వారి తోడ్పాటు కాగితాలకే పరిమితమవుతున్నది! చట్టపరంగా వృత్తి నైపుణ్యాన్ని పెంచే సామర్థ్యాన్ని చట్టాలు చేసే ప్రతినిధులు ప్రయార్టీ పరంగా ఎజెండాలోకి తీసుకోకపోవటం వల్ల పోలీసులు ప్రతి వైఫల్యానికీ జ్యుడిషియరీ ముందు తలదించుకోక తప్పటం లేదు. జ్యుడిషియరీ చాలా వరకు ఎత్తి చూపుతున్నా సవరించుకోవాల్సిన పాలకులుపట్టించుకోవటం లేదు! నిన్న గాక మొన్న ఢిల్లీ జంతర్ మంతర్ ఏరియాలో జరిగిన బొద్దింకల పార్టీ (కాక్రోచ్ జనతా పార్టీ) ఉద్యమంలో ఎందరో గాయపడ్డారు. పోలీసులకు కూడాగాయాలయ్యాయి! కేవలం విద్యార్థులే ఈ ఉద్యమంలో ఆవిధంగా బరితెగించటానికి కారణం పోలీసుల దురుసుతనం బలప్రయోగం పెల్లెట్లు తగిలేలా, లాఠీఛార్జీ భాష్పవాయు ప్రయోగాలతో సహా ఎన్నో చట్ట విరుద్ధమైన యాక్షన్ల వల్ల ఈ పరిస్థితి ఉద్భవించింది అని అంటున్నారు. శాంతియుతంగా జరుగుతున్న 'ప్రొటెస్టు'ను కాదనే హక్కు ఈ ప్రజాస్వామ్యంలో లేదు అని గట్టిగా వాదిస్తున్న తరుణంలో, పోలీసులు, సంఘ విద్రోహ శక్తులు ఈ ఉద్యమంలో జొరబడటం వల్లపోలీసుల చేయిదాటే పరిస్థితి ఏర్పడింది అని చెపుతున్నారు! సాక్ష్యాలు పోలీసుల వాదాన్ని బలపర్చేవి అఫిడవిట్ల ద్వారా ప్రవేశపెట్టమని సుప్రీంకోర్టు అడుగుతున్న నేపథ్యంలో నిజానిజాలు కొందరు (పోలీసులకు సానుభూతి పరులే కావచ్చు) పరిశీలించినప్పుడు కొన్ని విషయాలు బయటపడ్డాయి అని చెబుతున్నారు. 'ఫేస్ రికగ్నిషన్' ద్వారా (మొహం ద్వారా మనిషిని గుంపులో గుర్తుపట్టడం) ఈ మధ్య సాంకేతికంగా, నేరస్థులను పట్టుకుంటున్నారు. సిసి కెమెరాలతోసహా ఈ సాక్ష్యాలు చట్టపరంగా ప్రస్తుత చట్టాలు ఒప్పుకుంటాయా లేదా అనేది అనుమానాస్పదంగా మారింది. నిజాలు బహిర్గతం కావడానికి ఒక అవకాశం ఉన్నట్లే అని ఎందుకు భావించకూడదు? పోలీసులు 'ఫేషియల్ రికగ్నిషన్‌న ఎక్విప్మెంట్ గొడవ జరుగుతున్న ఏరియాలో ఉందనీ, దాన్ని వినియోగించుకున్నామని ఎఫిడవిట్ ద్వారా కోర్టుకు తెలియపర్చారు.(ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ కెమెరాలు కూడా ఉన్నాయని చెబుతున్నారు) అయితే ఈ ఎక్విప్మెంట్ ప్రైవేట్ కాంట్రాక్టర్స్ ద్వారా వినియోగించుకోవడం జరిగింది. ఆ విధంగా చేయడం చట్టపరమా కాదా అనేది తేల్చాల్సి ఉంది. ఇలాంటి ఫేషియల్ ఎక్విప్మెంట్ వాడేందుకు చట్టమేమీలేదు. చట్టపరంగా చెల్లే విషయాన్ని అటుంచితే ముందు ముందు ఇలాంటి ఉద్యమాలు చేసే వారికి ముఖ్యంగా జొరబడే సంఘ విద్రోహులకు భయాన్ని మాత్రం కలిగిస్తుంది. రైట్ టు ప్రైవసీ లాంటి విషయాలు కూడా వాదనపరంగా బయటకు వస్తాయి. చట్టపరమైన నిబంధనలు ఇలాంటి సాక్ష్యాలను బయటపెట్టే విషయంలో పరికరాల వాడకాన్ని ప్రభుత్వాలు చేయగలుగుతే పోలీసులు చట్టపరంగా పనిచేసే అవకాశం మరింతగా పెరుగుతుంది. ●




# అన్ని భాషలకు ఆధారమైనది సంస్కృతం

డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి

ఇండో యూరోపియన్ మాండలికాల నుండి ఆవిర్భవించిన అతి పురాతన సంస్కృత భాష హిందూ సమాజ ఆదరణ, ఆధ్యాత్మిక భావనలకు ప్రతిరూపంగా కొనసాగుతున్నది. వేదాలు, పురాణాలు, ఉపనిషత్తులు, ఇతిహాసాలకు నెలవుగా సంస్కృతం పేరు గాంచింది. భారతీయ నాగరితతో విడదీయరాని బంధాలను పెనవేసుకున్న సంస్కృత భాష ప్రాధాన్యాన్ని, ప్రయోజనాలను, పునరుజ్జీవన ప్రయత్నాలను, రేపటి తరానికి భాష రుచిని పరిచయం చేయడం, భాషా సౌందర్యాలను అవగాహన పర్చడానికి ప్రతి ఏటా శ్రావణ మాస పూర్ణిమ పుణ్య గడియల్లో, అనగా 28 ఆగష్టు 2026న 'విశ్వ సంస్కృత దివస్' లేదా 'ప్రపంచ సంస్కృత దినోత్సవం' పాటించడం 1969 నుంచి ఆనవాయితీగా మారింది. భారత్‌లో రక్షా బంధన్ లేదా రాఖీ పౌర్ణమి రోజున ప్రపంచ సంస్కృత దినం జరుపుకోవడం పరిపాటిఅయింది. ప్రముఖ సంస్కృత పండితుడు, వ్యాకరణ కర్త అయిన పాణిని జన్మదినం సందర్భంగా ప్రపంచ సంస్కృతి దినం పాటించడం ముదావహం. అత్యంత పురాతనమైన సంస్కృత భాషకు ప్రత్యేక లిపి ఇతర భాషల నుంచి ఉద్భవించింది. పాణిని, కాళిదాస్, పతంజలి, వేదవ్యాసుడు, ఆదిశంకరాచార్యుడు లాంటి ప్రముఖులు సంస్కృత భాషకు పట్టం కట్టిన వ్యక్తులుగా నిలిచిపోయారు. ఋషులను సంస్కృత సాహిత్య మూల వనరులుగా భావిస్తాం. అందువల్లనే శ్రావణిపూర్ణిమ లేదా రాఖీ పూర్ణిమను బుల్లిట్ పర్వంగానే కాకుండా ప్రపంచ సంస్కృత దినం పాటిస్తున్నాం. అన్ని భారతీయ భాషలకు తల్లి అయిన సంస్కృతాన్ని 'అన్ని భాషల తల్లి' అని పిలుస్తున్నాం. దాదాపు 3500 ఏండ్ల క్రితం భారతంలో పుట్టిన సంస్కృతాన్ని దేవతల భాషగా పిలుస్తాం. సంస్కృత భాషను కంప్యూటర్ సైన్స్, తత్వశాస్త్రం, ఆధ్యాత్మికత, గణితం, మత సంప్రదాయాలు, సాహిత్యం, కళల అభివృద్ధికి ఉపగించడం సంతోషదాయకం. సంస్కృత భాష నుంచి ప్రఖ్యాత నినాదాలు పుట్టడం, ప్రజాదరణ పొందడం జరిగింది. 'సర్వే భవంతు సుఖినః (అందరూ సంతోషంగా ఉండాలి)', 'విద్యా దదాతి వినయం (జ్ఞానం వినయాన్ని ఇస్తుంది', 'సత్యం వధ ధర్మం చర (నిజం మాట్లాడండి, ధర్మాన్ని పాటించడం)', లోకః సమస్తాః సుఖినో భవంతు (అని లోకాల జీవులు సంతోషంగా ఉండాలి)' లాంటివి బహుళ ప్రచారం, ప్రభావాలను కలిగి ఉంటూ, సామాన్య జనాలు నాలుకల్లో నానుతూ ఉన్నాయి. కంప్యూటర్ సైన్స్, కృత్రిమమేధ, డిజిటల్ భాషాశాస్త్రంలో సంస్కృతం పాత్ర వెలకట్టలేనిది. ప్రపంచ సంస్కృతదినం రోజున విద్యాలయాల్లో సంస్కృత శ్లోకాల పఠనం, వ్యాస రచన, ఉపన్యాస, పేయింటింగ్, డ్రాయింగ్ పోటీలను నిర్వహించవచ్చు. అదే విధంగా సెమినార్లు, వెబినార్లు, కార్యశాలలు, ప్రవచనాలు లాంటి కార్యక్రమాలను కూడా నిర్వహించవచ్చు. విద్యార్థులు, యువత, భాషావేత్తలు, ఉపాధ్యాయులు, భాషా సంఘాలు చేయిచేయి కలిపి సంస్కృత పునర్ వైభవానికి కృషి చేస్తూ, మన భాషా తల్లిని ప్రపంచమానవాళికి రుచి చూపే ముమ్మర ప్రయత్నాలు చేద్దాం. ●

# పిల్లల భవిష్యత్తు ఎవరి చేతుల్లో?

తరిగోపుల నారాయణస్వామి

ప్రస్తుత సమాజంలో పిల్లల పెంపకం, విద్య, క్రమశిక్షణ, మానసిక ఒత్తిడి వంటి అంశాలు అత్యంత ఆందోళన కలిగిస్తున్నాయి. ఒకప్పుడు తల్లిదండ్రులు చెప్పిన మాటకు, ఉపాధ్యాయులు చెప్పిన మాటకు ఎంతో విలువ ఇచ్చే పిల్లలు ఇప్పుడు చిన్నచిన్న విషయాలకే తీవ్రంగా స్పందిస్తున్న ఘటనలు మన ముందుకు వస్తున్నాయి. సెల్‌ఫోన్ కొనివ్వలేదని ఆత్మహత్య చేసుకోవడం, తల్లిదండ్రులు మందలించారని ప్రాణాలు తీసుకోవడం, ఉపాధ్యాయుడు మందలించాడని మనస్తాపానికి గురికావడం వంటి సంఘటనలు కేవలం పిల్లల సమస్యలుగా కాకుండా మొత్తం సమాజం ఆలోచించాల్సిన సమస్యలుగా మారాయి. మరింత ఆందోళన కలిగించే విషయం ఏమిటంటే, ఇటీవల పదో తరగతి చదువుతున్న కొందరు విద్యార్థులు ఒక ఉపాధ్యాయురాలిపై దాడి చేసి చంపిన తర్వాత, ఆమె ఇంట్లో ఉన్న నగదును కూడా తీసుకెళ్లిన ఘటన వెలుగులోకి రావడం. విద్యను అందించాల్సిన వయస్సులో ఉన్న పిల్లలు ఇంతటి దారుణానికి పాల్పడటం వెనుక ఉన్న కారణాలను మనం లోతుగా పరిశీలించాల్సిన అవసరం ఉంది. ఈ పరిస్థితికి పిల్లలను మాత్రమే నిందించడం సరైనదికాదు. పిల్లల ప్రవర్తనపై కుటుంబవాతావరణం, తల్లిదండ్రుల పెంపకం, పాఠశాల వాతావరణం, స్నేహితుల ప్రభావం, సాంకేతిక పరిజ్ఞానం, సామాజిక పరిస్థితులు, విద్యా పోటీ, మానసిక ఒత్తిడి వంటి అనేక అంశాలు ప్రభావం చూపుతాయి. ముఖ్యంగా సెల్‌ఫోన్ పిల్లల జీవితంలో అవసరమైన సాధనంగా ఉండాల్సింది పోయి, కొన్నిసార్లు వారి జీవితంలో ప్రధానమైన వస్తువుగా మారుతోంది. పిల్లలకు ఫోన్ ఇవ్వకూడదని తల్లిదండ్రులు నిర్ణయించడంతప్పు కాదు, కానీ ఎందుకు ఇవ్వడం లేదో వారికి అర్థమయ్యేలా చెప్పడం ముఖ్యం. అదే సమయంలో పిల్లలు కోరిన ప్రతి దాన్ని కొనివ్వడం ప్రేమకు నిదర్శనం కాదని తల్లిదండ్రులు గుర్తించాలి. పిల్లల ప్రతి కోరిక తీర్చడం కంటే అవసరమైనది ఏది, అవసరం లేనిది ఏది అనే విషయాన్ని వారికి చిన్నప్పటి నుంచే నేర్పాలి. జీవితంలో ప్రతిదీ మనకు అనుకూలంగా జరగదని, నిరాశను కూడా ఎదుర్కోవాలని, తిరస్కారాన్ని కూడా స్వీకరించాలని పిల్లలకు తెలియాలి. మరో వైపు తల్లిదండ్రుల ఆశలు పిల్లలపై తీవ్ర ఒత్తిడిని కలిగిస్తున్నాయి. ప్రతి తల్లిదండ్రి తన బిడ్డ ఉన్నత స్థాయికి ఎదగాలని కోరుకోవడం సహజమే. అయితే తమ బిడ్డ తప్పని సరిగా డాక్టర్ కావాలి, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ కావాలి, ఐఏఎస్ కావాలి అనే కోరికలను పిల్లల ఆసక్తి, సామర్థ్యాలతో సంబంధం లేకుండా వారిపై రుద్దడం సరికాదు.పిల్లలప్రతిభను, అభిరుచిని, మానసిక స్థితిని గుర్తించి వారికి తగిన మార్గాన్ని చూపాలి. తల్లిదండ్రుల కలలకు విలువ ఉన్నట్లే పిల్లల కలలకు కూడా విలువ ఉంది. ప్రతి విద్యార్థి ఒకే విధంగా ఆలోచించడు, ప్రతి ఒక్కరిలో ఒకే రకమైన ప్రతిభ ఉండదు. కొందరికి చదువుపై ఆసక్తి ఉంటే మరికొందరికి క్రీడలు, కళలు, సంగీతం, సాంకేతిక రంగాలు లేదా ఇతర వృత్తులపై ఆసక్తి ఉండవచ్చు. పిల్లల భవిష్యత్తును నిర్ణయించే ముందు వారి మనసును అర్థంచేసుకోవడం తల్లిదండ్రుల బాధ్యత. మార్కులు జీవితానికి కొలమానం కావు. పరీక్షలో తక్కువ మార్కులు వచ్చినంత మాత్రాన విద్యార్థి జీవితంలో విఫలమైన వ్యక్తికాదు. అలాగే ఎక్కువ మార్కులు సాధించినంత మాత్రాన జీవితంలో విజయం సాధించినట్టూ కాదు.



విద్య అసలు లక్ష్యం కేవలం ఉద్యోగం సంపాదించడానికి అవసరమైన మార్కులు ఇవ్వడం కాదు, మంచి ఆలోచన, మంచి ప్రవర్తన, బాధ్యత, క్రమశిక్షణ, మానవత్వం, సమస్యలను ఎదుర్కొనే ధైర్యం వంటి విలువలను పెంపొందించడం కూడా విద్యలో భాగమే. పిల్లలపై చదువు పేరుతో అంతులేని ఒత్తిడి పెంచితే వారు ఆ ఒత్తిడిని తట్టుకోలేక తప్పు నిర్ణయాలు తీసుకునే ప్రమాదం ఉంటుంది. అందుకే తల్లిదండ్రులు పిల్లల మార్కుల గురించి అడిగినంతగా వారి మనసు గురించి కూడా అడగాలి. పాఠశాలలో ఏం జరుగుతోంది, ఎలాంటి సమస్యలు ఎదురవుతున్నాయి, స్నేహితులతో ఎలా ఉంటున్నారు, ఏ విషయాలు వారిని బాధిస్తున్నాయి అనే విషయాలను తెలుసుకునేందుకు తల్లిదండ్రులు సమయం కేటాయించాలి. ఇక పాఠశాలల్లో క్రమశిక్షణ విషయంలో కూడా సమతుల్యత అవసరం. ఉపాధ్యాయుడు విద్యార్థిని కొట్టకూడదు, తిట్టకూడదు, అవమానించకూడదు. పిల్లల హక్కులను గౌరవించడం అత్యవసరం. అయితే శారీరక శిక్షను నిషేధించడం అంటే పాఠశాలలో క్రమశిక్షణ అవసరం లేదని కాదు. విద్యార్థులను భయపెట్టి క్రమశిక్షణలో పెట్టడం ఒక పద్ధతి అయితే, వారికి బాధ్యతను అర్థం చేయించి క్రమశిక్షణను అలవాటు చేయడం మరొక మంచి పద్ధతి. పాఠశాలలో స్పష్టమైన నియమాలు ఉండాలి, వాటిని విద్యార్థులకు ముందుగానే తెలియజేయాలి. తప్పు చేసినప్పుడు తగిన విధంగా కౌన్సెలింగ్ చేయాలి. అవసరమైతే తల్లిదండ్రులను పిలిపించి సమస్యను పరిష్కరించాలి. ఉపాధ్యాయులకు కూడా విద్యార్థుల మనస్తత్వాన్ని అర్థం చేసుకునే విధంగా శిక్షణ అవసరం. అదే సమయంలో విద్యార్థులకు తమకు హక్కులు ఉన్నట్లే బాధ్యతలు కూడా ఉన్నాయని స్పష్టంగా చెప్పాలి. ఉపాధ్యాయుడిని ప్రశ్నించడం తప్పుకాదు, కానీ అవమానించడం తప్పు. తమ అభిప్రాయాన్ని చెప్పడం విద్యార్థి హక్కే అయినా, ఉపాధ్యాయుడిపై దాడి చేయడం, బెదిరించడం లేదా అసభ్యంగా ప్రవర్తించడం మాత్రం ఏ పరిస్థితిలోనూ సమర్థించలేం. ఉపాధ్యాయుడి గౌరవాన్ని కాపాడటం కూడా విద్యావ్యవస్థ బాధ్యతే. ఒక పాఠశాలలో ఉపాధ్యాయుడు భయంతో పనిచేయాల్సిన పరిస్థితి ఏర్ప డితే అది విద్యావ్యవస్థకు ప్రమాదకరం. అదే సమయంలో విద్యార్థి భయంతో కాకుండా బాధ్యతతో క్రమశిక్షణ పాటించే వాతావరణాన్ని పాఠశాలలు కల్పించాలి. తల్లిదండ్రుల పెంపకంలో కూడా సమతుల్యత అత్యవసరం. పిల్లల ప్రతి సమస్యను తల్లిదండ్రులే పరిష్కరించడంవల్ల వారు స్వయంగా సమస్యలను ఎదుర్కొనే సామర్థ్యాన్ని కోల్పోయే అవకాశం ఉంది. పిల్లలకు చిన్నప్పటి నుంచే బాధ్యతలుఅప్పగించాలి, శ్రమ విలువ తెలియజేయాలి, డబ్బు విలువ నేర్పాలి, సమ యం విలువ అర్థంచేయాలి. ముఖ్యంగా ఓటమిని అంగీకరించడం, తప్పును ఒప్పుకోవడం, క్షమాపణ చెప్పడం, తిరిగి ప్రయత్నించడం వంటి జీవిత నైపుణ్యాలను నేర్పాలి. పిల్లలను ప్రేమించడం అంటే వారుఅడిగిన ప్రతిదీ ఇవ్వడంకాదు, వారు సరైన మార్గంలో నడిచేలా చేయడమే నిజమైనప్రేమ. మానసిక ఒత్తిడి విషయంలో కుటుంబం, పాఠశాల రెండూ అప్రమత్తంగా ఉండాలి. పిల్లలప్రవర్తనలో అకస్మాత్తుగా మార్పులు కనిపించినప్పుడు వాటిని నిర్లక్ష్యం చేయకూడదు. ఎప్పుడూ ఒంటరిగా ఉండటం, చదువుపై ఆసక్తి తగ్గడం, చిరాకుపెరగడం, నిరాశగా కనిపించడం వంటి మార్పులను పెద్దలు గమనించాలి. సమస్యను చిన్నదిగా భావించి పిల్లలను మందలించడం కంటే, ముందుగా వారి మాట వినాలి. తీవ్రమైన మానసిక ఒత్తిడి ఉన్నప్పుడు నిపుణుల సహాయం తీసుకోవడంలో ఎలాంటి సంకోచం ఉండకూడదు. ప్రేమకు వివేకం, స్వేచ్ఛకు బాధ్యత, విద్యకు విలువలు, క్రమశిక్షణకు మానవత్వం జోడించినప్పుడే మన పిల్లలకు మంచి భవిష్యత్తును అందించగలం. ●

# ప్రజావాక్కు



## ఏఐ నిర్ణయాధికారి కాదు..

కృత్రిమ మేధస్సు వేగంగా అభివృద్ధి చెందుతున్నఈ యుగంలో అసలు ప్రశ్న యంత్రాలు మనుషుల్లా ఆలోచించగలవా అనేదికాదు. భూమి, నీరు, పర్యావరణ వ్యవస్థల పరిరక్షణలో మెరుగైన నిర్ణయాలు తీసుకునేందుకు అవి ఎంతవరకు తోడ్పడగలవన్నదే ప్రధాన అంశం. సాంకేతికత లక్ష్యం కేవలం పనులను సులభతరం చేయడం మాత్రమే కాకుండా, ప్రజల జీవన ప్రమాణాలను మెరుగు పరచడం, ప్రకృతి సంపదను కాపాడడం కూడా కావాలి. పెరుగుతున్న నగరీకరణ నేపథ్యంలో హైదరాబాద్ వంటి మహానగరాలకు కృత్రిమ మేధస్సు ఎంతో ఉపయోగపడు తుంది. ట్రాఫిక్ నిర్వహణ, వైద్య సేవలు, విద్య, ప్రజా సేవలు, విపత్తుల నిర్వహణ, నీటి వనరుల సంరక్షణ, వ్యర్థాల నిర్వహణ వంటి రంగాల్లో ఏఐ సమర్థవంతమైన పరిష్కారాలను అందించగలదు. సమయాన్ని ఆదా చేయడంతో పాటు ప్రభుత్వసేవలను మరింత పారదర్శకంగా, ప్రజలకు చేరువగా మార్చే సామర్థ్యం దీనికి ఉంది.

- సి.సాయిరుత్విక్, శ్రీకాకుళం

## విశ్వాసం కోల్పోతున్న బ్యాంకులు

జాతీయ బ్యాంకులలో బంగారం తనఖా పెట్టి మోసపోయిన బాధితులు రోజు రోజుకూ పెరుగుతున్నారు. ఈ నెలలో ఖాతాదారులకు చెందిన బంగారు ఆభరణాలు భారీగా మాయమైన విషయం వెలుగులోకి వచ్చింది. బంగారం మాయమైన ఘటనతో ఖాతాదారుల్లో తీవ్ర భయాందోళనలు నెలకొన్నాయి. పేద ప్రజలు ఎంతో కష్టనష్టాలను ఓర్చుకొని రూపాయి రూపాయి కూడ పెట్టుకుని బంగారం కొనుగోలుచేసి బ్యాంకులో అయితే భద్రంగా ఉంటాయి, వడ్డీతక్కువ ఉంటుందని బ్యాంకులను ఆశ్రయిస్తే బ్యాంకులే ఈ విధంగా మోసం చేస్తే సామాన్య ప్రజల పరిస్థితి ఏమిటి?

- డి. వెంకటరెడ్డి, బెంగుళూరు

## అలవాట్లు మార్చుకోవాలి

ఆధునిక సమాజం ఎంతో పురోగమిస్తున్నకొద్దీ రోగాలు కూడా ముసురుకుంటున్నాయి. సామాన్యుడి నుండి కోటీశ్వరుడి వరకు జీవనశైలి వ్యాధుల బారిన పడుతున్నారు. పాతకాలం రోజులే బాగుండే. శారీరక శ్రమ తగ్గడం, వాతావరణ కాలుష్యం, నీటికాలుష్యం, ప్లాస్టిక్ భూతం, మద్యపానం ధూమపానం లాంటి వ్యసనాలు ఆరోగ్యాన్ని కాటేస్తున్నాయి. ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి.

## ధరలను నియంత్రించండి!

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ధరలను తగ్గించుట చేతకాక అవి కొనొద్దు, ఇవి కొనొద్దు విమానాలు ఎక్కి దూర ప్రయాణాలు చేయొద్దు, కార్యాలయాలకి టూ వీలర్, ఫోర్ వీలర్ మీద కాకుండా సైకిళ్ల మీద వెళ్లండని ఖర్చులు తగ్గించుకోండని పొదుపు పాటించడంటూ ఉచిత సలహాలిచ్చాయి. ఏ సౌకర్యాలు లేని కాలంలో కట్టెలపొయ్యి మీద వండుకుతినే వారు ప్రజలు. చాన్నాళ్ల తరువాత వారికి మళ్లీ అలాంటి స్థితి దాపురించింది. రోజురోజుకు పెరిగిపోతున్న నిత్యావసర వస్తువుల ధరలో సామాన్యుడిపైభారం పెరిగిపోతున్నది. బ్యాంకు ఖాతాల్లో రూ.15లక్షలు జమచేయలేదు. ఇచ్చిన హామీలు నెర వేర్చకుండా అధికారంలోకి వచ్చినప్పటి నుంచి నిత్యావసర వస్తువుల ధరలుపెంచేస్తూ ప్రజలనుఆర్థికంగా కృంగదీస్తున్నారు.

- కె.రామారావు, హైదరాబాద్

## గ్రామీణ రోడ్లను బాగుచేయాలి

వాతావరణ మార్పులతో ఇటీవల కాలంలో తీవ్రమైన ఈదురుగాలులతో కూడిన వర్షాలు పడుతుండడంతో గ్రామీణ రోడ్ల వెంట ప్రయాణాలు ప్రమాదకరంగా మారుతున్నాయి. తరుచుగా చెట్ల కొమ్మలు విరిగి రోడ్లపై పడుతుండడం, విద్యుత్ స్తంభాలు విరిగి పడుతుండడంతో కరెంట్ తీగలు తెగి రోడ్లు ప్రమాదకరంగా మారుతున్నాయి. గ్రామస్థాయిలో అధికారులు వర్షాకాలంలో అప్రమత్తంగాఉండి ఇలాంటి పరిస్థితులలో వెంటనే రోడ్లపైఉన్న చెట్లను తొలగించేవిధంగా చర్యలు చేపట్టాలి. విద్యుత్ శాఖవారు విద్యుత్ వైర్లు తెగిన చోట ప్రమాదాలు జరగకుండా తగిన హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి మరమ్మత్తులు చేయాలి. రోడ్లు బాగా దెబ్బతిన్న చోట సంబంధిత అధికారులు మరమ్మత్తులు చేసే విధంగా చర్యలు చేపట్టాలి. వానాకాలంలో రోడ్ల వెంట ప్రమాదాలు జరగకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలి.

- టి. యోగేందర్, నల్లగొండ జిల్లా

## రిజర్వేషన్లు ప్రతిభకు గొడ్డలిపెట్టు!

ప్రతిభకు పట్టం కట్టడం అంటే భారతదేశాన్ని అభివృద్ధి పథంలో శరవేగంగా పయనింపచేయడం! రిజర్వేషన్లకు మంగళం పాడి, ప్రతిభే కొలమానంగా పెద్దఎత్తున ఉద్యమానికి అంకురార్పణ గావించేలా ప్రజా సంఘాల వారు మేధావి వర్గాల వారు తీవ్రకృషిసల్పాలి! ఎందుకంటే అగ్రవర్ణాలవారికి 100 ర్యాంకు వచ్చినదక్కని ఫలం, రిజర్వేషన్ వున్నవారికి ఎక్కువ ర్యాంకు వచ్చినా ఫలం దక్కడం తీరని అన్యాయం.

-బి.మధుపాళి, నంద్యాల జిల్లా

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి | ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)








# హిమానీనద విస్ఫోటన ముప్పు

**47 సరస్సులు ప్రమాదకరం, నేపాల్‌లో 21, టిబెట్‌లో 25 శాస్త్రీయంగా ఐసిఐఎంఓడి గుర్తింపు, జనావాసాలు, జలవిద్యుత్ ఆస్తులు, మౌలిక సదుపాయాలకు ఎప్పటికైనా నష్టమే**

**కాఠ్మండు, ఆగస్టు 27:** అంతర్జాతీయ సమీకృత పర్వత అభివృద్ధి కేంద్రం (ఐసిఐఎంఒడి), నేపాల్ ప్రభుత్వం జరిపిన శాస్త్రీయ అంచనాల ప్రకారం, ప్రధాన హిమాలయ నదీ మార్గాలలో 47 ప్రమాదకరమైన హిమానీనద సరస్సు (జిఎల్ఓఎఫ్)లు ఉన్నట్లు గుర్తించారు. ఈ సరస్సులు హిమానీనద విస్ఫోటన వరదలను ప్రేరేపించగలవు, దీనివల్ల దిగువ ప్రాంతాలలోని ప్రజలకు, కీలకమైన మౌలిక సదుపాయాలకు ముప్పువాటిల్లుతుంది. గుర్తించిన సరస్సులలో 21నేపాల్‌లో ఉండగా, 25 టిబెట్‌లోని సరిహద్దు సరస్సులు. ఇవి దక్షిణంగా నేపాల్‌లోకి ప్రవహించే నదుల ఎగువ ప్రాంతాలకు సమీపంలో ఉన్నాయి. విపత్తు నిర్వహణ అధికారులు, యుఎన్‌డిపి, వేగంగా విస్తరిస్తున్న అనేక మొరైన్–ఆనకట్టసరస్సులను గుర్తించాయి. వీటిలో లోయర్ బరున్, తులగి, లుమ్డింగ్ త్షో, హోంగు 2, త్షోరోల్పా, ఇంజాత్షో వంటివి ఉన్నాయి. వీటికి తక్షణ ప్రమాద నివారణ చర్యలు అవసరమని పేర్కొన్నాయి. కోసి, బాగమతి బేసిన్‌లలోని ప్రమాదకర జిల్లాలలో అత్యధిక ప్రమాదం కేంద్రీకృతమై ఉంది. ఇక్కడే 85శాతం కంటే ఎక్కువ ప్రాంతీయ ప్రమాదం కేంద్రీకృతమై ఉంది. సోలుఖుంబు, సంఖువాసభ, దోలఖా, సింధుపాల్‌చోక్ జిల్లాలతో పాటు, రామెఛాప్, కవ్రేపలాంచోక్, రసువా దిగువ ప్రాంతాలు కూడా ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉన్న జిల్లాలలో ఉన్నాయి. పశ్చిమ, సుదూర పశ్చిమ నేపాల్ కూడా గండకి, కర్నాలి నదీ పరివాహక ప్రాంతాలలో ప్రమాదాలను ఎదుర్కొంటున్నాయి. మనంగ్, లామ్‌జుంగ్, గోర్ఖా, ముస్తాంగ్, మ్యాగ్డి, హుమ్లా ప్రాంతాలు ప్రభావితమయ్యే అవకాశం ఉన్న నదీ మార్గాల వెంబడి ఉన్నాయి. దీనివల్ల, హిమానీనద సరస్సులు ఉప్పొంగే ప్రమాదం నుండి స్థానిక ప్రజలు, జలవిద్యుత్ మౌలిక సదుపాయాలు ప్రమాదంలో పడవచ్చు. ప్రమాదకరమైనవిగా మారిన 47 హిమానీనద సరస్సులను గుర్తించడం అనేది, నేపాల్‌లోని బలమైన హిమాలయ సమాజాలను, మౌలిక సదుపాయాలను రక్షించడానికి ముందస్తు హెచ్చరిక వ్యవస్థలు, సరస్సుల నీటిమట్టాన్ని తగ్గించే చర్యలు, సరిహద్దు వెంబడి సమన్వయంతో కూడిన విపత్తు సన్నద్ధత ఆవశ్యకత ఎంతైనా ఉంది.

# భూకంపం కాదు..మంచుకొండే విరిగిపడింది

## యుఎస్ జియోలాజికల్ సర్వే

**కాట్మాండు, ఆగస్టు 27:** నేపాల్‌లో సంభవించిన ఆకస్మిక వరదలకు కారణం ఏమిటన్న దానిపై అమెరికా జియోలాజికల్ సర్వే ఓ ప్రకటన చేసింది. టిబెట్ వైపు ఉన్న హిమాలయ పర్వతంలోని మంచుకొండ విరిగిపడడం వల్ల.. శిథిలాలు, బురదతో కూడిన వరద విలయం వచ్చినట్లు పేర్కొన్నది. ముందుగా అంచనా వేసినట్లు భూకంపం కాదు అని యుఎస్ జియోలాజికల్ సర్వే తెలిపింది. మంచుపర్వతం బద్దలు కావడం, దాంతో బురద నీరు మహోగ్రంగా పోటెత్తిందని ఆ ప్రవాహం దిగువ ప్రాంతాలను ముంచెత్తినట్లు ఆ సంస్థ తెలిపింది. బుధవారం టిబెట్‌లో 4.4 తీవ్రతతో భూకంపం రావడం వల్ల.. జల విలయం సంభవించినట్లు తొలుత యుఎస్ జియోలాజికల్ సర్వే అంచనా వేసింది. కానీ మరింత విశ్లేషణ తర్వాత తమ ప్రకటనలో మార్పు చేశారు. సమీపంలో ఉన్న సెసిమిక్ స్టేషన్లు, సెసిమిక్ వేవ్స్, శాటిలైట్ ఇమేజ్‌ల ఆధారంగా తాజా అంచనా వేసినట్లు పేర్కొన్నారు. మంచు శిఖరం కుప్పకూలడంతో భీకర స్థాయిలో బురద పోటెత్తినట్లు గుర్తించారు. భూకంపం ఏమీ సంభవించలేదని యుఎస్‌జీఎస్ తాజాగా పేర్కొన్నది. నేపాలీ అధికారులు కూడా ఇదే తరహా వివరణ ఇచ్చారు. హిమాలయ శిఖరంపై ఉన్న మంచు ఫలకం కుప్పకూలిందని, ఆ భారీ శిథిలాలతో రాళ్లు కూడా కొట్టుకువచ్చాయని నేపాలీ అధికారులు చెప్పారు. ప్లానెట్ ల్యాబ్స్‌కు చెందిన శాటిలైట్ ఇమేజ్‌ల ఆధారంగా కూడా ఓ అంచనా వేశారు. రసువా–రసువాగాదీ బోర్డర్ క్రాసింగ్‌కు ఈశాన్య ప్రాంతంలో సుమారు 20 కి.మీ. దూరంలో మంచుపర్వతంపై కొండచరియలు విరిగిపడ్డాయని నేపాలీ అధికారులు పేర్కొన్నారు. అయితే బోటెకోశికి ఉప నది అయిన లిండే నదిలో ఆ కొండచరియల వల్ల డ్యామేజ్ అయ్యిందని, అక్కడనుంచి బురద వరద తిమూరు నుంచి త్రిశూలి నదిలోకి ప్రవేశించినట్లు చెబుతున్నారు. నదీవ్యవస్థలోకి బురద ప్రవేశించడం వల్ల ఆకస్మిక వరదలు సంభవించినట్లు ఇంటర్నేషనల్ సెంటర్ ఫర్ ఇంటిగ్రేటెడ్ మౌంటేన్ డెవలప్‌మెంట్ పేర్కొన్నది. అయితే త్రిశూలీ నది మార్గంలో ఎక్కడైనా తాత్కాలికంగా బ్లాకేజీలు ఏర్పడ్డాయా లేదా అన్న అంశాన్ని కూడా పరిశీలిస్తున్నారు. ఒకవేళ ఎక్కడైనా బ్లాకేజీ ఉంటే, దాని వల్ల సెకండ్ ఫ్లడింగ్ ఏర్పడే అవకాశం ఉన్నట్లు భావిస్తున్నారు. మంచుపర్వతంపై ఉన్న సరస్సు ఆకస్మికంగా ఖాళీ అయ్యిందా లేక నది మార్గంలో బ్లాకేజీల వల్ల ఫ్లాష్ ఫ్లడ్స్ వచ్చాయా అన్న కోణంలో అధ్యయనం చేస్తున్నారు.

# నేపాల్‌లో వరద బీభత్సం.. 332కి చేరిన మృతుల సంఖ్య

**ఖాట్మండు, ఆగస్టు 27:** నేపాల్‌లో ఆకస్మిక వరదల కారణంగా సంభవించిన మృతుల సంఖ్య 332కి చేరింది. మరో 1,400 మంది వరకు గల్లంతైనట్లు సమాచారం. కొండచరియలు విరిగిపడటంతో పలు ప్రాంతాలకు రాకపోకలు నిలిచిపోవడంతో సహాయక బృందాలు అక్కడికి చేరుకోవడం కష్టంగా మారింది. గల్లంతైన వారిలో 300 మంది భారతీయులు ఉన్నట్లు అధికారులు తెలిపారు. బుధవారం భోటే కోశి, త్రిశూలి నదులకు వచ్చిన ఆకస్మిక వరదలు రసువా, నువాకోట్, ధాడింగ్, గోర్ఖా జిల్లాలను తీవ్రంగా ప్రభావితం చేశాయి. ప్రభావిత ప్రాంతాల్లో ట్రెక్కింగ్, టూరిజం సంస్థల నుంచి అందిన ప్రాథమిక వివరాల ప్రకారం 644 మంది ప్రయాణికులు గల్లంతైనట్లు గుర్తించామని నేపాల్ టూరిజం బోర్డు వెల్లడించింది.వీరిలో 127 మంది నేపాలీలు ఉన్నారు. ఈ వివరాలను ట్రావెల్ ఏజెన్సీలు, గైడ్లు, స్థానిక అధికారులు, భద్రతా సంస్థల సహకారంతో ధ్రువీకరిస్తున్నట్లు తెలిపింది. బాధితులకు వైద్య సేవలు, తాత్కాలిక ఆశ్రయాలు, ఆహారం, తాగు నీరు, మందులను అందిస్తున్నారు. నేపాల్‌లోని భారత రాయబార కార్యాలయ వర్గాల ప్రకారం 28 దేశాలకు చెందిన 500మంది గల్లంతైనట్లు సమాచారం అందింది. అయితే సెర్చ్ అండ్ రెస్క్యూ ఆపరేషన్లు కొన సాగుతున్నందున ఈ సంఖ్యలు ఇంకా ప్రాథమిక దశలోనే ఉన్నాయని అధికారులు తెలిపారు. ఇదిలా ఉండగా, భారత ప్రధాని నరేంద్ర మోదీ నేపాల్ ప్రధాని బాలెన్‌షాతో సంప్రదింపులు జరుపుతూ పరిస్థితిని ఎప్పటికప్పుడు తెలుసు కుంటున్నారు. 40కిపైగా ప్రైవేట్ హెలికాప్టర్ విమానాలువరద బాధిత ప్రాంతాలకు సహాయక సామగ్రిని తరలించేందుకు గురువారం కాఠ్మాండులోని త్రిభువన్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి బయలుదేరాయి.

**నేపాల్‌కు భారత్ భారీగా సహాయం**

వరదలతో అతలాకుతలమైన నేపాల్‌కు భారత్ మానవతా సహాయాన్ని మరింత విస్తరించింది. 37.5 టన్నుల మానవతా సహాయం, విపత్తు సహాయక చర్యలు సామగ్రి, మందులు, ఆహార ప్యాకెట్లతో రెండో విమానాన్ని పంపినట్లు భారత విదేశాంగశాఖ వెల్లడించింది. సహాయం కోరే భారతీయుల కోసం నేపాల్‌లోని భారత రాయబార కార్యాలయం హెల్ప్‌లైన్ నంబర్లను కూడా అందుబాటులోకి తెచ్చింది: +977 985 131 6807, +977 970 910 7500, +977 981 032 6117. ఈ నంబర్లను వాట్సాప్ ద్వారా కూడా సంప్రదించవచ్చని తెలిపింది.

# మానస సరోవర్ యాత్ర నిలిపివేత

**న్యూఢిల్లీ, ఆగస్టు 27:** నేపాల్, టిబెట్ సరిహద్దు ప్రాంతాల్లో సంభవించిన భారీ ఫ్లాష్ ఫ్లడ్స్ ప్రభావం కైలాస మానస సరోవర్ యాత్రపై పడింది. నేపాల్ మీదుగా కైలాస మానస సరోవర్ యాత్రకు వెళ్లేందుకు భక్తుల బ్యాచ్‌లను ఇప్పటికే షెడ్యూల్ చేశారు. ముఖ్యంగా ఖాట్మండు–రసువగఢీ–కీరుంగ్ మార్గం మీదుగా మానస సరోవరం చేరుకునేందుకు పలువురు యాత్రికులు బుకింగ్ చేసుకున్నారు. తెలుగు రాష్ట్రాల నుంచి కూడా పదుల సంఖ్యలో భక్తులు ఈ యాత్రకు బుక్ చేసుకున్నట్టు సమాచారం. అయితే రసువగఢీ ప్రాంతంలో భారీగా వరదలు రావడంతో పరిస్థితి ఒక్కసారిగా మారిపోయింది. దీంతో రేపటి నుంచి ఖాట్మాండు నుంచి ప్రారంభం కావాల్సిన యాత్రను నిలిపివేసినట్లు సమాచారం. ఇప్పటికే సెప్టెంబర్ 23వ తేదీకి యాత్ర బుక్ చేసుకున్న భక్తులకు పరిస్థితిని సమీక్షించిన తర్వాత త్వరలో పూర్తి సమాచారం అందిస్తామని అధికారులు, సంబంధిత వర్గాలు వెల్లడించినట్లు సమాచారం.

# 21 మంది భారతీయులను రక్షించిన సహాయక బృందాలు

**న్యూఢిల్లీ,ఆగస్టు 27:** నేపాల్‌లో భోటేకోశి నది విపత్తులో 288 మంది భారతీయులు గల్లంతైనట్లు, 21 మందిని రక్షించినట్లు భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ గురువారం తెలిపింది. కైలాస మానస సరోవర్ యాత్రకు వెళ్లిన యాత్రికులు, త్రిశూలి1 జలవిద్యుత్ ప్రాజెక్టులో పనిచేస్తున్న కార్మికులు, వివిధ రాష్ట్రాలకు చెందిన పర్యాటకులు గల్లంతైన వారి జాబితాలో ఉన్నారు. వీరిని గుర్తించేందుకు భారత ప్రభుత్వం నేపాల్ అధికారులతో కలిసి ప్రయత్నిస్తోందని చెప్పారు. విదేశాంగ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ మాట్లాడుతూ త్రిశూలి1 పవర్ ప్రాజెక్టులో పనిచేస్తున్న 73 మంది భారతీయులతో సంబంధాలు తెగిపోయినట్లు వెల్లడించారు. కైలాస మానస సరోవర్ యాత్రకు వెళ్లిన తమిళనాడుకు చెందిన రెండు బృందాల్లోని 37 మంది, 49 మంది భారతీయుల ఆచూకీ కూడా అందుబాటులో లేదు. వీరు సమ్మిట్ ట్రావెల్స్, ఫై ఎవరెస్ట్ ట్రావెల్స్ ద్వారా వేర్వేరుగా కైలాస యాత్రకు వెళ్లారు. పశ్చిమ బెంగాల్‌కు చెందిన మరో 32 మంది భారతీయులు విపత్తు సంభవించిన రసువా జిల్లాలోని టిమురే ప్రాంతంలో ఉన్నట్లు సమాచారం. రిదా టూర్స్ ద్వారా వెళ్లిన వివిధ రాష్ట్రాలకు చెందిన 61 మంది, కేరళకు చెందిన 33 మంది భారతీయులు ఆచూకీ కూడా ప్రస్తుతం దొరకలేదు. వీరందరని కచ్చితంగా ఆచూకీ తెలపాలని,వారంతా గల్లంతయ్యారని అర్థం కాదని విదేశాంగశాఖ చెప్పింది. మరోవైపు, తమిళనాడుకు చెందిన 21మంది భారతీయులను సురక్షితంగా ఉన్నట్లు కేంద్రం తెలిపింది.



# ఊహించని ప్రకృతి విపత్తు

## భారత్‌కు నేపాల్ ప్రధాని బాలేన్‌షా కృతజ్ఞతలు

**ఖాట్మండు, ఆగస్టు 27:** టిబెట్ సరిహద్దు ప్రాంతంలో ఊహించని విధంగా వచ్చిన ఆకస్మిక వరదల వల్ల నేపాల్ తీవ్రంగా నష్టపోయింది. ఈ దారుణ విపత్తుపై నేపాల్ ప్రధాని బాలేంద్ర బాలేన్ షా తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఇది దేశం ఎన్నడూ చూడని రీతిలో సంభవించిన ఘోర విపత్తు అని ఆయన అభివర్ణించారు. బాధితుల రక్షణ, సహాయక చర్యల కోసం నేపాల్ ఆర్మీ, సాయుధ పోలీసు బలగాలు, విపత్తు నిర్వహణ బృందాలు పూర్తిస్థాయిలో రంగంలోకి దిగాయని వెల్లడించారు. ఇప్పటికే రసువా జిల్లాలోని తిమురే ప్రాంతం నుంచి 21 మంది భారతీయులతో సహా 116 మందిని నేపాల్ ఆర్మీ సురక్షితంగా బయటకు తీసుకొచ్చిందని తెలిపారు. భారత ప్రధాని మోడీ నేరుగా ఫోన్ చేసి పరామర్శించి, 10 టన్నుల అత్యవసర సహాయక సామాగ్రిని పంపించారని, వారికి ప్రధాని షా ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. బాధితులెవరూ అధైర్యపడవద్దని, అందరినీ ఆదుకునే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుందని ఆయన విజ్ఞప్తి చేశారు.

# 80మంది ఇషా ఫౌండేషన్ యాత్రికులు గల్లంతు



**ఖాట్మండు, ఆగస్టు 27:** నేపాల్ చైనా (టిబెట్) సరిహద్దు ప్రాంతంలో భారీ వరదలు తీవ్ర కలకలం రేపుతున్నాయి. ఈ వరదల ప్రభావంతో కైలాష్ మానసరోవర్ యాత్రకు వెళ్లిన ఇషా ఫౌండేషన్‌కు చెందిన 80 మంది యాత్రికులు గిరాంగ్ ప్రాంతంలో చిక్కుకుపోయినట్లు సమాచారం. యాత్రికులు తిరిగి వస్తున్న సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఇషా ఫౌండేషన్ నిర్వహించిన కైలాష్ మానసరోవర్ యాత్రలో భాగంగా యాత్రికులు టిబెట్‌లోని గిరాంగ్ ప్రాం తానికి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో చైనా ఇమ్మి గ్రేషన్ కార్యాలయం వద్దకు చేరుకున్న సమ యంలో అకస్మాత్తుగా భారీ వరద సంభవించింది. వరద ఉధృతికి ఇమ్మిగ్రేషన్ కేంద్రంతో పాటు గిరాంగ్ పట్టణంలోని చాలా ప్రాంతాలు నీట మునిగినట్లు సమాచారం. దీంతో అక్కడ ఉన్న యాత్రికులతో సంబంధాలు తెగిపోయాయి. 80 మంది భక్తుల పరిస్థితిపై కొంతకాలం స్పష్టమైన సమాచారం అందకపోవడంతో వారి కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. ఈ పరి స్థితిపై ఇషా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు సద్గురు స్పందించారు. యాత్రికుల పరిస్థితిపై ఆందోళన వ్యక్తం చేస్తూ, సహాయక చర్యలను పర్యవేక్షించేందుకు తాను స్వయంగా గిరాంగ్ ప్రాంతానికి చేరుకున్నట్లు తెలిపారు. సహాయక, రెస్క్యూ చర్యల్లో అధికారులతో కలిసి పనిచేస్తున్నామని సద్గురు పేర్కొన్నారు. ఇషా ఫౌండేషన్ వెల్లడించిన వివరాల ప్రకారం, ఈ ఏడాది మొత్తం 21 బృందాలు కైలాష్ యాత్రకు వెళ్లాయి. వారిలో 495 మంది సురక్షితంగా తిరిగి వచ్చారు. ప్రస్తుతం 743 మంది టిబెట్‌లో, 148 మంది నేపాల్‌లో ఉన్నట్లు సమాచారం. మరో 77 మంది యాత్రికులు ఇమ్మిగ్రేషన్ కేంద్రాల వద్ద చిక్కుకుపోయినట్లు లేదా వారితో సంబంధాలు లేకుండా పోయినట్లు ఫౌండేషన్ తెలిపింది. అదనంగా ముగ్గురు వాలంటీర్లు నేపాల్‌లోని తిమురే ప్రాంతంలో ఉన్నట్లు వెల్లడించింది. వరద ప్రభావిత ప్రాంతంలో ఉన్న సద్గురుయాత్రికుల కుటుంబాలకు ధైర్యం చెప్పారు. ఈ క్లిష్ట పరిస్థితుల్లో బాధితులు, వారి కుటుంబాలు ఎదుర్కొంటున్న ఆందోళనను తాను అర్థం చేసుకుంటున్నానని తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో సాధ్యమైన ప్రతి సహాయక చర్యను చేపట్టేలా తాను స్వయంగా అక్కడ ఉన్నానని చెప్పారు. అధికారులతో సమన్వయం చేసుకుంటూ యాత్రికులకు సహాయం అందించేందుకు ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. భారీ వరదల కారణంగా సరిహద్దు ప్రాంతాల్లో రాకపోకలు, సమాచార వ్యవస్థలకు అంతరాయం ఏర్పడిన నేపథ్యంలో రెస్క్యూ చర్యలు సవాలుగా మారాయి.

# ముంచుకొస్తున్న మరో ముప్పు

## బారియర్ సరస్సు 72 గంటల్లో పొంగిపొర్లుతుందని చైనా హెచ్చరిక

**బీజింగ్, ఆగస్టు 27:** నేపాల్ టిబెట్ సరిహద్దుల్లో మరో ముప్పు పొంచి ఉందని చైనా హెచ్చరించింది. బ్యారియర్ సరస్సు 72 గంటల్లో పొంగిపొర్లే ప్రమాదం ఉందని అప్రమత్తం చేసింది. మంచుచరియలు విరిగిపడటంతో నేపాల్‌లో ఆకస్మిక వరదలు సంభవించి, ఇప్పటి వరకూ 350 మందికిపైగా ప్రాణాలు కోల్పోయారు. మరో 1,600 ఈ ఘటనలో గల్లంతయ్యారు. ఈ నేపథ్యంలో ఎగువన మరిన్ని ప్రమాదాలు పొంచి ఉన్నాయని బీజింగ్ మరో హెచ్చరికను జారీ చేశారు. చైనా విదేశాంగ శాఖ ప్రతినిధి లిన్ జియాన్ మాట్లాడుతూ నేపాల్‌వైపున దాదాపు 100మంది చైనా పౌరులు గల్లంతైనట్లు తెలిపారు. నేపాల్‌లోని ఛోచెన్ ఖోలా, పురేపు త్సాంగ్పో నదుల సంగమం వద్ద ఏర్పడిన కృత్రిమ సరస్సు వచ్చే మూడు రోజుల్లో బద్దలయ్యే ప్రమాదం ఉందని చైనా జలవనరుల మంత్రిత్వ శాఖ తెలిపింది. గురువారం ఉదయానికి ఈ సరస్సులో ఇప్పటికే దాదాపు 20 లక్షల క్యూ బిక్ మీటర్ల వరద నీరు చేరిందని, రాబోయే మూడు రోజుల్లో మరో 30 లక్షల క్యూబిక్ మీటర్లకుపైగా ప్రవేశించవచ్చని అంచనా వేస్తున్నారు. దీంతో ఈ సరస్సుకు దిగువ ప్రాంతాలకు వరద ముప్పు ఉన్నట్టు చైనా మీడియా తెలిపింది. ఈ నేపథ్యంలో నదులు, తీర ప్రాంతాలకు దూరంగా ఉండాలని ప్రజలకు విజ్ఞప్తి చేసింది. సురక్షిత ప్రాంతాలకు తరలించాలని అధికారులకు సూచనలు చేసింది. మరోవైపు, టిబెట్‌లోని హిమానీనదం (గ్లేసియర్) బద్దలై ఆకస్మిక వరదలు, కొండచరియలు విరిగిపడటంతో భారీ ప్రాణనష్టం సంభవించింది. నేపాల్ పోలీస్ వర్గాల ప్రకారం కనీసం 3వేల మంది మరణించగా, 1,600 మంది గల్లంతయ్యారు. గల్లంతైన విదేశీయులలో అత్యధికంగా భారతదేశానికి చెందిన వారే ఉన్నారు. కైలాస మానససరోవర యాత్రకు వెళ్లిన వారు సహా 288 మంది భారతీయ పౌరులు గల్లంతైనట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. అలాగే, 65 మంది అమెరికన్లు, 51 మంది మలేషియా పౌరులు, 53 మంది ఉక్రెయిన్ పౌరులు, 35 మంది ఆస్ట్రేలియా, 33 మంది బ్రిటన్ పౌరులు కూడా గల్లంతయ్యారు. టిబెట్‌లోని గైరోంగ్ కౌంటీలో ముగ్గురు.. 260 మంది విదేశీయులు సహా 558 మంది గల్లంతయ్యారు. దెబ్బతిన్న రోడ్లు, వంతెనల వల్ల సహాయక చర్యలకు తీవ్ర అంతరాయం కలుగుతున్నప్పటికీ, చైనా, నేపాల్ సైన్యం రంగంలోకి దిగి సహాయక చర్యలు కొనసాగిస్తున్నాయి.

# మంచుకరిగితే రెండుదేశాలకు ప్రమాదమే

## నేపాల్ విదేశాంగ మంత్రి శిశిర్ ఖనాల్

**ఖాట్మండు, ఆగస్టు 27:** హిమాలయాల్లో మంచు కరిగితే అది నేరుగా సముద్ర మట్టాల పెరుగుదలకే దారితీస్తుందని నేపాల్ విదేశాంగ మంత్రి శిశిర్ ఖనాల్ వ్యాఖ్యానించారు. హిమాలయ పర్వత శ్రేణులు ఎదుర్కొంటున్న పర్యావరణ సంక్షోభం భారత్, నేపాల్‌తో పాటు చైనా, భూటాన్‌లకు కూడా ఉమ్మడి ముప్పు అని ఆయన హెచ్చరించారు. ఖాట్మండులో గురువారం నిర్వహించిన వరల్డ్ అన్విక్షా సమ్మిట్‌లో ఆయన మాట్లాడారు. బుధవారం నేపాల్‌చైనా సరిహద్దులో ఆకస్మిక వరదలు సంభవించి దిగువ ప్రాంతాలు జలమయమైన ఉదంతాన్ని ఆయన ఈ సందర్భంగా ప్రస్తావించారు. హిమాలయాల్లో మంచు కరుగుతున్న తీరుకు ఈ వరదలే నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుత వరదల ప్రభావం భారత సరిహద్దు రాష్ట్రాలైన ఉత్తరప్రదేశ్, బీహార్‌లపై తక్కువగా ఉన్నప్పటికీ, గతంలో ఇటువంటి ఘటనలు తీవ్ర నష్టాన్ని మిగిల్చాయని, భవిష్యత్తులోనూ ఇటువంటి ముప్పు పొంచి ఉందని ఆయన గుర్తుచేశారు. భారత్, నేపాల్ దేశాల మధ్య రోటీబేటీ, సీతారామ్ వంటి చారిత్రక, సాంస్కృతిక బంధాలే కాకుండా, పర్యావరణ కోణంలోనూ ద్వైపాక్షిక సంబంధాలను పునర్నిర్వచించుకోవాల్సిన అవసరం ఉందని ఆయన పిలుపునిచ్చారు. హిమాలయాల్లోని మంచినీటి వనరులపై ఆధారపడి జీవిస్తున్న సుమారు 200 కోట్ల మంది ప్రజలు భవిష్యత్తులో తీవ్ర నీటి సంక్షోభాన్ని ఎదుర్కొనే అవకాశం ఉందని, ఇది యావత్ మానవ నాగరికతకే పెను ముప్పుగా పరిణమించవచ్చని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.

# మూడువారాల్లోనే 60 మంది నవజాత శిశువుల మృతి

**మాల్డా, ఆగస్టు 27:** పశ్చిమబెంగాల్‌లోని మాల్డా మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్ (ఎంఎంసీహెచ్)లో ఆగస్టు తొలి మూడు వారాల్లో 60 మంది చిన్నారులు మృతి చెందడంతో అధికారులు దర్యాప్తు ప్రారంభించారు. వీరిలో ఒక్క రోజే 10 మంది చిన్నారులు మృతి చెందడం ఆందోళనకు దారితీసింది. ఈ ఘటనపై ఆరోగ్య శాఖ ఎంఎంసీహెచ్ పనితీరును సమీక్షించడంతో పాటు, మృతిచెందిన చిన్నారులకు తొలుత చికిత్స అందించిన ప్రైవేట్ ఆసుపత్రులు, నర్సింగ్ హోమ్‌లు, బ్లాక్ స్థాయి ఆరోగ్య కేంద్రాలనూ పరిశీలిస్తోంది. తీవ్ర అనారోగ్యంతో ఉన్న చిన్నారులను ఆయా కేంద్రాల నుంచి ఎంఎంసీహెచ్‌కు తరలించినట్లు అధికారులు తెలిపారు. ఒక్క రోజే మృతి చెందిన 10 మంది చిన్నారుల్లో ఎనిమిది మంది ఇతర ఆసుపత్రుల్లో జన్మించినవారు కాగా, పరిస్థితి విషమించడంతో వారిని ఎంఎంసీహెచ్‌కు తరలించారు. మిగిలిన ఇద్దరు చిన్నారులు ఎంఎంసీహెచ్‌లోనే జన్మించారు. ప్రాథమిక దర్యాప్తు కొనసాగుతున్నప్పటికీ, ప్రాథమిక నివేదికను ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించారు. మృతి చెందిన నవజాత శిశువుల్లో శ్వాస సంబంధిత సమస్యలు, కామెర్లు, పుట్టుకతో వచ్చిన గుండె సంబంధిత వ్యాధులు వంటి సమస్యలు ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ఎంఎంసీహెచ్ సూపరింటెండెంట్ ప్రసేన్‌జిత్ బార్ మరణాలను ధృవీకరించారు. ఆసుపత్రి తరఫున రాష్ట్ర ఆరోగ్య శాఖకు సమగ్ర నివేదిక సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. ఒక్క రోజే 10 మంది చిన్నారులు మృతి చెందిన విషయం వాస్తవమేనని, వారిలో ఎనిమిది మందిని అత్యంత విషమ పరిస్థితిలో ఆసుపత్రికి తీసుకురాగా, ఇద్దరు అక్కడే జన్మించారని చెప్పారు. ఆగస్టులో నమోదైన 60 మంది శిశు మరణాల్లో 44 మంది ఇతర ఆసుపత్రుల్లో జన్మించినవారేనని అధికారులు వెల్లడించారు.

# హిమనదం కూలిపోవడం వల్లే నేపాల్‌లో జలప్రళయం

## ఇస్రో, ఎన్ఆర్ఎస్‌ఎ చిత్రాల విశ్లేషణ

**న్యూఢిల్లీ, ఆగస్టు 27:** నేపాల్‌ను కనీవినీ ఎరుగని జలప్రళయం అతలాకుతలం చేసింది. ఊహించని రీతిలో క్షణాల్లో జలప్రళయం బీభత్సం సృష్టించింది. ఇప్పటి వరకు దాదాపు 332 మంది వరకు ప్రాణాలు కోల్పోగా ఇంకా భారతదేశంతో పాటు చైనా సహా ప్రపంచ దేశాలకు చెందిన వందలాది మంది గల్లంతయ్యారు. ఇక ఈ బీభత్సానికి కారణాలను ఇస్రో విశ్లేషించింది. ఎత్తైన హిమాలయ ప్రాంతంలో హిమనదం (గ్లేసియర్) కూలిపోవడం కారణమై ఉండొచ్చుని భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ ప్రాథమిక విశ్లేషణలో వెల్లడైంది. ఇస్రోకు చెందిన నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ ఉపగ్రహ చిత్రాలను విశ్లేషించి ఈ అంచనాకు వచ్చింది. నేపాల్‌టిబెట్ సరిహద్దుకు సమీపంలోని ప్రాంతంలో హిమనదం కూలిన ఆనవాళ్లతో పాటు ఉప్పొంగిన భోటేకోసి నది,దిగువ ప్రాంతాల్లో భారీ వరదలను ఉపగ్రహ చిత్రాలు చూపిస్తున్నాయి.



ఈ నెల 26న తీసిన ఉపగ్రహ చిత్రాల్లో త్రిశూలి నదికి సమీపంలోని ఎత్తైన పర్వతప్రాంతంలో భారీగా భూభాగ మార్పులు చోటుచేసుకున్నట్లు కనిపించింది. ఈ చిత్రాల్లో హిమనదం ప్రాంతంలో కూలిన ఆనవాళ్లు, నదీ ప్రవాహం విస్తరించడం, దిగువ ప్రాంతాల్లో వరద నీరు భారీగా చేరిన దృశ్యాలు నమోదయ్యాయి. ఈనెల 26న ఉదయం 10.30 గంటల సమయంలో ఇస్రోకు చెందిన రిసోర్సాట్ 2ఏ ఉపగ్రహంలోని సెన్సార్ ఈ చిత్రాలను సేకరించింది. ఈ చిత్రాలను ప్రమాదానికి ముందు తీసిన ఉపగ్రహ చిత్రాలతో పోల్చి పరిశీలించడం ద్వారా భూభాగం, నదీ వ్యవస్థలో వచ్చిన మార్పులను నేషనల్‌రిమోట్ సెన్సింగ్ సెంటర్ ఎన్ఆర్ఎస్ఎ గుర్తించింది. ఆగస్టు 26న తీసిన ల్యాండ్‌శాట్9 ఉపగ్రహ చిత్రంలో ఈ ప్రాంతాన్ని జోన్ ఆఫ్ 'గ్లేసియర్ బ్రేకేజ్ అండ్ కొలాప్స్'గా గుర్తించారు. అంతకుముందు 24న తీసిన సెంటినెల్2 ఉపగ్రహ చిత్రంలో ఇదే ప్రాంతం హిమనదంగా కనిపించింది. అయితే ఘటన తర్వాత తీసిన చిత్రాల్లో అదే ప్రాంతం భారీ మంచురాళ్ల కొండచరియలు విరిగిపడిన ప్రాంతంగా కనిపించింది. ప్రభావిత ప్రాంతంలోని కొన్ని భాగాలు మేఘాలతో కప్పబడి ఉండటంతో ఉపగ్రహ చిత్రాల ఆధారంగా పూర్తి స్థాయి అంచనా వేయడంలో పరిమితులు ఉన్నాయని ఎన్ఆర్ఎస్ఎ తెలిపింది. ఈ విశ్లేషణ ప్రాథమికమైనదేనని మరింత సమగ్ర అధ్యయనం అనంతరం పూర్తి వివరాలు వెల్లడిస్తామని నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్, ఇస్రో, అంతరిక్ష శాఖ స్పష్టం చేశాయి.

# సంక్షిప్త వార్తలు

## మళ్లీ ఎన్నికలు జరిగితే ఎన్డీయేకే పట్టం

**న్యూఢిల్లీ, ఆగస్టు 27:** మూడ్ ఆఫ్ ది నేషన్ సర్వేలో ఎన్డీయేకే మళ్లీ ప్రజలు పట్టడం ఖాయం అన్న కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. జనవరిలో నిర్వహించిన గత సర్వేలో ఎన్డీయేకు 352 సీట్లు వస్తాయని అంచనా వేయగా, తాజా సర్వేలో 26 సీట్లు తగ్గాయి. తాజా సర్వేలో ఇండియా కూటమికి 185 సీట్లు వస్తాయని అంచనా వేయగా జనవరి 2026 ఎంఒఎన్ఎస్ సర్వేలో ఈ సంఖ్య 182గా ఉంది. ఓట్ షేర్ ప్రకారం చూస్తే బీజేపీకి 39శాతం, కాంగ్రెస్‌కు 21 శాతం ఓట్లు వస్తాయని అం చనా వేసింది. జూలై 1 నుంచి ఆగస్టు 25 మధ్య 25,184 మంది నుంచి ప్రత్యక్షంగా అభిప్రాయాలను సేకరించారు.

## కుప్పకూలిన శిక్షణ విమానం: ఇద్దరు మృతి

**కాన్పూర్, ఆగస్టు 27:** నగరానికి సమీపంలో ఘోర విమాన ప్రమాదం సంభవించింది. గంగా నది బ్యారేజీ పరిసరాల్లోని ఓ పొలంలో గార్గ్ ఏవియేషన్ అనే కాన్పూర్ ఆధారిత శిక్షణ సంస్థకు చెందిన ప్రైవేట్ శిక్షణ విమానం కుప్పకూలిపోయింది. ఈ దుర్ఘటనలో విమానంలో ఉన్న పైలట్, కోపైలట్ ఇద్దరూ మృతి చెందినట్లు పోలీసులు ధృవీకరించారు.

## మణిపూర్‌లో ఉగ్రదాడి: నలుగురు మృతి

**ఇంఫాల్, ఆగస్టు 27:** నిరంతరం హింసతో ఆందోళనకరంగా ఉండే మణిపూర్‌లో మరోసారి హింసాత్మక ఘటన జరిగింది. ఒక వాహనంపై ఉగ్రవాదులు దాడిచేసి, నలుగురిని హతమార్చారు. మరొకరు గల్లంతయ్యారు. ఈ ఘటన మణిపూర్‌లోని కాంగ్‌గోక్పి జిల్లాలో, మకుయి అషాంగ్‌త బాంబా నాగా ప్రాంతాల మధ్య గురువారం జరిగింది. ఈ ఘటన గురించి సమాచారం అందుకున్న పోలీసులు, భద్రతా బలగాలు అక్కడికి చేరుకున్నాయి. నలుగురి మృతదేహాల్ని సేనాపతి జిల్లా ఆస్పత్రికి తరలించారు. కనిపించకుండా పోయిన ఒక్కరి కోసం, ఉగ్రవాదుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

## లాటరీలు షురూ చేస్తున్న హిమాచల్ ప్రభుత్వం

**సిమ్లా,ఆగస్టు 27:** రాష్ట్రంలో లాటరీలు ప్రవేశపెట్టేందుకు హిమాచల్ ప్రభుత్వం సిద్ధమైంది. ఈ మేరకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. వీటి ద్వారా ఏడాదికి కనీసం రూ.50కోట్ల ఆదాయమైనా వస్తుందని భావిస్తోంది. లాటరీల ప్రక్రియ నిర్వహించేందుకు అర్హత కలిగిన సంస్థల నుంచి హిమాచల్ ప్రభుత్వం టెండర్లను ఆహ్వానించింది. ఇతర రాష్ట్రాలు ఇప్పటికే లాటరీల ద్వారా భారీ ఆదాయం పొందుతున్నాయి.దేశంలో లాటరీలకు అనేక రాష్ట్రాలువ్యతిరేకం.28 రాష్ట్రాల్లో 13 రాష్ట్రాలు మాత్రమే లాటరీలకుఅనుమతిస్తున్నాయి.పంజాబ్ ఏటా రూ.235కోట్ల ఆదాయాన్ని పొందుతుంటే, కేరళ ఏకంగా రూ.13,582 కోట్లు ఆర్జిస్తోంది.

## పార్ట్‌టైమ్ మోడల్ ముస్కాన్ దారుణ హత్య

**న్యూఢిల్లీ, ఆగస్టు 27:** దేశ రాజధాని ఢిల్లీలో 21 ఏళ్ల యువతి, పార్ట్ టైమ్ మోడల్ అయిన ముస్కాన్‌ను గుర్తు తెలియని వ్యక్తి ఆమె ఇంట్లోనే దారుణంగా కత్తితో పొడిచి హత్య చేశాడు. పశ్చిమ ఢిల్లీలోని తిలక్ నగర్ పరిధిలో ఉన్న న్యూమహావీర్ నగర్‌లో బుధవారం సాయంత్రం ఈ ఘటన జరిగింది. ఈ హత్య వెనుక ముస్కాన్ వెళ్లే జిమ్‌లో ట్రైనర్‌గా పని చేస్తున్న ఇమ్రాన్ అనే వ్యక్తి ఉన్నాడని పోలీసులు అనుమానిస్తున్నారు.

## వివేకానంద కేంద్ర చైర్మన్ బాలకృష్ణన్ కన్నుమూత

**ఇటానగర్, ఆగస్టు 27:** వివేకానంద కేంద్రఅధ్యక్షుడు, కన్యాకుమారిలోని వివేకానంద రాక్ మెమోరియల్ చైర్మన్ ఏ.బాలకృష్ణన్(88) గురువారం కన్నుమూశారు. అరుణాచల్‌ప్రదేశ్‌లో మారుమూల ప్రాంతాలకు విద్యను విస్తరించడంలో ఆయనచేసిన సేవలు చిరస్మరణీయంగా నిలిచిపోను న్నాయి. 1938 మే3న జన్మించిన బాలకృష్ణన్ తొలుత భారత వైమానిక దళంలో పని చేశారు. ఏకనాథ్ రాణడేతో పరిచయం ఆయన జీవితాన్ని మలుపు తిప్పింది.



పిసిసి అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌కు రాఖీ కడుతున్న బ్రహ్మకుమారీలు

## సోదరీసోదరుల అనురాగానికి ప్రతీక రాఖీ పర్వదినం

**హైదరాబాద్, ఆగస్టు 27, ప్రభాతవార్త:** అన్నా తమ్ముడు, అక్కా చెల్లి అనుబంధాలకు ప్రతీక రాఖీ పండుగ అని, ప్రతి ఒక్కరు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఉచిత బస్సుల్లో ప్రయాణించి వారి సోదరులకు రాఖీ కట్టి ఆశీస్సులు తీసుకోవాలని, సంతోషంగా తోబుట్టువులతో గడపాలని పిసిసి చీఫ్ మహేశ్ కుమార్‌గౌడ్ పిలుపునిచ్చారు. గురువారం పిసిసి అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌కు రాఖీ పౌర్ణమి సందర్భంగా బ్రహ్మకుమారీలు రాఖీ కట్టి శుభా కాంక్షలు తెలిపారు. మహేశ్‌కుమార్‌గౌడ్ వారికి శుభాకాంక్షలు తెలిపారు. రాఖీ పౌర్ణమి అన్నాచెల్లెళ్ల మధ్య ప్రేమ, ఆప్యాయత, అనురాగం, నమ్మకానికి ఒక చిహ్నమని అన్నారు. రాఖీ కేవలం ఒక దారం కాదని, కుటుంబ బంధాలను మరింత బలోపేతం చేసే పవిత్రమైన అనుబంధానికి ఆధారం అని అన్నారు. అక్కాచెల్లెళ్ల గౌరవం, భద్రత, సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని ఆయన తెలిపారు. మహిళలు అన్ని రంగాల్లో స్వావలంబన సాధించి, ఆత్మగౌరవంతో జీవించేలా ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. ఈ రాఖీ పౌర్ణమి ప్రతి కుటుంబంలో ఆనందం, సంతోషం, సోదరభావం నింపాలని, అన్నాచెల్లెళ్ల అనుబంధం చిరకాలం వర్ధిల్లాలని ఆయన ఆకాంక్షించారు.

## రాజకీయ ప్రయోజనాలకే మహేశ్వర్‌రెడ్డి విమర్శలు

### ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

**హైదరాబాద్,ఆగస్టు 27.ప్రభాతవార్త:** రాజకీయ ప్రయోజనం కోసం బిజెపి శాసనసభ పక్షనేత మహేశ్వర్‌రెడి ఒక వైపు 22 ఏ పైన ప్రభుత్వం స్పష్టత ఇస్తున్నప్పటికి తుగ్లక్ విమర్శలు చేస్తున్నాడనీ ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య విమర్శించారు. కాంగ్రెస్ శాసనసభ పార్టీ కారాల్యయంలో గురువారం మాట్లాడుతూ . 22 ఏ లో ఉన్న ప్రైవేట్ ఆస్తుల రిజిస్ట్రేషన్లు కూడా పూర్తి అవుతున్నాయనీ, నిషేద జాబితాలో ఉన్న వాటిని ప్రభుత్వమే తొలగిస్తోందనీ అన్నారు. మీడియాలో ఉండటం కోసం మహేశ్వర్ రెడ్డి నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారనీ ఆరోపించారు. రాహుల్ గాంధీ కి నెలకు 200 కోట్లు ముడుపులు పంపుతున్నారని మహేశ్వర్ రెడ్డి నైతిక విలువలు లేకుండా విమర్శలు చేయడం తగదని అన్నారు. మహేశ్వర్ రెడ్డి బతుకుంతా ముడుపులపై ఆరోపణలు అని అన్నారు. అర్థం పర్థం లేకుండా మాట్లాడి పరువు తీసుకుంటున్నాడు. బిజెపి అధికారంలో ఉన్న రాష్ట్రాల నుంచి ప్రతి నెలా మోదీ, అమిత్ షా కు ఎన్ని ముడుపులు వెళ్తున్నాయి..? మోదీకి వెళ్తున్న ముడుపులపైన మహేశ్వర్ రెడ్డి వివరించాలనీ డిమాండ్ చేశారు. హరీశ్ రావు,మహేశ్వర్ రెడ్డి ఇద్దరు నోరు దగ్గర పెట్టుకుని మాట్లాడాలనీ రెండు పార్టీలు ఒక్కటే అని ఆయన తెలిపారు.



కేంద్ర మాజీమంత్రి మిలింద్‌దేవరను ఘనంగా సత్కరిస్తున్న శివాజీ, సుధాకర్ తదితరులు

## రాష్ట్రంతోపాటు దేశవ్యాప్తంగా శివసేన పార్టీని బలోపేతం చేస్తాం : కేంద్ర మాజీమంత్రి మిలింద్ దేవర

**హైదరాబాద్ (సైఫాబాద్), ఆగస్టు 27, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంతోపాటు దేశవ్యాప్తంగా శివసేన పార్టీని కిందస్థాయి నుంచి బలోపేతం చేస్తామని, శివసేన అధినేత ఏక్‌నాథ్ షిండే నాయకత్వంలో పార్టీ ముందుకు కొన సాగుతుందని రాజ్యసభ సభ్యుడు, కేంద్ర మాజీమంత్రి మిలింద్ దేవర ధీమా వ్యక్తం చేశారు. మహారాష్ట్ర మోడల్‌ను తెలంగాణలో అమలు చేస్తామని, రాబోయే అన్ని ఎన్నికల్లో పోటీ చేస్తామన్నారు. బుధవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన శివసేన తెలంగాణ రాష్ట్ర కమిటీ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఇక నుంచి తెలంగాణ రాష్ట్రంలో శివసేన నాయకులు రాష్ట్రంలో ఎక్కువగా పర్యటించి ప్రజా సమస్యలపై పోరాటాలను కొనసాగిస్తూనే, పార్టీని బలోపేతం చేస్తారని చెప్పారు. తెలంగాణ రాష్ట్రంలో గోమాతను రాజ్యమాతగా ప్రకటించాలని, ఏక్‌నాథ్‌షిండే మహారాష్ట్ర సిఎంగా ఉన్నప్పుడు గోమాతను రాజ్యమాతగా ప్రకటించారని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. దేశం, ధర్మం కోసం పనిచేసేవారికి శివసేన పార్టీ సరైన వేదికని, పార్టీలోకి యువతను, మహిళలను ఆహ్వానిస్తున్నామన్నారు. ముంబాయిలోని పలు ప్రాంతాలలో నివసిస్తున్న తెలుగు ప్రజలకు ఉచితంగా ఇళ్లు నిర్మించి పూర్తిగా హక్కులు కల్పిస్తున్నామని, అలాగే వారికి అన్ని వసతులు కల్పిస్తున్నామని చెప్పారు. నీటి విషయాలపై చర్చించేందుకు మహారాష్ట్ర సిఎం అపాయింట్‌మెంట్ ఇవ్వడంలేదని సిఎం రేవంత్‌రెడ్డి చెప్పారని, తాను స్వయంగా అపాయింట్‌మెంట్ ఇప్పిస్తానని చెపా ్పరు. ఈ సమావేశంలో శివసేన పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సింకారు శివాజీ, సుధకార్ తదితరులు పాల్గొన్నారు.

## రాజీవ్ పేరు మార్పుతో కేంద్రం రాజకీయాలు చేయడం తగదు : విహెచ్

**హైదరాబాద్, ఆగస్టు 27, ప్రభావార్త:** ఖేల్‌రత్న కురాజీవ్ గాంధి పేరు మార్చడం మంచిది కాదనీ రాజీవ్ పేరు తొలగించి కేంద్రం రాజకీయాలు చేస్తున్నారని ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావు ఆవేదన చెందారు. గాంధీభవన్‌లో గురువారం విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఖేలో ఇండియా యూత్ కార్యక్రమం చేపట్టాలని నిర్ణయించడం గొప్ప విషయం అని కొనియాడారు. రాజీవ్ గాంధీ దేశంలో క్రీడలను ప్రోత్సా హకాలు ఇవ్వడానికి ఆసియన్ గేమ్స్ ఏర్పాటు చేశారనీ గుర్తుచేశారు. యువతను ప్రోత్సహించడం చాలా ముఖ్యమనీ, క్రీడలకు ప్రభుత్వం కృషి చేయడం చాలా సంతోషం అని అన్నారు.ఖేలో.ఇండియా కార్యక్రమంలో సహకారాన్ని ఇస్తూ రూ. 22 కోట్లు మంజూరు చేశారు ఇది సంతోషమనీ, ఇలాగే అన్ని విషయాల్లో కేంద్రం సహకారాన్ని అందించాలనీ ఆయన కోరారు. క్రీడలలో రాజకీయాలు ఉండొద్దు క్రీడా స్ఫూర్తి మాత్రమే ఉండాలనీ హితవు చెప్పారు. రాష్ట్రంలో స్పోర్ట్స్ సిటీ పెట్టడం హర్షణీయం అని అన్నారు.నేను రాజీవ్‌గాంధీ క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నాననీ తెలిపారు.ఈ ఖేలో ఇండోయా కార్యక్రమంలో నా వంతు సహకారాన్ని అందిస్తాననీ అన్నారు. ఈ కార్యక్రమం విజయ వంతం చేయడానికి అందరూ సహకరిం చాలని కోరారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అమెరికా పర్యటన అడ్డుకోవడం మంచిది కాదన్నారు. తెలంగాణకు పరిశ్రమలు, పెట్టుబడులు వచ్చినా అదీ దేశానికి వచ్చినట్టే కదా అని ఆయన సందేహం వ్యక్తం చేశారు. పార్టీలకు అతీతంగా అందరం అభివృద్ధికి పరస్పరం సహకారం అందించుకోవాలని హితవు చెప్పారు.

# ఎల్‌నినోను ఎదుర్కొనేందుకు వ్యవసాయ భూముల్లో నీటి కుంటలు

### రైతులను ఆదుకునేందుకు సర్కార్ కీలక చర్యలు

**హైదరాబాద్, ఆగస్టు 27, ప్రభాతవార్త:** ఎల్‌నినో ప్రభావం వల్ల తెలంగాణ వ్యాప్తంగా వర్షాభావ పరిస్థితులు, భూగర్భ జలాలు అడుగంటుతున్న తరుణంలో రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం కీలక చర్యలు చేపట్టింది. వర్షపు నీటిని ఒడిసిపట్టి పంటలకు జీవం పోసేందుకు జలనిధి పథకం ద్వారా ఫారం పాండ్స్ (నీటి కుంటలు) నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. ఇందుకు గాను భారీ ఎత్తున ప్రోత్సహిస్తోంది. ఈ పథకం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 50 వేల ఫారం పాండ్స్ నిర్మించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని అధికారవర్గాలు వెల్లడించాయి. రాష్ట్రంలోని వరంగల్, ఆదిలాబాద్, మెదక్, మహబూబ్ నగర్ తదితర జిల్లాల్లో ఈ నీటి కుంటలను ఏర్పాటు చేసే పనిలో అధికారులు ఉన్నారు. ముఖ్యంగా నీటి కుంటలు అంటే వ్యవసాయ భూములలో వర్షపు నీటిని నిల్వ చేయడానికి తవ్వే చిన్నపాటి కుంటలు లేదా చెరువులు. వర్షాకాలంలో కురిసే అదనపు నీరు వృధాగా పోకుండా, ఈ కుంటల్లోకి మళ్లించి నిల్వ చేయనున్నారు. వానలు పడని సమయాల్లో లేదా కరవు పరిస్థితుల్లో పంటలు ఎండిపోకుండా కాపాడుకోవడానికి ఈ నీరు ప్రాణాధారంగా మారుతుందని చెబుతున్నారు. ఇది కేవలం ఒక జిల్లాకో, ప్రాంతానికో పరిమితం కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా రైతులందరికీ అందుబాటులో ఉండే అద్భుతమైన జల సంరక్షణ విధానం. రైతులకు కలిగే లాభాలు బహుముఖంగా ఉంటాయని తెలిపారు. వర్షాభావ పరిస్థితుల్లో మినుము, పెసర లాంటి మెట్ట పంటలతో పాటు మిర్చి, పత్తి, పసుపు లాంటి వాణిజ్య పంటలకు అవసరమైనప్పుడు తడులు అందించడం ద్వారా పంట నష్టాన్ని పూర్తిగా నివారించే అవకాశం ఉంటుంది. అంతేకాకుండా, ఈ కుంటల వల్ల చుట్టుపక్కల ఉన్న బోరు బావుల్లో భూగర్భ జల మట్టం గణనీయంగా పెరుగుతుందని భావిస్తున్నారు. నీటి నిల్వ పెరగడం వల్ల రైతులు రెండు పంటలు పండించడానికి ఆస్కారం ఉంటుందనీ, అంతేకాకుండా పంటలకు తోడు, చేపల పెంపకం చేపట్టి అదనపు ఆదాయం పొందవచ్చని క్షేత్రస్థాయి నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. అంతేకాకుండా మనీ వరంగా, సబ్సిడీల రూపంలో రైతులకు ఎంతో మేలు జరుగుతుంది. ఈ ఫారం పాండ్స్ నిర్మాణాన్ని మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంతో అనుసంధానం చేశారు. తద్వారా కుంట తవ్వకానికి అయ్యే కూలీ ఖర్చును పూర్తిగా ప్రభుత్వమే భరిస్తుంది. ముఖ్యంగా తెలంగాణలోని సన్న, చిన్నకారు రైతులందరూ ఈ పథకానికి అర్హులని వెల్లడించారు. సాధారణంగా 5 ఎకరాల వ్యవసాయ భూమి ఉన్న రైతులు సుమారు 10 నుంచి 15 గుంటల విస్తీర్ణంలో ఈ ఫారం పాండ్స్ నిర్మించుకోవడానికి ప్రభుత్వం అవకాశం కల్పించింది.

# పాలిటెక్నిక్ విద్యార్థుల నిరసనలకు బిజెపి మద్దతు

### పార్టీ నాయకుల అక్రమ అరెస్టులకు కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి ఖండన

**హైదరాబాద్, ఆగస్టు 27, ప్రభాతవార్త :** పాలిటెక్నిక్ విద్యార్థుల జీవితాలతో జిఓ నెంబరు 97 చెలగాటమాడుతుందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ రామంతపూర్ పాలిటెక్నిక్ విద్యార్థులకు మద్దతుగా వెళ్తున్న బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావుతో సహా పార్టీ నేతల హౌస్ అరెస్టులను కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఖండించారు. వివాదాస్పద జిఓ 97ను తక్షణమే బేషరతుగా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ నడుపుతున్నది ప్రజా పాలన కాదు, పోలీసుల నిర్బంధ పాలన అని స్పష్టమవుతుందన్నారు.

పాలిటెక్నిక్ విద్యార్థుల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టే వివాదాస్పద జిఓ 97ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఇందిరాపార్క్, మాసాబ్‌ట్యాంక్, రామంతపూర్ నుంచి మొదలుకొని వనపర్తి, పరకాల దాకా విద్యార్థులు రాష్ట్రవ్యాప్తంగా శాంతియుతంగా రోడ్డెక్కితే.. వారిపై లాఠీఛార్జీలు చేయించడం, అరెస్టులు చేయించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు.

రామంతపూర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థుల న్యాయమైన ఆందోళనకు మద్దతు తెలపడానికి వెళ్తున్న తమ పార్టీ నేతల, రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావుతో పాటు పార్టీ ముఖ్య నాయకులను పోలీసులు ఎక్కడికక్కడ అక్రమంగా హౌస్ అరెస్ట్ చేయించడం కాంగ్రెస్ పిరికితనానికి నిదర్శనం అన్నారు. చేతిలో రాజ్యాంగ పుస్తకం పట్టుకుని దేశమంతా తిరిగే రాహుల్ గాంధీకి, కాంగ్రెస్ పాలిత తెలంగాణలో విద్యార్థుల హక్కులను కాలరాస్తుంటే ఎందుకు కనిపించడం లేదు? అంటూ ప్రశ్నించారు. పాలిటెక్నిక్ సాంకేతిక విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేస్తూ, విద్యార్థులకు ఉన్నత విద్య (ఈసెట్) అవకాశాలను దూరం చేసే కుట్రలను రేవంత్ రెడ్డి సర్కార్ తక్షణమే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. కంటితుడుపు కమిటీలతో కాలయాపన చేయకుండా వివాదాస్పద జిఓ97ను వెంటనే బేషరతుగా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ విద్యార్థుల న్యాయమైన హక్కుల సాధన కోసం భారతీయ జనతా పార్టీ అండగా నిలబడి చివరిదాకా రాజీలేని పోరాటం చేస్తుందన్నారు.

# ఖైదీలు సానుకూల ఆలోచనలతో మార్పును పొందాలి

### రామకృష్ణ మఠం అధ్యక్షుడు స్వామి బోధమయానందజీ

**హైదరాబాద్ (కుషాయిగూడ), ఆగస్టు 27, ప్రభాతవార్త:** ఖైదీలు తమ మనసును ప్రశాంతంగా ఉంచుకొని సానుకూలంగా ఆలోచిస్తూ తమలో మంచి మార్పును తీసుకురావడానికి ప్రయత్నిం చాలని రామకృష్ణ మఠం హైదరాబాద్ అధ్యక్షుడు స్వామి బోధమయానందస్వామీజీ పేర్కొన్నారు. చర్లపల్లి కేంద్రకారాగారంలో జైలు శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన స్వామి వివేకానంద వనాన్ని, కాలనీని ఆయన జైళ్ల శాఖ డిజి కరెక్షనల్ సర్వీసెస్ డాక్టర్ సౌమ్యమిశ్రాతో కలిసి ప్రారం భించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జైళ్ల శాఖ ఆధ్వర్యంలో నిర్మితమైన స్వామి వివేకానందకాలనీ ఓనం ఎంతో ఆహ్లాద కరంగా ప్రశాంతంగా ఉందన్నారు. ఖైదీల మార్పు కోసం మానసిక పరివర్తన కోసం సద్బుద్ధిని కలిగించేలా ఎంతో ఆహ్లాదంగా నిర్మించిన ఈ వనం ఖైదీలకు ఎంతో ఉపయోగముందన్నారు. స్వామి వివేకా నంద బోధనలు ధైర్యం, ఆత్మవిశ్వాసం విశ్వసోదర భావం వంటి విలువలను ప్రతి ఒక్కరు నేర్చుకోవాలన్నారు. మంచి పనుల ద్వారా ప్రతి ఒక్కరు మెరుగైన జీవితాన్ని నిర్మించుకోవచ్చని తెలిపారు. ఖైదీల్లో విద్య, వృత్తిశిక్షణ, పునరావాసం ఆధ్యాత్మిక వికాసం వ్యక్తిత్వ నిర్మాణం కోసం జైళ్ల శాఖ చేస్తున్న కృషి అభినందనీయమని స్వామీజీ పేర్కొన్నారు. జైళ్ల శాఖ డిజి డాక్టర్ సౌమ్యమిశ్రా మాట్లాడుతూ స్వామి వివేకానందుని వనం ద్వారా ఖైదీల్లో సానుకూల దృక్పథాన్ని పెంపొందించి వారి జీవితాల్లో పెను మార్పు వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. తమ మనసును ప్రశాంతంగా ఉంచుకొని ఇతరుల పట్ల ప్రేమ, అనురాగాలు సోదర భావాన్ని పెంపొం దించుకోవడానికి స్వామి వివేకానంద వనం ఖైదీలకు ఎంతగానో దోహద పడుతుం దన్నారు. వనంలో యోగా, ధ్యానం ఇతర సాత్విక కార్యక్రమాలు ఏర్పాటు చేయడానికి ప్రణాళిక రూపొం దిస్తున్నామన్నారు. తద్వారా ఖైదీల్లో మానసిక ఒత్తిడిని రూపుమాపి, వారి జీవితాలను మంచి ఆలోచన మార్పు దిశగా ముందుకు తీసుకెళ్లగలుగుతామన్నారు. ఈ కార్యక్రమంలో చర్లపల్లి జైలు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



చర్లపల్లి కేంద్ర కారాగారంలో స్వామి వివేకానంద వనాన్ని ప్రారం భిస్తున్న బోధమయానందస్వామి, జైళ్ల శాఖ డిజి సౌమ్యమిశ్రా

# 'బానిస ప్రభుత్వం' అంటూ కాంగ్రెస్‌ను విమర్శించడం తగదు

### బిఆర్ఎస్ నేతలకు మంత్రి వాకిటి శ్రీహరి హితవు

**హైదరాబాద్, ఆగస్టు 27, ప్రభాతవార్త:** 'బానిస ప్రభుత్వం' అని బిఆర్ఎస్ నేతలు కాంగ్రెస్ వెయ్యిరోజుల పాలనను విమర్శించడం వారి రాజకీయ దిగజారుడుతనానికి నిదర్శనం అని మంత్రి వాకిటి శ్రీహరి ఒక ప్రకటనలో ఆవేదన చెందారు.రైతుల సంక్షేమంపై బిఆర్ఎస్ నేతలు మాట్లాడటం విడ్డూరంగా ఉందనీ ఆయన ఆగ్రహం వ్యక్తంచేశారు, కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందనీ రైతు రుణమాఫీ వంటి కీలక నిర్ణయాలను అమలు చేసి రైతులకు అండగా నిలిచామనీ వాకిటి శ్రీహరి వివరించారు. రైతులకు ఎరువులు, విద్యుత్, సాగునీటి విషయంలో ప్రభుత్వం నిరంతరం చర్యలు తీసుకుంటోందనీ పేర్కొన్నారు.వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం. రైతులను రాజకీయాలకు ఉపయోగించుకోవడం బిఆర్ఎస్ మానుకోవాలనీ హితవు చెప్పారు .యువతను రెచ్చగొట్టడం కాదు.. ఉద్యోగాలు కల్పించడం మా లక్ష్యం అన్నారు. తెలంగాణ ప్రయోజనాలపై బిఆర్ఎస్ నేతలకు మాట్లాడే అర్హత లేదని చెప్పారు. కృష్ణా, గోదావరి జలాల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ హక్కుల పరిరక్షణకు కట్టుబడి ఉంది. రాష్ట్ర ప్రయోజనాలకు విరుద్ధంగా ఒక్క అడుగు కూడా వేయం అని తెలిపారు. ఆంధ్రా ప్రయోజనాల కోసం తెలంగాణ ప్రయోజనాలను తాకట్టు పెట్టే ప్రసక్తే లేదని ప్రకటించారు వెయ్యి రోజుల పేరుతో ప్రజలను మళ్లీ మోసం చేయాలని చూస్తున్నారనీ, బిఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ప్రజల సమస్యలను పట్టించుకోకుండా ఇప్పుడు 'ఛార్జ్‌షీట్' పేరుతో రాజకీయ డ్రామా చేయడం ప్రజలకు తెలుసు అని విమర్శించారు.

# బంగాళాఖాతంలో ఉపరితల ద్రోణి, అల్పపీడనం

### వచ్చే 24 గంటల్లో పలు జిల్లాల్లో భారీ వర్షాలు

**హైదరాబాద్, ఆగస్టు 27, ప్రభాతవార్త:** తెలంగాణలో రైతంగానికి వాతావరణం కేంద్ర చల్లని కబురు చెప్పింది. బంగాళాఖాతంలో ఉపరితల ద్రోని, అల్పపీడన ప్రభావంతో రాష్ట్రంలో రాబోయే మూడు రోజులు పాటు వర్షాలు కురిసే సూచనలు ఉన్నట్టు తెలిపింది. హైదరాబాద్ వాతావరణ శాఖ ప్రకారం ప్రస్తుతం సగటు సముద్ర మట్టం వద్ద ఉన్న రుతుపవన ద్రోణి అమృత్‌సర్, అంబాలా, ముజఫర్‌నగర్, ఆగ్నేయ ఉత్తరప్రదేశ్‌లోని అల్పపీడన ప్రాంతం, రాంచీ, దిఘా మీదుగా ఆగ్నేయ దిశగా ఈశాన్య బంగాళాఖాతం వరకు విస్తరించి ఉందని వెల్లడించింది. అలాగే గురువారం తెల్లవారుజామున 05:30 గంటల సమయంలో తెలంగాణ, రాయలసీమ సరిహద్దుల్లో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం ప్రస్తుతం దక్షి ణ తెలంగాణ, దాని పరిసర ప్రాంతాల్లో కేంద్రీకృతమై ఉంది. ఇది సముద్ర మట్టానికి సుమారు 5.8 కిలోమీటర్ల ఎత్తు వరకు విస్తరించి ఉంది. పశ్చిమ మధ్య-వాయువ్య బంగాళాఖాతం, ఉత్తర ఆంధ్రప్రదేశ్-దక్షిణ ఒడిశా తీరాల్లో గతంలో కొనసాగిన మరో ఉపరితల ఆవర్త నం క్రమంగా కదిలి వాయువ్య బంగాళాఖాతం, బంగ్లాదేశ్ పరిసర ప్రాం తాలకు చేరింది. వీటి ప్రభావంతో రాష్ట్రంలో రాబోయే 24 గంటల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందిని తెలిపింది. తెలంగాణలోని పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షంతో పాటు, గంటకు 30 నుండి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ముఖ్యం ఉత్తర, తూర్పు తెలంగాణలోని ఆదిలాబాద్, ఆసిఫా బాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, పెద్దపల్లి, కరీంనగర్, సిరిసిల్ల, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ జిల్లాల్లో వర్షాలు కురుస్తాయని తెలిపింది. అలాగే పశ్చిమ తెలంగాణలోని కామారెడ్డి, మెదక్, సంగారెడ్డి, వికారాబాద్ జిల్లాలతో పాటు హైదరాబాద్, మల్కాజ్‌గిరి, రంగారెడ్డి, నల్గొండ, సూర్యాపేట, మహబూబ్‌నగర్ జిల్లాల్లో మోస్తరు నుంచి తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్

# విద్యుత్ పంపిణీ సంస్థల స్మార్ట్ దోపిడీ

### సింగిల్ ఫేజ్‌కు రూ.9 వేలు, 3 ఫేజ్‌కు రూ.17 వేలు

### పక్కనున్న ఆంధ్రలో ప్రభుత్వమే భరింపు

**హైదరాబాద్, ఆగస్టు 27, ప్రభాతవార్త:** విద్యుత్ సంస్కరణల్లో భాగంగా విద్యుత్ పంపిణీ సంస్థలు రాష్ట్రవ్యాప్తంగా స్మార్ట్ విద్యుత్ మీటర్లను ప్రవేశపెట్టి వినియోగదారుల దోపిడీకి సిద్ధమవుతున్నాయి. రివాంప్డ్ డిస్ట్రిబ్యూషన్ సెక్టార్ స్కీమ్ (ఆర్‌డిఎస్ఎస్) పథకం కింద త్వరలో స్మార్ట్ మీటర్లను బిగించనుంది. దీనికోసం రూ.25,096 కోట్ల వ్యయంతో విద్యుత్ శాఖ రూపొందించిన ప్రతిపాదనలను కేంద్రం నుంచి గ్రీన్‌సిగ్నల్ రావడంతో స్మార్ట్ మీటర్లను యుద్ధప్రాతిపదికన ఏర్పాటు చేయాలని దక్షిణ, ఉత్తర తెలంగాణ పంపిణీ సంస్థలు నిర్ణయించాయి. వ్యవసాయ కనెక్షన్లకు మాత్రం ఈ విధానం నుండి మినహాయింపునిచ్చాయి. వ్యవసాయ రంగాన్ని మినహాయించి మిగిలిన గృహ (డొమెస్టిక్), వాణిజ్య (కమర్షియల్), పారిశ్రామిక (ఇండస్ట్రియల్) కేటగిరీలన్నింటికీ దశలవారీగా ఈ సరికొత్త మీటర్లను అమర్చనున్నారు. తొలి దశలో భాగంగా నెలకు 200 యూనిట్లకు పైగా విద్యుత్ వినియోగించే ఇళ్లకు, అపార్ట్‌మెంట్లు, గ్రూప్ హౌస్‌లకు ఈ మీటర్లు తప్పనిసరిగా బిగిస్తారు. సింగిల్ ఫేజ్ మీటర్‌కు సుమారు రూ.9 వేలు, త్రీ ఫేజ్ మీటర్‌కు రూ.17 వేలు వరకు ఖర్చు అవుతుందని అంచనా.

ఈ మొత్తాన్ని సర్వీసుదారులపైనే వేయాలని భావిస్తున్నాయి. మొదట కొత్త విద్యుత్ కనెక్షన్లతో ప్రారంభించి, దశలవారీగా ఇప్పటికే ఉన్న వినియోగదారులకు ఈ వ్యవస్థను విస్తరించనుంది. ఇప్పటికే హైదరా బాద్ జీడిమెట్ల పారిశ్రామిక వాడ ప్రాంతంలో పైలట్ ప్రాజెక్టుగా సుమారు 12 వేల స్మార్ట్ మీటర్లను విద్యుత్ అధికారులు అమర్చారు. ఈ అనుభవం ఆధారంగా ఇదే విధానాన్ని రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేయాలని విద్యుత్ పంపిణీ సంస్థలు నిర్ణయించాయి. ఇందులో భాగంగా కొత్తగా విద్యుత్ కనెక్షన్ తీసుకునే వినియోగ దారులకు ఇకపై స్మార్ట్ మీటర్లే ఇవ్వనున్నారు. ఆ తర్వాత దశలవారీగా కార్యాలయాలు, వ్యాపార, వాణిజ్య సంస్థలు, అధిక వినియోగం ఉన్న గృహాలకు అమర్చనున్నట్లు తెలిపారు. ఈ స్మార్ట్ మీటర్ల తయారీ, ఏర్పాటుకు అయ్యే మొత్తం ఖర్చును వినియోగదారుల నుంచే వసూలు చేయాలని తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థలు నిర్ణయించినట్లు తెలుస్తోంది. వాయిదాల పద్ధతిలో బిల్లులోనే ఈ మీటర్‌కు సంబంధించిన చార్జీలను వసూలు చేయనున్నాయి. దీంతో స్మార్ట్ మీటర్ల వల్ల వినియోగదారులపై భారీగా భారం పడనుంది.

అయితే పక్కనే ఉన్న ఆంధ్రప్రదేశ్‌లో అక్కడి ప్రభుత్వం ఇప్పటికే పాత సర్వీసులతో సహా అన్నింటికి స్మార్ట్ మీటర్లను అమర్చింది. కాని ఆ రాష్ట్రంలో స్మార్ట్ మీటర్లకయ్యే వ్యయాన్ని అక్కడి ప్రభుత్వమే భరించింది. కాని అందుకు విరుద్ధంగా రాష్ట్రంలో మాత్రం వినియోగదారుల నుండి వసూలు చేయాలని నిర్ణయించడం పట్ల అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి.



భరతనాట్య కళాకారిణి డా. రాజేశ్వరి సాయినాథ్‌కు

## డిజిపి సి.వి.ఆనంద్ అభినందనలు

### కేంద్ర సంగీత నాటక అకాడమీ ప్రతిష్ఠాత్మక పురస్కారం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,ఆగస్టు27:** ప్రముఖ భరతనాట్య కళాకారిణి డా. రాజేశ్వరి సాయినాథ్‌ను డిజిపి సి.వి. ఆనంద్ అభినం దించారు. కేంద్ర సంగీత నాటక అకాడమీ ప్రతిష్ఠాత్మక పురస్కారాన్ని ఆగస్టు 13న అందుకున్న రాజేశ్వరి సాయినాథ్ గురువారం డిజిపి ని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమెకు సి.వి. ఆనంద్ అభినందనలు తెలిపారు. భరతనాట్యాన్ని దేశ, విదేశాల్లో విస్తృతంగా ప్రదర్శించిన రాజేశ్వరి సాయినాథ్.. అమెరికా, బ్రిటన్ తదితర దేశాల్లోనూ ప్రదర్శనలు ఇచ్చారు. భరతనాట్య అకాడమీని నిర్వహిస్తూ వేలాది మందికి శిక్షణ అందిస్తున్నారు. నృత్యం ద్వారా వైద్యం, పర్యావరణ పరిరక్షణ, సామాజిక చైతన్యం తదితర అంశాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు కృషి చేస్తున్నారు. మ్యాథ మెటిక్స్, డ్యాన్స్‌లో పిహెచ్‌డీలు చేసిన ఆమె.. గత 55 సంవత్స రాలుగా భరతనాట్య ప్రదర్శనలిస్తూ కళ పట్ల అంకితభావాన్ని చాటుతున్నారు.

## ప్రభుత్వం తక్షణమే కొత్త పిఆర్‌సిని అమలుచేయాలి

### లేదా ఉద్యమం తప్పదు: జెఎసి

**హైదరాబాద్ (ధర్నాచౌక్), ఆగస్టు 27, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు తక్షణమే కొత్త పిఆర్‌సిని ప్రకటించాలని, అలాగే కరువుభత్యంతోపాటు ఇతర పెండింగ్ సమస్యలను పరిష్కారించాలని తెలంగాణ ప్రభుత్వ గజిటెడ్, ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్ల జెఎసి డిమాండ్ చేసింది. లేకపోతే పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని, ఉద్యమానికి అందరూ సిద్ధం కావాలని జెఎసి నాయకులు పిలుపునిచ్చారు. జెఎసి ఆధ్వర్యంలో బుధవారం ధర్నాచౌక్‌లో జరిగిన మహాధర్నాలో వేలాది మంది గజిటెడ్, ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్ష నర్లు నల్ల బ్యాడ్జిలు, నల్ల వస్త్రాలు ధరించి పాల్గొని నినదించారు. జెఎసి రాష్ట్ర ఇచ్చిన పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్త కార్యక్రమంలో భాగంగా రంగారెడ్డి, హైద రాబాద్ జిల్లాలకు చెందిన వేలాది మంది పాల్గొన్నారు.

ఈ సందర్భంగా జెఎసి చైర్మన్ మారం జగదీశ్వర్, సెక్రటరీ జనరల్ ఏలూరి శ్రీనవాసరావు మాట్లాడుతూ తమది ప్రజా ప్రభుత్వమని చెప్పుకుంటున్న ఈ ప్రభుత్వం ఉద్యోగుల సమస్యలను పరిష్కారించకుండా జాప్యం చేస్తున్నదని ఆరో పించారు. ప్రభుత్వ పనితీరుతో ఉద్యోగులు తీవ్రంగా ఆవేదన చెందుతున్నా రని, సిఎం రేవంత్‌రెడ్డి మీద తమకు ఎంతో గౌరవం ఉందని, ఆ ఉద్దేశంతోనే ఇంతకాలం ఓపిక పట్టామన్నారు.

ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, క్యాబినేట్ సబ్ కమిటీ సభ్యులు ఐఎఎస్ అధికారుల కమిటీని పలుమార్లు కలిసి సమస్యలను పరిష్కారించాలని కోరినప్పటికి ఏలాంటి ఫలితం లభించలేదని, దీంతో నేడు రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగుల మహా ధర్నాలు తప్పలేదన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం తమ డిమాండ్లను పరిష్కరించాలని, లేకపోతే ఉద్యమాన్ని ఉదృతం చేస్తామని వారు హెచ్చరించారు. ఈ మహాధర్నాలో నాయకులు చావ రవి, రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డికి నోటీసులు పంపిన ఎథిక్స్ కమిటీ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,ఆగస్టు27:** బిఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డికి అసెంబ్లీ ఎథిక్స్ కమిటీ నోటీసులు జారీ చేసింది. ఎమ్మెల్యే కడియం శ్రీహరిపై చేసిన వ్యాఖ్యలపై ఈనెల 29న అసెంబ్లీ కమిటీ హాల్‌లో ఉ. 11 గం.కు ఎథిక్స్ కమిటీ భేటీ విచారణ జరపనుంది. ఈ మేరకు నోటీసులు పంపింది.



మహాధర్నాలో అభివాదం చేస్తున్న బండారు దత్తాత్రేయ, మధుసూదనాచారి, ఎర్ర సత్యనారాయణ, గుజ్జ కృష్ణ, నాగుల శ్రీనివాస్‌యాదవ్ తదితరులు

## ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను తక్షణమే చెల్లించాలి : బిసి నేతలు

**హైదరాబాద్ (ధర్నాచౌక్), ఆగస్టు 27, ప్రభాతవార్త:** ప్రభుత్వం విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకపోవడంతో 12 లక్షల మంది విద్యా ర్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తక్షణమే నిధులు విడుదల చేయాలని హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, రాష్ట్ర శాసన మం డలిలో ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి, మాజీమంత్రి వి.శ్రీని వాస్‌గౌడ్, రాష్ట్ర బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎర్ర సత్య నారాయణ డిమాండ్ చేశారు. లేదా రాష్ట్రవ్యాప్తంగా పెద్దఎత్తున ఉద్యమం కొనసాగుతుందని, విద్యార్థుల్లో తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు. రాష్ట్ర బిసి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గురువారం ధర్నాచౌక్‌లో జరిగిన విద్యా ర్థుల మహా ధర్నాలో వారు ప్రసంగించారు. పెండింగ్‌లో ఉన్న బిసిల 42 శాతం రిజర్వేషన్‌ల బిల్లులను తక్షణమే అమోదించాలని, మహిళా రిజర్వే షన్ బిల్లులో బిసి కోటా తేల్చాలని వారు డిమాండ్ చేశారు. ఫీజుల బకా యిలతోపాటు గతంలో కొనసాగిన మాదిరిగా పూర్తి ఫీజులు చెల్లింపులు అమలు చేయాలని డిమాండ్ చేశారు. మహాధర్నాలో బిసి నేతలు గుజ్జ కృష్ణ, పాండుయాదవ్, కోల జనార్దన్, నాగుల శ్రీనివాస్‌యాదవ్, మీనగా గోపి, ఉదయ్‌నేత తది తరులు పాల్గొని ప్రసంగించారు.



## ప్రమాదంలో మృతి చెందిన కానిస్టేబుల్ కుటుంబానికి రూ.95 లక్షల బీమా పరిహారం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,ఆగస్టు27:** విధి నిర్వహణ అనంతరం రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మల్కాజిగిరి కమిషనరేట్‌కు చెందిన కానిస్టేబుల్ కంబాల శంకర్ కుటుంబానికి రూ.95 లక్షల బీమా పరిహారంను గురు వారం డిజిపి సి.వి.ఆనంద్ చేతుల మీదుగా కానిస్టేబుల్ కుటుంబ సభ్యులకు అందించారు. మల్కాజిగిరి కమిషనరేట్‌లో ఏఆర్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న కంబాల శంకర్ (31) మార్చి 28న విధులు ముగించుకుని ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళ్తుండగా వాడపర్తి గ్రామం వద్ద అదుపుతప్పి ప్రమాదానికి గురయ్యారు. తీవ్ర గాయాలతో తొలుత ఎయిమ్స్‌కు, అనంతరం సికింద్రాబాద్ యశోద ఆసుపత్రికి తరలించగా.. మార్చి 31న మృతి చెందారు. శంకర్ జీతం బ్యాంక్ ఆఫ్ బరోడా పోలీస్ శాలరీ ప్యాకేజీ ఖాతాలో జమయ్యేది. ప్రమాదంపై బ్యాంకుకు సమాచారం అందడంతో బీమా క్లెయిమ్ ప్రక్రియ చేపట్టారు. జీటీఎల్ కింద రూ.15 లక్షలు, గ్రూప్ పర్సనల్ యాక్సిడెంట్ (జీపీఏ) కింద రూ.80 లక్షలు కలిపి మొత్తం రూ.95 లక్షల పరిహారం మంజూరైంది. ఈ కార్యక్రమంలో ఐజి వెల్ఫేర్ గజరావు భూపాల్, బ్యాంక్ ఆఫ్ బరోడా జనరల్ మేనేజర్, జోనల్ హెడ్ ఎం.వి.ఎస్. సుధాకర్, ఎస్ కె ప్రసాద్, రవి పాల్గొనగా, రూ.95 లక్షల చెక్కును డీజీపీ సి.వి. ఆనంద్ చేతుల మీదుగా మృతుడి తల్లిదండ్రులకు అందజేశారు.

# దేవదుర్గ గని నుంచి విరివిగా బంగారం, రాగి వెలికితీసి సంపదను పెంచుదాం

### సైట్ క్యాంప్ ఆఫీస్ ఏర్పాటు చేయాలని సింగరేణి అధికారులకు ఆదేశం

### దేవదుర్గలో కాపర్, గోల్డ్ మైనింగ్ అన్వేషణ కార్యక్రమాన్ని అధికారికంగా ప్రారంభించిన డిప్యూటీసీఎం భట్టివిక్రమార్క

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,ఆగస్టు27:** కర్ణాటకలోని దేవదుర్గ గని నుంచి పెద్ద ఎత్తున బంగారం, రాగి ఖనిజాలను వెలికితీసి దేశ సంపదను పెంపొందించడానికి మనమందరం కలిసికట్టుగా కృషి చేద్దామని తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. రాయచూరు జిల్లా, దేవదుర్గ తాలూకా లింగదహళ్ళి గ్రామంలో సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన కాపర్, గోల్డ్ మైనింగ్ అన్వేషణ కార్యక్రమాన్ని అధికారికంగా డిప్యూటీ సీఎం ప్రారంభించారు అనంతరం ఖనిజ అన్వేష ప్రదేశాలను ఆయన క్షేత్రస్థాయిలో స్వయంగా పరిశీలించారు.దాదాపు 136 సంవత్సరాల సుదీర్ఘ మైనింగ్ అనుభవం ఉన్న సింగరేణి కాలరీస్ సంస్థ, కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన టెండర్లలో దేవదుర్గ్ బ్లాక్ ఎక్స్‌ప్లోరేషన్ (అన్వేషణ) హక్కులను దక్కించుకున్న విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు.ఈ క్షేత్రస్థాయి పరిశీలన అనంతరం ఆయన మాట్లాడుతూ, అన్వేషణ పనులను సింగరేణి సంస్థ త్వరలోనే వేగవంతం చేస్తుందని స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టు విజయవంతమై ఇక్కడ బంగారం, రాగి విరివిగా లభిస్తే ప్రాంతీయంగా నిరుద్యోగ యువతకు పెద్ద ఎత్తున ఉపాధి లభించడమే కాకుండా ఈ ప్రాంతం శీఘ్రగతిన అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.పనుల పర్యవేక్షణ కోసం అధికారులు ఇక్కడే ఉండేలా సింగరేణి ఆధ్వర్యంలో త్వరలోనే ఒక సైట్ ఆఫీస్‌ను, అలాగే రాకపోకల సౌకర్యార్థం హెలిప్యాడ్‌ను కూడా ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. స్థానిక రెవెన్యూ అధికారులు స్థలాన్ని కేటాయించిన వెంటనే ఈ నిర్మాణ పనులు ప్రారంభమవుతాయన్నారు.అలాగే, కృష్ణానదికి ఇరువైపులా ఉన్న తెలుగు, కర్ణాటక ప్రజల మధ్య విడదీయరాని చారిత్రక, సాంస్కృతిక బంధం ఉందని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. ఒకప్పుడు ఈ ప్రాంతం హైదరాబాద్ రాష్ట్రంలోనే భాగమైనందున మన మూలాలు ఒక్కటేనని గుర్తుచేశారు., స్థానిక ప్రజల అండదండలతో ఈ ప్రాజెక్టును త్వరలోనే విజయవంతంగా పూర్తి చేసి దేశ సంపదను పెంచడానికి ఉపయోగపడదామని పిలుపునిచ్చారు. ఈ అన్వేషణ రెండు రాష్ట్రాల పురోగతికి, దేశ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి ఎంతగానో దోహదపడుతుందని ఆకాంక్షి ంచారు. దేవదుర్గ ప్రాంతంతో తనకు ప్రత్యేక అనుబంధం ఉందని సింగరేణి సిఎండి డాక్టర్ బుద్ధ ప్రకాష్ జ్యోతి అన్నారు. ఈ ప్రాంతంలో గతంలో సిఐ గా పని చేసిన పని చేశానని ప్రస్తుతం సింగరేణి సంస్థ చైర్మన్ డైరెక్టర్ గా ఇక్కడ బంగారం రాగి కనీసం పనులను స్థానికుల సమక్షంలో ప్రారంభించుకోవడం ఆనందంగా ఉందన్నారు ఈ పరమానంద స్వామి గుట్ట పరమానంద స్వామి ఆశీస్సులతో ఇక్కడ బంగారు నిక్షేపాలు లభించాలని స్థానికులకు ఉపాధి అవకాశాలు కలగాలని ఆకాంక్షి ంచారు.



లింగదహళ్ళి గ్రామానికి చేరుకున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు కర్ణాటక మాజీ మంత్రి బోసురాజు తనయుడు, కాంగ్రెస్ నాయకుడు రవి బోసురాజు, స్థానిక సర్పంచ్ ఎల్లమ్మ తదితరులు ఘనంగా స్వాగతం పలికారు. పర్యటనలో భాగంగా లింగదహళ్ళిలోని దేవదుర్గ బంగారు ఖనిజ బ్లాక్ వ్యూ పాయింట్ నుంచి ఖనిజ అన్వేష ణ చేపట్టనున్న ప్రాంతాలను ఉప ముఖ్యమంత్రి క్షుణ్ణంగా పరిశీలించారు.

అనంతరం అక్కడి బ్లాక్ నుంచి సింగరేణి అధికారులు సేకరించిన వివిధ రకాల ఖనిజ నమూనాలతో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను తిలకించారు. ఈ సందర్భంగా అక్కడ నిర్వహించబోయే బంగారం, రాగి వెలికితీత, అన్వేషణ ప్రక్రియల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సింగరేణి అధికారులు మరియు కర్ణాటక రాష్ట్ర అధికార యంత్రాంగంతో డిప్యూటీ సీఎం సమీక్షా సమావేశం నిర్వహించి ఖనిజ అన్వేషణపై దిశా నిర్దేశం చేశారు.

క్షేత్రస్థాయి పర్యటన ముగించుకుని లింగదహళ్ళి గ్రామంలోని చారిత్రక నేపథ్యం కలిగిన శ్రీ పరమానంద శివాలయాన్ని దర్శించుకున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అక్కడ ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సింగరేణి సంస్థ చైర్మన్, ఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి, డైరెక్టర్ సీకే వెంకటేశ్వర్లు, జీఎం పంకజ్ కుల శ్రేష్ట, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల ప్రజాప్రతినిధులు, సింగరేణి ఉన్నతాధికారులు మరియు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## 40 యేళ్లుగా పెరోల్‌పై పరారీ

### విస్మయం వ్యక్తం చేసిన హైకోర్టు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,ఆగస్టు27:** సినిమా కథను మించిన ఓ వింత ఘటన... పెరోల్‌పై విడుదలైన ఒక జీవితఖైదీ 40 ఏళ్లకు పైగా జైలు శిక్షకు దూరంగా ఉండటం పట్ల హైకోర్టు ఆశ్చర్యం వ్యక్తం చేసింది. అంతేకాకుండా తన నేర చరిత్రను దాచిపెట్టి ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేయడం పట్ల న్యాయస్థానం విస్మయం వ్యక్తం చేసింది. ఈ పరిస్థితి జైళ్ల శాఖలోని లోపాలను ఎత్తిచూపుతోందని పేర్కొంటూ పెరోల్ గడువు ముగిసిన తర్వాత ఖైదీ జైలుకు తిరిగి రాకపోతే తక్షణ చర్యలు తీసుకునేందుకు ఓ టాస్క్ ఫోర్సును ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని పేర్కొంది. అతనికి మూడేళ్ల పాటు పెరోల్ నిరాకరిస్తూ తీసుకున్న నిర్ణయంలో జోక్యం చేసుకోవడానికి ధర్మాసనం నిరాకరించింది. మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి మండలం పెద్దముప్పారం గ్రామానికి చెందిన సందెల వీరన్న అనే వ్యక్తిని 40 ఏళ్ల తర్వాత అరెస్టు చేయడాన్ని, ఆ తర్వాత పెరోల్ నిరాకరించడాన్ని సవాల్ చేస్తూ అతని భార్య చారమ్మ పిటిషన్ దాఖలు చేశారు. ఈ మేరకు కేసును విచారించిన జస్టిస్ జస్టిస్ టి.మాధవీ దేవి విస్మయం వ్యక్తం చేశారు. వీరన్న 1983 నుంచి మహబూబాబాద్ ప్రాంతంలో నివసిస్తున్నా అధికారులు ఎప్పుడూ అతన్ని సంప్రదించలేదని పిటిషనర్ తరఫు న్యాయవాది వాదించారు. మే 16, 2024న పోలీసులు అతని ఇంటికి వచ్చి అరెస్టు చేశారని, మూడేళ్ల పాటు అతని పెరోల్ హక్కులను రద్దు చేయడం సమంజసం కాదని న్యాయవాది వాదించారు.

పెరోల్ గడువు ముగిసిన తర్వాత ఆ ఖైదీకి సంబంధించి వరంగల్ రూరల్, మహబూబాబాద్ పోలీసులకు జైలు అధికారులు అనేక లేఖలు రాశారని ప్రభుత్వం తరఫు న్యాయవాది కోర్టుకు వినిపించారు. అతను చివరిగా ఇచ్చిన చిరునామాతో పాటు సమీప గ్రామాల్లో కూడా అధికారులు అతని కోసం గాలించారని పేర్కొన్నారు. ఖైదీ ఆచూకీ కనుగొన్న తర్వాత తగిన చర్యల్లో భాగంగా మూడు సంవత్సరాల పాటు పెరోల్‌పై నిషేధం విధించారని కోర్టుకు తెలిపారు. ఖైదీ తన జైలు శిక్షను తప్పించుకుని జీవితంలో అత్యంత కీలకమైన సంవత్సరాలను జైలు బయటే గడిపాడని, అతనికి విధించిన జీవిత ఖైదు శిక్ష ఇంకా ఇప్పటికీ రద్దు కాలేదని ఇరు పక్షాల వాదనల అనంతరం న్యాయమూర్తి స్పష్టం చేశారు. అతను ఉద్దేశపూర్వకంగానే శిక్షను తప్పించుకున్నట్లు కనిపిస్తోందని, అందువల్ల తన మిగిలిన శిక్షను కచ్చితంగా అనుభవించాల్సిందేనని ధర్మాసనం తీర్పు వెలువరించింది. జూన్ 1983లో ఒక హత్య కేసులో నందుల వీరన్నకు వరంగల్ కోర్టు జీవితఖైదు విధించింది. మొదట అతన్ని చంచల్‌గూడ జైలులో ఉంచారు. కానీ అదే ఏడాది డిసెంబర్‌లో పెరోల్‌పై విడుదల చేశారు. అతని పెరోల్ గడువు 1984 మార్చి 17తో ముగిసినప్పటికీ అతను తిరిగి లొంగిపోలేదు. ఆ తర్వాత అతను ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా నియమితుడై 2004లో ఉత్తమ ఉపాధ్యాయుడిగా పురస్కారాన్ని సైతం అందుకున్నాడు. 2024 మే నెలలో ఒక ప్రత్యేక టాస్క్ ఫోర్స్ బృందం వీరన్నను అదుపులోకి తీసుకుని జైలు అధికారుల ముందు హాజరుపరిచింది. దీన్ని అనుసరించి హోం శాఖ అతనికి కారణం చూపాలని కోరుతూ షోకాజ్ నోటీసులు జారీ చేసింది. అతని వివరణ సంతృప్తికరంగా లేకపోవడంతో మూడేళ్లపాటు పెరోల్‌ను నిరాకరించాలని నిర్ణయించారు. దీన్ని సవాలు చేస్తూ వీరన్న భార్య కోర్టును ఆశ్రయించారు.

# హైదరాబాద్ యువతి సుహాసినిరెడ్డి మిస్సింగ్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,ఆగస్టు27:** నేపాల్‌లో వరదల బీభత్సంలో హైదరాబాద్‌కు చెందిన యువతి గల్లంతైనట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. హైదరాబాద్‌లోని ఎల్బీనగర్ వాస్తు కాలనీకి చెందిన సుహాసిని రెడ్డి మానససరోవర్ యాత్రకు వెళ్లి అదృశ్యమయ్యారు. మంగళవారం రాత్రి నుంచి ఫోన్‌కు స్పందన లేకపోవడంతో కుటుంబసభ్యులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఆస్ట్రేలియాలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పని చేస్తున్న సుహాసినిరెడ్డి ఈ నెల 19న హైదరాబాద్‌కు వచ్చారు. అనంతరం మానస సరోవర్ యాత్రకు వెళ్లేందుకు 3 నెలల క్రితమే తన ఆస్ట్రేలియా స్నేహితురాలితో కలిసి టికెట్లు బుక్ చేసుకున్నారు. సుహాసిని హైదరాబాద్ నుంచి నేపాల్ వెళ్లగా, ఆమె స్నేహితురాలు ఆస్ట్రేలియా నుంచి కాట్మండు చేరుకు న్నారు. అక్కడ ఇద్దరూ కలుసుకున్నారు.

అనంతరం టూర్స్ అండ్ ట్రావెల్స్ ద్వారా మొత్తం 29 మంది యాత్రకు బయలుదేరినట్లు సుహాసిని కుటుంబ సభ్యులు తెలిపారు. అయితే మంగళవారం రాత్రి 8 గంటల నుంచి సుహాసిని ఫోన్‌కు స్పందన లేదని వాపోయారు. కొద్దిసేపటికే నేపాల్‌లో వరదలు వచ్చినట్లు సమాచారం అందడంతో తమ ఆందోళన మరింత పెరిగిందని చెప్పుకొచ్చారు. సుహాసిని ఆచూకీ కోసం కుటుంబసభ్యులు అన్ని విధాలుగా ప్రయత్నిస్తున్నా ఇప్పటివరకు ఎలాంటి సమాచారం లభించలేదు. తమ కుమార్తెను సురక్షితంగా గుర్తించాలని తల్లిదండ్రులు కన్నీటి పర్యంతమవుతున్నారు. అధికారులు వెంటనే స్పందించి ఆమెను గుర్తించి సురక్షితంగా తీసుకురావాలని కోరుతున్నారు. నేపాల్, పరిసర ప్రాంతాల్లో వరదల కారణంగా నెలకొన్న పరిస్థితులను తెలంగాణ ప్రభుత్వం నిరంతరం పర్యవేక్షిస్తూ, న్యూఢిల్లీలోని తెలంగాణ భవన్ హెల్ప్‌లైన్, సమన్వయ కేంద్రం, హైదరాబాద్‌లోని తెలంగాణ సచివాలయం హెల్ప్ లైన్‌తో సమన్వయంగా అవసరమైన సహాయక చర్యలను కొనసాగిస్తోంది. హెల్ప్‌లైన్ ప్రారంభించినప్పటి నుంచి కుటుంబ సభ్యులు, ఇతరుల నుంచి సమాచారం, సహాయం కోరుతూ సుమారు 80 నుంచి 100 కాల్స్ అందాయి. అందిన సమాచారాన్ని ప్రాథమికంగా పరిశీలించి, ధృవీకరించిన అనంతరం 20 కేసులను తదుపరి చర్యలు చేపట్టాల్సిన కేసులుగా గుర్తించారు. ఈ కేసులు మొత్తం 23 మందికి సంబంధించినవి. వీరిలో 6 మంది తెలంగాణకు చెందినవారు కాగా, 17 మంది తెలంగాణ మూలాలు కలిగిన ఎన్ఆర్ఐలు. ఈ క్రమంలో, కైలాస మానస సరోవర్ యాత్రకు వెళ్లిన రంగారెడ్డి జిల్లాకు చెందిన ఒక వ్యక్తి సురక్షితంగా ఉన్నట్లు తాజాగా నిర్ధారణ అయింది. ఆయన తన కుటుంబ సభ్యులను కూడా సంప్రదించారు. దీంతో, గుర్తించిన 23 మందిలో ఒకరు సురక్షితంగా ఉన్నట్లు నిర్ధారణ కాగా, హైదరాబాద్ యువతి సుహాసినిరెడ్డి మిస్సింగ్ అయినట్లు భావిస్తున్నారు. మిగిలిన 21 మంది పరిస్థితిపై సంబంధిత అధికారులతో సమన్వయం చేస్తూ నిరంతర ఫాలోఅప్ కొనసాగుతోంది. సంబంధిత వ్యక్తుల్లో పలువురు నేపాల్-టిబెట్ ప్రాంతంలో ప్రయాణి స్తున్న వారు కాగా, మానస సరోవర్ యాత్రకు వెళ్తున్న లేదా తిరిగి వస్తున్న వారు కూడా ఉన్నారు. వారి చివరిగా తెలిసిన ప్రాంతాల్లో రసువా, రసువాగఢి, గ్యిరోంగ్ ప్రాంతాలు ఉన్నాయి.

## ఎపి, తెలంగాణ జల వివాదాలపై సెప్టెంబరు 7న ఢిల్లీలో సిడబ్ల్యుసి భేటీ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఆగస్టు27:** ఏపీ, తెలంగాణ మధ్య కృష్ణా, గోదావరి జల వివాదాల పరిష్కారానికి కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ) చైర్మన్ అధ్యక్షతన ఇరు రాష్ట్రాల అధికారులతో ఏర్పాటు చేసిన కమిటీ రెండో సమావేశం సెప్టెంబర్ 7న న్యూఢిల్లీలో జరగనుంది. కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ అధ్యక్షతన గతేడాది జూలై 16న ఢిల్లీలో తెలంగాణ, ఏపీ సిఎంలతో నిర్వహించిన సమావేశంలో సంప్రదింపుల ద్వారా జల వివాదాలను పరిష్కరించుకోవడానికి ఓ కమిటీ ఏర్పాటు చేసుకోవాలని నిర్ణయం తీసుకోగా, కమిటీ తొలి సమావేశం గత జనవరి 30న జరిగింది. తదుపరి సమావేశాల్లో చర్చించాల్సిన అంశాలతో ఎజెండాను ప్రతిపాదించాలని రెండు రాష్ట్రాలకు ఆ సమావేశంలో సీడబ్ల్యూసీ చైర్మన్ సూచించారు. పోలవరం-బనకచర్ల/నల్లమల్లసాగర్ ప్రాజెక్టుపై ఈ కమిటీ సమావేశాల్లో చర్చించడానికి అప్పట్లో తెలంగాణ అభ్యంతరం తెలిపింది. రెండు రాష్ట్రాలు కమిటికి ఎజెండాను ప్రతిపాదించకపోవడంతో తదుపరి సమావేశం సాధ్యం కాలేదు. ఇటీవల కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా అధ్యక్షతన జరిగిన సదరన్ జోనల్ కౌన్సిల్ సమావేశంలో చర్చల ద్వారా జలవివాదాలు పరిష్కరించుకోవాలని ఆయన రెండు రాష్ట్రాలకు సూచించారు. దీంతో తక్షణమే సీడబ్ల్యూసీ కమిటీ రెండో సమావేశాన్ని నిర్వహించనుంది.

## కొండగట్టు ఆలయ అభివృద్ధి పనుల జాప్యంపై జనసేన ప్రశ్నలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,ఆగస్టు27:** తెలంగాణలోని ప్రముఖ పుణ్యక్షేత్రం కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయ అభివృద్ధి పనుల జాప్యంపై జనసేన పార్టీ ప్రశ్నలు సంధించింది. నిధులు సిద్ధంగా ఉన్నప్పటికీ పనులు ప్రారంభించడంలో ఎందుకు ఆలస్యం జరుగుతోందని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. కొండగట్టు భక్తుల సౌకర్యాల కోసం మంజూరైన నిధులను వినియోగించి అభివృద్ధి పనులను వెంటనే చేపట్టాలని డిమాండ్ చేసింది. కొండగట్టు ఆలయంలో 96 గదుల సత్రం, దీక్షా విరమణ మండపం నిర్మాణం కోసం రూ.35.19 కోట్ల తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) నిధులు సిద్ధంగా ఉన్నాయని జనసేన పేర్కొంది. కొండగట్టు ఆలయ అభివృద్ధి పనులకు జనవరి 3వ తేదీన ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ అక్కడ పర్యటించి శంకుస్థాపన చేసిన విషయాన్ని గుర్తుచేసింది. అయితే శంకుస్థాపన పూర్తి అయి నెలలు గడుస్తున్నా నిర్మాణ పనులు ఎందుకు ప్రారంభం కాలేదని జనసేన పార్టీ ప్రశ్నించింది. నిధులు అందుబాటులో ఉన్నప్పుడు టెండర్ ప్రక్రియ ఎందుకు చేపట్టలేదో రేవంత్ రెడ్డి ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని కోరింది.

# ఇంటింటా మొక్కలు.. హరిత వాతావరణంలో భాగస్వాములు

### వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**హైదరాబాద్, ఆగస్టు 27, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రతి ఇంటిలో మొక్కలు పెంచే సంస్కృతిని పొంపొందించుకోవాలని వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ముఖ్యంగా నగర జీవనంలో పెరుగుతున్న ఒత్తిడి, కాలుష్యం నేపథ్యంలో హరిత వాతావరణాన్ని పెంపొందించడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన నర్సరీ మేళానుగురువారం ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ప్రజలకు వివిధ రకాల మొక్కలను ఒకే వేదికపై అందుబాటులోకి తీసుకురావడం ద్వారా ఇంటి స్థాయిలో గార్డెనింగ్‌ను ప్రోత్సహించడానికి ఈ మేళా మంచి అవకాశంగా నిలుస్తుందన్నారు. ఐదు రోజుల పాటు జరగనున్న ఈ మేళాలో 110కి పైగా స్టాల్స్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. దేశవ్యాప్తంగా వివిధ నర్సరీల నుంచి తీసుకొచ్చిన అనేక రకాల మొక్కలను ప్రజలకు అందుబాటులో ఉంచారన్నారు. టెర్రస్ గార్డెనింగ్, వెర్టికల్ గార్డెనింగ్, హైడ్రోపోనిక్ గార్డెనింగ్‌కు అవసరమైన మొక్కలతో పాటు పూల మొక్కలు, మెడిసినల్ ప్లాంట్స్, బోన్సాయి, అలంకరణ మొక్కలు వంటి విభిన్న రకాల మొక్కలు మేళాలో అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు. పశ్చిమ బెంగాల్‌లోని డార్జిలింగ్, కోల్కతాతో పాటు ఢిల్లీ, హర్యానా, గుజరాత్, ముంబయి, బెంగళూరు, పూణే, షిర్డీ, చెన్నై, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ తదితర ప్రాంతాల నుంచి మొక్కలను తీసుకొచ్చినట్లు వెల్లడించారు. నాగాలాండ్ నుంచి వచ్చిన కాక్టస్ వంటి ప్రత్యేక ఆకర్షణ కలిగిన మొక్కలు కూడా మేళాలో



ఉన్నాయని తెలిపారు. సాధారణ ప్రజలకు అందుబాటులో ఉండేలా రూ.20 నుంచి రూ.2.5 లక్షల విలువైన మొక్కల వరకు ఈ మేళాలో లభిస్తున్నాయని చెప్పారు. మొక్కల పెంపకానికి అవసరమైన మెటీరియల్స్, ఆర్గానిక్ ఎరువులు, ఫెర్టిలైజర్లు, టెర్రకోట కుండీలు తదితర సామగ్రి కూడా ఒకే చోట లభించడం మేళా ప్రత్యేకతగా పేర్కొన్నారు. ఈ మేళా ద్వారా ప్రజలకు మొక్కలపై అవగాహన పెరగడంతో పాటు ఇంటి స్థాయిలో గార్డెనింగ్‌ను ప్రోత్సహించడానికి మంచి అవకాశం లభిస్తుందని మంత్రి అన్నారు.

## మళ్లీ పెరిగిన ఉల్లిగడ్డ

### కిలో రూ.60 నుండి రూ.70 వరకూ చేరిన రేటు

**హైదరాబాద్, ఆగస్టు 27, ప్రభాతవార్త:** ఆకాశాన్నంటుతున్న ఉల్లిగడ్డల ధర వినియోగదారులను కన్నీరు పెట్టిస్తోంది. ప్రస్తుతం, తెల్ల ఉల్లిపాయ ధర కిలోకు దాదాపు రూ.100కి చేరగా, ఎర్ర ఉల్లిపాయ కిలో రూ.60 నుంచి రూ.70 కి అమ్ముడవుతోంది. ఇటీవల పెరిగన ఉల్లి మరోసారి పెరిగింది. దీంతో సామాన్య ప్రజలు ఉల్లిపాయలు కొనడానికి ఇబ్బందులు పడుతున్నారు. కేవలం రెండు నెలల క్రితం వరకు, వ్యాపారులు వాహనాలపై 6 కిలోల ఎర్ర ఉల్లిపాయలను రూ.100కు అమ్మేవారు. కిలో రూ.20గా ఉన్న ఎర్ర ఉల్లిపాయల ధర అకస్మాత్తుగా విపరీతంగా పెరగడంతో వినియోగదారులు బెంబేలెత్తుతున్నారు. ధరలను చూసి గృహిణులు, వ్యాపారులు మరియు హోటళ్లు ఆందోళన వ్యక్తం చేస్తూ, ఇప్పటికే ఉల్లిపాయల వాడకాన్ని తగ్గించారు.

## పాత ఆటోలను ఎలక్ట్రిక్ వెహికల్స్‌గా మార్పు

# ఎలక్ట్రిక్ ఆటోలకు రూ.లక్షన్నర సబ్సిడీ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,ఆగస్టు27:** ఆటో రిక్షావాల వారికి రాష్ట్ర ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. రాష్ట్రాన్ని కాలుష్య రహితంగా మార్చేందుకు రవాణా రంగంలో కాంగ్రెస్ ప్రభుత్వం విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా హైదరాబాద్ కోర్ అర్బన్ పరిధిలో వాయు, శబ్ద కాలుష్యాలను తగ్గించడంతో పాటు ఆటో డ్రైవర్లపై ఇంధన భారాన్ని తగ్గించడమే లక్ష్యంగా తెలంగాణ ఆటోరిక్షా ఎలక్ట్రిక్ కన్వర్షన్ స్కీమ్ 2026ను ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. ఈ మేరకు తాజాగా ప్రభుత్వం జీవో జారీ చేసింది. ఈ పథకం ద్వారా తొలి విడతలో భాగంగా 18,766 పెట్రోల్, డీజిల్ ఆటోలను ఎలక్ట్రిక్ వాహనాలుగా మార్చాలని నిర్ణయించింది. ఈ ప్రక్రియ కోసం ప్రభుత్వం రూ.200 కోట్ల భారీ బడ్జెట్‌ను కేటాయించింది. హైదరాబాద్‌లోని కోర్ అర్బన్ రీజియన్ పరిధిలోని(ఓఆర్ఆర్ లోపు) పాత పెట్రోల్, డీజిల్ ఆటో డ్రైవర్లకు ఈ పథకం వర్తిస్తుంది. దీని ద్వారా డ్రైవర్ల కోసం రెండు ప్రధాన ఆప్షన్లను అధికారులు అందుబాటులోకి తెచ్చారు.

మొదటి ఆప్షన్ కింద ఉన్న పాత ఆటో ఇనుప చట్రం(ఫ్రేమ్)ను అలాగే ఉంచి, పెట్రోల్ లేదా డీజిల్ ఇంజిన్ స్థానంలో ఏఐఎస్ 123 ప్రమాణాలు కలిగిన ఎలక్ట్రిక్ కిట్‌ను (ఫిక్స్‌డ్ లేదా స్వాపింగ్ బ్యాటరీతో) అమర్చుకోవచ్చు. రెండవ ఆప్షన్ కింద పాత ఆటోను స్క్రాప్ చేసి, కొత్త ఎలక్ట్రిక్ ఆటోను కొనుగోలు చేయవచ్చు. ఈ ప్రక్రియ మొత్తాన్ని 16 వారాల ప్రణాళికతో ఆన్‌లైన్ ద్వారా పూర్తి పారదర్శకంగా అమలు చేయనున్నారు. ఇలా కొత్త ఈవీ ఆటోలను కొనుగోలు చేసే డ్రైవర్లకు ప్రభుత్వం రూ.1.5 లక్షల వరకు సబ్సిడీని అందజేయనుంది. ఈ పథకం అమల్లోకి వస్తే ఆటో డ్రైవర్లకు ఇంధన ఖర్చులు పూర్తిగా తగ్గి ఆర్థికంగా భారీ లబ్ది చేకూరనుంది. అలాగే, నగరంలో కాలుష్యం గణనీయంగా తగ్గే అవకాశం ఉంది. త్వరలోనే ఈ ప్రక్రియ అధికారికంగా ప్రారంభం కానుంది.

## బిఆర్ఎస్ హస్తగతానికి హరీశ్‌రావు కుట్ర: కల్వకుంట్ల కవిత

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,ఆగస్టు27:** బిఆర్ఎస్‌ను హస్తగతం చేసుకునేందుకు ఆ పార్టీ నేత హరీశ్‌రావు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత తీవ్ర ఆరోపణలు చేశారు. ఇందుకోసం తెరవెనుక కుట్రలు చేస్తున్నాడని విమర్శించారు. ఇటీవలే మెదక్ జిల్లా ఎంఎల్ఎలతో హరీష్ రహస్య మంతనాలు నిర్వహించారని, ఆ సమావేశంలో ఉన్న ఒకరు తనకు ఈ విషయాలు చెప్పారని అన్నారు. కెసిఆర్ వారసత్వం కెటిఆర్‌కు రావద్దని ఆ సమావేశంలో మాట్లాడారని చెప్పారు. బిఆర్ఎస్‌ను హస్తగతం చేసుకునేందుకు సిఎం



రేవంత్‌రెడ్డితో, బిజెపితో దోస్తానా చేస్తున్నారని ఆరోపించారు. బిజెపితో హరీష్ రావు దోస్తీకి సంబంధించి తన వద్ద ఆధారాలున్నాయన్నారు. ఇప్పుడు తాను బిఆర్ఎస్‌లో లేను అని, ఆ పార్టీ ఎటు పోయినా తనకు సంబంధం లేదని అన్నారు. కానీ హరీష్‌రావు గురించి ప్రజలకు తెలియాలనే ఈ విషయం బయటకు చెబుతున్నానన్నారు.తెలంగాణ రక్షణ సేన కార్యాలయంలో గురువారం ఆమె మీడియాతో మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆంధ్రావాళ్ల చేతిలో బందీ అయ్యారని మండిపడ్డారు. బ్రహ్మణ పరిషత్‌కు ఛైర్మన్, వైస్ ఛైర్మన్‌ను ఆంధ్రావాళ్లను నియమించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బ్రహ్మణ పరిషత్ ఛైర్మన్‌గా ఉన్న బసవరాజు శ్రీనివాస రాజు అనే వ్యక్తి పచ్చి తెలంగాణ వ్యతిరేకి అని, తెలంగాణను ఉద్యమ సమయంలో రాష్ట్ర ఏర్పాటును వ్యతిరేకించిన వ్యక్తికి ఆ పదవి ఎలా ఇస్తారని ప్రశ్నించారు. తెలంగాణ బ్రహ్మణులలో అర్హులు లేరా..? అని ప్రశ్నించారు..యాదగిరి గుట్ట బోర్డు మెంబర్లలో ఆంధ్రా హీరో భార్యకు పదవి కట్టబెట్టారని విమర్శించారు. తెలంగాణ వాళ్ల పైసలతో కట్టిన గుడిలో ఆంధ్రావాళ్లకు పెత్తనం ఎలా ఇస్తారన్నారు. జనసేనకు చెందిన ఓ ఎంపీ కుమారుడు 6 కోట్ల కారు వేసుకోని ఒడిశాకు చెందిన 25 ఏళ్ల అమ్మాయిని గుద్ది చంపితే సిఎం పట్టించుకోలేదని పేర్కొన్నారు.

# ట్రాఫిక్ నిర్వహణ, రోడ్డు భద్రతపై సమగ్ర కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలి

### టిజి సేఫ్ తరహాలో టిజి-టిఎంఎఆర్ఎస్ పేరుతో ప్రత్యేక స్వతంత్ర వ్యవస్థ ఏర్పాటు

### సివి ఆనంద్, వికాస్‌రాజ్‌తో కలిసి ప్రభుత్వ ప్రధానకార్యదర్శి సంజయ్‌జాజు సమీక్ష



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,ఆగస్టు27:** హైదరాబాద్ నగరం, ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) పరిధిలో ట్రాఫిక్ రద్దీని నియంత్రించడం, రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు సమగ్ర కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు.


ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు గురువారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ప్రధాన కార్యదర్శి ట్రాఫిక్ నిర్వహణ, రోడ్డు భద్రతపై విస్తృతంగా సమీక్షించారు.

ఈ సందర్భంగా రోడ్డు భద్రత, ట్రాఫిక్ సిగ్నళ్ల నిర్వహణ, ప్రమాదకర ప్రాంతాల గుర్తింపు, అత్యవసర సేవలకు వేగవంతమైన మార్గాల కల్పన తదితర అంశాలపై చర్చించారు. రాష్ట్రంలోని అన్ని ప్రధాన నగరాలు, జిల్లా కేంద్రాలు, మున్సిపాలిటీలు, పట్టణ ప్రాంతాలు, ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలో ట్రాఫిక్ సిగ్నలింగ్ వ్యవస్థను మరింత పటిష్టం చేయాలని సూచించారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు మున్సిపల్, పోలీస్, రవాణా తదితర శాఖలు సమన్వయంతో పనిచేయాలని, ఇందుకు సంబంధించిన డీపీఆర్‌ను వీలైనంత త్వరగా సిద్ధం చేయాలని సీఎస్ ఆదేశించారు. నవంబర్, డిసెంబర్ నాటికి అవసరమైన ప్రాంతాల్లో సిగ్నలింగ్ వ్యవస్థలను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. నార్కోటిక్ బ్యూరో, టిజి-సేఫ్(ఎస్ఏఎఫ్ఇ) తరహాలో ట్రాఫిక్ నిర్వహణ, రోడ్డు భద్రత కోసం టిజి-టిఎంఏఆర్ఎస్(ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ అండ్ రోడ్ సేఫ్టీ) పేరుతో ప్రత్యేక, స్వతంత్ర వ్యవస్థను ఏర్పాటు చేసేందుకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. సిగ్నలింగ్ వ్యవస్థను ఆధునీకరించడంతో పాటు ఎలక్ట్రానిక్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌ను మరింత పటిష్టం చేయాలని, గౌరవ సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా రోడ్డు భద్రతా చర్యలు చేపట్టాలని సీఎస్ ఆదేశించారు. ఫుట్‌పాత్‌ల ఆక్రమణలను నిరోధించేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. జీహెచ్ఎంసీ పరిధిలో ప్రస్తుతం 429 ట్రాఫిక్ సిగ్నలింగ్ వ్యవస్థలు ఉన్నాయని, వీటిలో అధునాతన సిగ్నల్ నియంత్రణ వ్యవస్థలను వినియోగిస్తున్నట్లు అధికారులు సీఎస్‌కు వివరించారు. ట్రాఫిక్ నిర్వహణ, రోడ్డు భద్రత ఒకే శాఖకు పరిమితమైన అంశాలు కావని, పోలీస్, రవాణా, రోడ్లుభవనాలు, మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి తదితర శాఖలు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని సీఎస్ పేర్కొన్నారు. ప్రతి ప్రాంతానికి సంబంధించిన ట్రాఫిక్ డేటాను సమీకరించి, ఒకే వేదికపై విశ్లేషించేందుకు ఇంటిగ్రేటెడ్ ట్రాఫిక్ డేటా ప్లాట్‌ఫామ్ ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో ట్రాఫిక్ నిర్వహణను మరింత సమర్థవంతంగా, సురక్షితంగా మార్చేందుకు కృత్రిమ మేధస్సు (ఏఐ) ఆధారిత సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతంగా వినియోగించేందుకు సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని సీఎస్ సూచించారు. సాంకేతిక పరిజ్ఞానం వినియోగం కేవలం ట్రాఫిక్ ఉల్లంఘనలను గుర్తించడానికే పరిమితం కాకుండా, ప్రజలకు సురక్షితమైన, వేగవంతమైన, సౌకర్యవంతమైన ప్రయాణాన్ని అందించేలా ఉండాలని స్పష్టం చేశారు. ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కా రాలను గుర్తించేందుకు డేటా ఆధారిత, సాంకేతికత ఆధారిత, ప్రజా ప్రయోజనకరమైన విధానాలను రూపొందించాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఏఐ ఆధారిత ట్రాఫిక్ నిర్వహణ, రోడ్డు భద్ర తకు సంబంధించి అందుబాటులో ఉన్న ఆధునిక సాం కేతిక పరిజ్ఞానాన్ని అధ్యయనం చేసి, అవసరమైన ప్రాం తాల్లో పైలట్ ప్రాజెక్టులను చేపట్టాలని సూచించారు. పైలట్ ప్రాజెక్టుల ఫలితాల ఆధారంగా వాటిని దశల వారీగా రాష్ట్రవ్యాప్తంగా విస్తరించేందుకు చర్యలు తీసు కోవాలని సమావేశంలో నిర్ణయించారు. సమా వేశంలో డిజిపి సి.వి.ఆనంద్, రవాణా, రోడ్లుభవనాల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్‌రాజ్, రవాణా శాఖ కమి షనర్ ఇలంబర్తి, మల్కాజిగిరి మున్సిపల్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి, హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ వి.సి.సజ్జనార్ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మున్సిపల్ రేసులో జనసేన, బిజెపి!

- తిరుపతి మేయర్‌పై టిడిపి జనసేన మధ్య పట్టు




**తిరుపతి, ఆగస్టు 27 ప్రభాతవార్త ప్రతినిధి:** ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో పాగా వేయడానికి అధికార కూటమిలోని జనసేన, బిజెపి పార్టీలు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నాయి. జిల్లాల పునర్విభజన జరిగినప్పటికీ స్థానిక రాజకీయ సమీకరణాలను దృష్టిలో ఉంచుకుని ఉమ్మడి చిత్తూరు జిల్లాను ఒక రాజకీయ యూనిట్‌గా పరిగణిస్తూ మున్సిపల్ ఎన్నికల్లో ఒక్కో పార్టీ ఒక్కో కీలక స్థానంలో పోటీ చేయాలనే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. చిత్తూరు కార్పొరేషన్‌తోపాటు కుప్పం, పలమనేరు, నగరి మున్సిపాలిటీలు ఉన్నాయి. తిరుపతి జిల్లాలో తిరుపతి కార్పొరేషన్, శ్రీకాళహస్తి, పుత్తూరు మున్సిపాలిటీలు ఉన్నాయి. పుంగనూరు, మదనపల్లె అన్నమయ్య జిల్లాలో కలిసిపోయాయి. అయితే ఉమ్మడి జిల్లా రాజకీయ ప్రభావాన్ని పరిగణనలోకి తీసుకుని మిత్రపక్షాలు తమ బలాన్ని పెంచుకునేందుకు స్థానిక సంస్థల ఎన్నికలను అవకాశంగా మలచుకోవాలని భావిస్తున్నారు.

**తిరుపతిపై జనసేన దృష్టి:**
2024 సార్వత్రిక ఎన్నికల్లో అనూహ్యంగా తిరుపతి అసెంబ్లీ స్థానం నుండి జనసేన అభ్యర్థి శ్రీనివాసులు పోటీ చేసి ఎమ్మెల్యేగా కొనసాగుతున్నారు. తిరుపతి లోక్‌సభ స్థానం నుండి బిజెపి అభ్యర్థిగా పోటీ చేసిన వెలగపల్లి వరప్రసాదరావు ఓటమి చెందారు. ఈ నేపథ్యంలో తిరుపతి కార్పొరేషన్ మేయర్ పదవిని జనసేనకు కేటాయించాలని ఎమ్మెల్యే శ్రీనివాసులు పట్టుపడుతున్నట్లు తెలుస్తోంది. పార్టీ అధినేత పవన్ కల్యాణ్ కూడా దీనికి మద్దతు ఇస్తున్న నేపథ్యంలో సిఎం, టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు కూడా సానుకూలంగా స్పందించే అవకాశం ఉందనే ప్రచారం జరుగుతోంది. అయితే జనసేనను ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మరింత విస్తరించాలనే ఉద్దేశంతో ఆ పార్టీ నాయకులు తిరుపతితో బాటు ఇతర కీలక పట్టణాలపైనా దృష్టి సారిస్తున్నారు. చిత్తూరు కార్పొరేషన్ గానీ మదనపల్లె మున్సిపాలిటీ చైర్మన్ పదవుల్లో ఏదో ఒకటి జనసేనకు కేటాయించాలని కోరుతున్నట్లు సమాచారం. చిత్తూరు జనసేన ఆశావహులు చిత్తూరు మేయర్ పదవికి జనసేన నుంచి పలువురి పేర్లు వినిపిస్తున్నాయి. గతంలో పట్టణ టిడిపి అధ్యక్షుడిగా పనిచేసి అనంతరం జనసేనలో చేరిన చందు కుమార్ మేయర్ టికెట్‌ను ఆశిస్తున్నారు. జనసేన పిఎసి సభ్యురాలు, న్యాయవాది ఆరణి కవిత, గంగనపల్లి గోపి, తిరుపతి ఎమ్మెల్యే శ్రీనివాసులు కుమారుడు ఆరణి మదన్, ఆయన అన్న కుమారుడు ఆరణి శివ పేర్లు కూడా పరిశీలనలో ఉన్నట్లు తెలుస్తోంది. వీరే కాకుండా టిడిపి జిల్లా ఉపాధ్యక్షుడిగా, చిత్తూరు మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ఉన్న కాజుర్ బాలాజీకి అవకాశం ఇస్తే సిద్ధంగా ఉన్నారనే సమాచారం కూడా రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

**మదనపల్లెపైనా జనసేన చూపు:**
మదనపల్లెలోనూ జనసేనకు మంచి పట్టు ఉందని భావిస్తున్న ఆ పార్టీ నాయకులు అక్కడి చైర్మన్ పదవిని కేటాయించాలని కోరుతున్నట్లు సమాచారం. జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అడపా సురేంద్ర, సీనియర్ నాయకులు తోట కళ్యాణ్, రాందాస్ చౌదరి తదితరులు టికెట్ ఆశిస్తున్నట్లు తెలుస్తోంది.

**తిరుపతిపై పట్టు వదులుకోని టిడిపి:**
రాజకీయ నేపథ్యంలో తిరుపతి మేయర్ పదవిని వదులుకోవడానికి అధికార టిడిపి నేతలు సిద్ధంగా లేరని సమాచారం. ఈ స్థానాన్ని టిడిపికే కేటాయించాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ గట్టి ప్రయత్నం చేస్తున్నట్లు తెలుస్తోంది. జనసేన, బిజెపిలకు ఉమ్మడి జిల్లాలోని మరో కీలక మున్సిపాలిటీని కేటాయిస్తే తమకు అభ్యంతరం లేదని టిడిపి వర్గాలు భావిస్తున్నట్లు సమాచారం.
మేయర్ పదవి టిడిపికి ఇచ్చి, డిప్యూటీ మేయర్ పదవిలో జనసేన, బిజెపికి అవకాశం కల్పిస్తే మిత్రపక్షాల మధ్య సమన్వయం సాధ్యమవుతుందని టిడిపి నేతలు అభిప్రాయం వ్యక్తంచేస్తున్నారు.

**బిజెపి వ్యూహం ఏమిటో?:**
ఇదిలా ఉంటే తిరుపతి కార్పొరేషన్ మేయర్ పదవి కోసం బిజెపి కూడా పట్టుపట్టే అవకాశం ఉందని పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఈ విషయంగా చర్చించేందుకు బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు పివిఎన్ మాధవ్ శుక్రవారం తిరుపతి వస్తున్నట్లు సమాచారం. తిరుపతిలో తొలి నుండి ఆర్‌ఎస్‌ఎస్, విశ్వహిందూ పరిషత్ కార్యకలాపాలు బలంగా ఉండటం, బిజెపికి సంప్రదాయ ఓటు బ్యాంకు ఉండటంతో మున్సిపల్ ఎన్నికల్లో పార్టీని బరిలోకి దింపాలని అధిష్ఠానం ఆలోచిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్ పేరు కూడా తెరపైకి వస్తుందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. న్యాయవాదిగా పేరున్న ఆయన బలిజ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి కావడం అదనపు అనుకూల అంశంగా ఆ పార్టీ వర్గాలు పరిగణిస్తున్నట్లు సమాచారం. ఇక టిటిడి బోర్డు సభ్యుడు జి.భానుప్రకాశ్‌రెడ్డి కుమారుడు జి.పృథ్వీరెడ్డి పేరు కూడా వినిపిస్తోంది. మొత్తంగా తిరుపతి మేయర్ పదవి టిడిపి-జనసేన మధ్య ప్రధాన చర్చనీయాంశంగా మారగా బిజెపి కూడా మేయర్, శ్రీకాళహస్తి చైర్మన్ పదవిపై ఆసక్తి చూపుతున్నట్లు తెలుస్తోంది. చిత్తూరు కార్పొరేషన్, మదనపల్లె మున్సిపాలిటీ వంటి కీలక స్థానాల్లో జనసేనకు అవకాశం కల్పించే అంశం కూడా చర్చకు వస్తోంది. మున్సిపల్ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడే నాటికి టిడిపి, జనసేన, బిజెపి మధ్య జరిగే సీట్ల సర్దుబాటుపైనే ఈ ఆశావహుల భవితవ్యం ఆధారపడి ఉండనుంది. తిరుపతి మేయర్ పీఠం ఎవరికి దక్కుతుందన్న అంశం కూటమి రాజకీయాల్లో ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

## గిరిజన విద్యార్థులకు నీట్ , ఐఐటి.జెఇఇ శిక్షణ కోసం సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్

**విజయవాడ,ఆగస్టు 27,ప్రభాతవార్త:** గిరిజన విద్యార్థులలో విద్యా ప్రమాణాలను మరింత మెరుగుపరిచి, జాతీయ స్థాయి ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థల్లో వారి ప్రాతినిధ్యాన్ని పెంపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ను అందుబాటులోకి తీసుకొచ్చిందని ఆంధ్రప్రదేశ్ గిరిజన గురుకుల విద్యాలయాల సంస్థ కార్యదర్శి ఒక ప్రకటనలో తెలిపారు. విశాఖపట్నం జిల్లా మారికవలసలోని రెసిడెన్షియల్ స్కూల్ ప్రాంగణంలో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశామని, జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షలైన వినినిగి, ။గిరినిని లకు సన్నద్ధమయ్యే గిరిజన విద్యార్థులకు ఇక్కడ నాణ్యమైన రెసిడెన్షియల్ కోచింగ్ అందిస్తున్నామని వివరించారు. ప్రతిభావంతులైన గిరిజన విద్యార్థులను దేశంలోని ఐఐటీలు, నిట్లు , ఎయిమ్స్ , ప్రధాన వైద్య కళాశాలలు మరియు ఇతర జాతీయ ప్రాధాన్యత కలిగిన ఉన్నత విద్యాసంస్థల్లో ప్రవేశాలకు సిద్ధం చేయడమే ఈ కార్యక్రమం యొక్క ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఈ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ లో ఇంటర్మీడియట్ విద్యనభ్యసించేందుకు ప్రభుత్వం ప్రతిభ ఆధారంగా మొత్తం 600 మంది విద్యార్థులను ఎంపిక చేసిందని, ఇందులో లింగ సమానత్వానికి ప్రాధాన్యతనిస్తూ 300 మంది బాలురు, 300 మంది బాలికలకు సమాన ప్రాతినిధ్యంతో ప్రవేశాలు కల్పించినట్లు పేర్కొన్నారు.విద్యార్థులకు నాణ్యమైన ఉచిత కోచింగ్‌తో పాటు వసతి, ఆహారం, పౌష్టికాహార డైట్ మరియు ఇతర పరిపాలనా అవసరాలకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను ప్రభుత్వం చేపట్టిందని, వారు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చదువుకునేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కేంద్రానికి అవసరమైన మౌలిక సదుపాయాలు, ఫర్నిచర్, ఐసీటీ పరికరాలు మరియు మానవ వనరుల కల్పన కోసం ప్రభుత్వం ప్రత్యేక నిధులను ప్రాతిపదికన మంజూరు చేసిందని వివరించారు. విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలను అందుబాటులోకి తీసుకురావడానికి సంబంధిత శాఖల సమన్వయంతో పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయని చెప్పారు. రాష్ట్రంలోని గిరిజన విద్యార్థుల విద్యా పురోగతికి ఈ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఒక కీలక ముందడుగుగా నిలవడంతో పాటు, భవిష్యత్తులో గిరిజన బిడ్డలను ఉన్నత విద్య మరియు ఉపాధి అవకాశాల్లో ముందుకు నడిపిస్తూ, దేశంలోని ప్రముఖ విద్యాసంస్థల్లో ప్రవేశాలకు సన్నద్ధం చేసే ఒక ఉత్తమ మోడల్ సంస్థగా అభివృద్ధి చెందనుందని స్పష్టం చేశారు.

# రికార్డుస్థాయిలో అమరావతి ఛాంపియన్‌షిప్

- 2.07 లక్షల మంది క్రీడాకారుల భాగస్వామ్యం
- 29న విజేతలకు బహుమతి ప్రధానం

**తిరుపతి,తిరుపతి (క్రీడ), ఆగస్టు 27 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం రెండేళ్ళపాలన పూర్తిచేసుకున్న సందర్భంగా తిరుపతి నగరంలో నాలుగురోజులు నిర్వహించిన అమరావతి ఛాంపియన్ షిప్ పోటీలు రికార్డుస్థాయిలో జరిగాయి. ఈ పోటీలకు రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుండి 2.07లక్షల మంది క్రీడాకారులు పాల్గొని తమ ప్రతిభను కనబరిచారు. ఈ ఛాంపియన్‌షిఫ్ పోటీల్లో విజేతలైన క్రీడా జట్లకు శనివారం(29న) తిరుపతిలో బహుమతులు, మెమొంటోలు ప్రదానం చేయనున్నారు. నాలుగు రోజులపాటు తిరుపతి కేంద్రంగా జరిగిన అమరావతి ఛాంపియన్‌షిప్ పోటీలు గురువారం సాయంత్రం ముగిశాయి. 29 క్రీడ ప్రాంగణాల్లో 1200 క్రీడలు నిర్వహించారు. ఈ సందర్భంగా శాప్స్ చైర్మన్ అమినేని రవినాయుడు మీడియాతో మాట్లాడుతూ, అమరావతి ఛాంపియన్‌షిప్ 2.0కు రాష్ట్రవ్యాప్తంగా విశేష స్పందన లభించిందని, చరిత్రలోనే ఎన్నడూ లేని విధంగా ఈ క్రీడా వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించామన్నారు. అమరావతి ఛాంపియన్‌షిప్ 2.0లో రాష్ట్రవ్యాప్తంగా 2 లక్షల 7 వేల మంది క్రీడాకారులు భాగస్వామ్యం కాగా, జిల్లాస్థాయి పోటీల్లో 84 వేల మంది ,రాష్ట్రస్థాయి 10 పదివేల మంది క్రీడాకారులు ప్రత్యక్షంగా పాల్గొని తమ ప్రతిభను చాటారని తెలిపారు. భారీ సంఖ్యలో క్రీడాకారులు పాల్గొన్న ఈ క్రీడా పోటీలు ఏషియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో నమోదవడం గర్వకారణమన్నారు. ఇది శాప్ చరిత్రలోనే ఒక ముఖ్యమైన మైలురాయి అని పేర్కొన్నారు. -29 క్రీడా ప్రాంగణాల్లో 1,200 మ్యాచ్‌లు: ఆగస్టు 24 నుండి ప్రారంభమైన రాష్ట్రస్థాయి పోటీలను 29 క్రీడా ప్రాంగణాల్లో, రెండు కేటగిరీల్లో అండర్ 17, అండర్ 23 కేటగిరీలలో 12 క్రీడల్లో (కబడ్డీ, వాలీబాల్, ఖో ఖో, హాకీ, బాడ్మింటన్, యోగ, ఆర్చరీ, బాస్కెట్‌బాల్, చెస్, వెయిట్ లిఫ్టింగ్ బాక్సింగ్) నిర్వహించినట్లు చైర్మన్ తెలిపారు. మొత్తం 1,200 మ్యాచ్‌లను విజయవంతంగా నిర్వహించామని వెల్లడించారు. అమరావతి ఛాంపియన్‌షిప్ ద్వారా రాష్ట్రంలో క్రీడా వాతావరణం మరింత బలోపేతమైందని, ఆంధ్రప్రదేశ్‌ను 'క్రీడాంధ్రప్రదేశ్‌'గా తీర్చిదిద్దే దిశగా ఇది కీలక ముందడుగు అని రవి నాయుడు అన్నారు. శాప్ బోర్డు సభ్యురాలు డబుల్ ఒలింపియన్ ఇ.రజని పాల్గొన్నారు.




# సర్వీస్ ఈనామ్ భూములపై నిషేధం ఎత్తివేయాలి

- అమరావతికి ఇచ్చిన మినహాయింపులు మాకూ ఇవ్వాలి
- లక్ష ఎకరాల భూమి... కోటి మంది భూబాధితుల గోడు పట్టించుకోరా

**జగ్గయ్యపేట, ఆగస్టు 27, ప్రభాతవార్త :** రైత్వారి పట్టాలిచ్చి సర్వీస్ ఈనామ్ దారులకు సర్వహక్కులు కల్పించిన ప్రభుత్వం రెండు నాల్కల ధోరణితో వ్యవహరించటం అన్యాయమని, నేడు ఈ ఈనామ్ భూములను అమ్ముకుంటే చెల్లదని ప్రభుత్వం నిర్దేశించటం దారుణమని సర్వీస్ ఈనామ్ భూబాధితుల సంఘ ప్రతినిధులు ఆవేదన వ్యక్తంచేశారు. ఎన్‌టిఆర్ జిల్లా జగ్గయ్యపేట పట్టణంలోని జెఆర్‌సి కళాశాల సమావేశ మందిరంలో గురువారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో సంఘ ప్రతినిధులు రంగాపురం నరసింహారావు, గింజుపల్లి రమేష్, గద్దె సుధీర్, సిహెచ్ ప్రసాద్, కళ్యాణం మురళి, అచ్యుతరామయ్య మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా లక్ష ఎకరాల భూమి... కోటి మంది భూ బాధితుల గోడును కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం చేయతగదన్నారు. సార్వత్రిక ఎన్నికలకు ముందు నేటి సిఎం చంద్రబాబునాయుడు ఈనామ్ భూములపై గల నిషేధాన్ని తాము అధికారంలోకి వచ్చిన తర్వాత తొలగిస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. 1956లో రైత్వారి పట్టాలిచ్చి సర్వీస్ ఈనామ్ దారులకు సర్వహక్కులను ప్రభుత్వం ఇచ్చిందని చెప్పారు. 2013లో ఉమ్మడి రాష్ట్రంలో సిఎంగా కిరణ్‌కుమార్‌రెడ్డి చేసిన అనాలోచిత నిర్ణయం వలన కోట్లాదిమంది బాధితులుగా మారిపోయి రోడ్డున పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఈనామ్ భూములపై నిషేధం ఎత్తివేసేందుకు ఆర్డినెన్స్‌ను తీసుకువచ్చిన చంద్రబాబు ప్రభుత్వం 2024లో అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ విషయాన్ని మర్చిపోవటం శోచనీయమన్నారు. ఈనామ్ భూముల దేవాదాయశాఖ పరిధిలోకి రావని దేవాలయాల్లో పనిచేసే సేవకులు, పరిచారకులకు సంస్థానాధీశులు, జమిందారీలు, రాజులు బహుమతిగా ఇచ్చినవేనన్నారు. అధికారులు ఈ భూములను దేవాలయ భూములుగా ప్రభుత్వాన్ని తప్పుదోవ పట్టిస్తున్నారని తేటతెల్లంచేశారు. ఈసమస్యను ఎందుకు పరిష్కరించటంలేదని ప్రశ్నించారు. ప్రభుత్వం పట్టించుకోకుంటే దశలవారీగా ఆందోళనలు చేపడతామని విజయవాడ దర్నాచౌక్‌లో ఆందోళనకు సిద్ధమవుతున్నామని సంఘ నేతలు




మీడియాతో మాట్లాడుతున్న సర్వీస్ ఈనామ్ భూబాధితుల సంఘ ప్రతినిధి రంగాపురం నరసింహారావు.

# తిరుమల సమాచారం

## భక్తులతో కిటకిటలాడుతున్న తిరుమల




**తిరుమల,ఆగస్టు 27ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమలలో భక్తులరద్దీ అనూహ్యంగా పెరగడంతో కిటకిటలాడుతోంది. వైకుంఠమ్ క్యూకాంప్లెక్స్ కంపార్టుమెంట్లు భక్తులతో నిండిపోయాయి. గురువారం ఉదయానికి ఆలయం వెలుపల మూడుకిలోమీటర్ల దూరం శిలాతోరణం వరకు భక్తులు క్యూలైన్లలో బారులు తీరారు. ఈ రద్దీ కారణంగా ఎలాంటి దర్శన టిక్కెట్లు, టైమ్ స్లాట్ టోకెన్లు లేని సాధారణ భక్తులకు శ్రీవారి సర్వదర్శనం కోసం దాదాపు 24 గంటల సమయం పడుతోంది. గంటల తరబడి క్యూలైన్లలో వేచి ఉండే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా టిటిడి సిబ్బంది నిరంతరం తాగునీరు, పాలు, అన్నప్రసాదాలను పంపిణీ చేస్తున్నారు. బుధవారం రాత్రి వరకు 77,568 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. కానుకల ద్వారా శ్రీవారి హుండీ ఆదాయం 4.19 కోట్లు లభించింది. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని దర్శనం సులభంగా జరిగేలా టిటిడి విస్తృత ఏర్పాట్లు చేపట్టింది. దర్శనానంతరం లడ్డూలకోసం భక్తులు ఇబ్బందులు తప్పడంలేదు.

## శ్రీవారి ఆశీస్సులందరిపై ఉండాలి



**తిరుమల,ఆగస్టు 27ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగప్రత్యక్షదైవం తిరుమల శ్రీవారి ఆశీస్సులు అందరిపై ఉండాలని పలువురు ప్రముఖులు ఆకాంక్షించారు. గురువారం ఉదయం విఐపి బ్రేక్‌లో హై కోర్ట్ న్యాయమూర్తి జస్టిస్ ఆలపాటి గిరిధర్, కేరళ హై కోర్ట్ ప్రధాన న్యాయమూర్తి సౌమన్ సేన్, పద్మశ్రీ డ్రమ్స్ శివమణి, సినీ నటుడు సప్తగిరి, నంద కిషోర్ రెడ్డి ( ఆస్ట్రాలజీ) ఆలయంలోనికి చేరుకున్నారు. ఆలయ అధికారులు స్వామివారి దర్శనం చేయించి తీర్థప్రసాదాలు అందజేశారు.



## నేడు పౌర్ణమి గరుడసేవ

**తిరుమల,ఆగస్టు 27ప్రభాతవార్తప్రతినిధి:** పవిత్రమైన శ్రావణపౌర్ణమి పురస్కరించుకుని తిరుమలలో నేటి రాత్రి శ్రీమలయప్పస్వామి గరుడ వాహనాన్ని అధిరోహించి భక్తులకు సాయంత్రం నిత్యకైంకర్యాలు ముగించుకుని మలయప్ప స్వామి గరుడునిపై మాఢవీధుల్లో ఊరేగనున్నారు.

# పేదరోగులకు మరింత మెరుగైన వైద్యసేవలు

## స్విమ్స్ సంచాలకులు ఉపకులపతి డాక్టర్ జగదీష్

**తిరుపతిత్రిరుపతిహెల్త్,ఆగస్టు 27ప్రభాతవార్తప్రతినిధి:** పేదరోగులకు మరింత మెరుగైన వైద్యసేవలందించడమే లక్ష్యంగా పనితీరు సాగిస్తానని వెంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ (స్విమ్స్) సంచాలకులు, ఉపకులపతి(ఎఫ్ఏసి) డాక్టర్ జి.జగదీష్ తెలిపారు. గురువారం ఉదయం పాత డైరెక్టర్ కార్యాలయంలో ఇన్‌చార్జ్ డైరెక్టర్ డాక్టర్ అలోక్ సచన్ నుండి బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ సాధనలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా ఏజెన్సీ ప్రాంతాలు, గ్రామీణ ప్రాంతాల్లో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించి పేదలకు సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందుబాటులోకి తీసుకెళ్తామని తెలిపారు. స్విమ్స్ డాక్టర్ల బృందంతో సమన్వయం చేసుకుని పేద రోగులకు మరింత మెరుగైన వైద్యసేవలు అందించడమే లక్ష్యంగా కృషి చేస్తానని తెలిపారు. శ్రీవారి ఆశీస్సులతో బర్డ్ హాస్పిటల్‌తో బాటు స్విమ్స్ ఆస్పత్రిని రాష్ట్రంలోనే ప్రముఖ ఆసుపత్రిగా తీర్చిదిద్ది ఎలాంటి వ్యాధులనైనా నయం చేసేలా ప్రజల్లో నమ్మకాన్ని పెంచుతామన్నారు. తిరుపతికి 50 కిలోమీటర్ల పరిధిలో ఎలాంటి ప్రమాదాలు జరిగినా అంబులెన్సుల ద్వారా స్విమ్స్‌కు తీసుకొచ్చి తక్షణం అత్యవసర చికిత్స అందేలా చర్యలు తీసుకుంటామని వివరించారు. మరో ఆరు నెలల్లో పద్మావతి చిన్నపిల్లల హృదయాలయ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి అందుబాటులోకి రానుందని, ఈ భవనం పై అంతస్థులో ఎయిర్ అంబులెన్సు సౌకర్యం వుంటుందని చెప్పారు. స్విమ్స్‌లో అత్యవసరసేవల విభాగాన్ని మరింత విస్తరింపజేస్తామని, రక్తనిది సేవలను మరింత విస్తృతం చేస్తామని వెల్లడించారు. తనకు ఈ అవకాశం కల్పించిన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి, టి.టి.డి. చైర్మన్ బి.ఆర్.నాయుడుకి, ఇఒ ముద్దాడ రవిచంద్రకి కృతజ్ఞతలు తెలియజేశారు. అంతకుముందు ఆయన స్విమ్స్ లోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి పుష్పాంజలి ఘటించారు. వేంకటేశ్వర స్వామి, పద్మావతి అమ్మవారి విగ్రహాల వద్ద పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేదపండితులు వేదాశీర్వచనం చేశారు.



# సంస్కృత భాషా వైభవాన్ని చాటిన శోభాయాత్ర


- సంస్కృత వర్శిటీలో ఘనంగా సంస్కృత వారోత్సవాల ప్రారంభం



**తిరుపతి విద్య, ఆగస్టు 27 ప్రభాతవార్త:** సంస్కృత భాష గొప్పతనాన్ని, భారతీయ సంస్కృతి వైభవాన్ని చాటుతూ తిరుపతిలోని జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో సంస్కృత వారోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. వారం రోజుల పాటు నిర్వహించనున్న సంస్కృత సప్తాహ మహోత్సవంలో భాగంగా గురువారం విశ్వవిద్యాలయ ప్రాంగణంలో సంస్కృత శోభాయాత్ర నిర్వహించారు. విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్న శోభాయాత్రలో సంస్కృత భాష ప్రాశస్త్యాన్ని వివరించే ప్లకార్డులు, నినాదాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ప్రొఫెసర్ ఎస్. దక్షిణామూర్తి శర్మ నేతృత్వంలో నిర్వహించిన శోభాయాత్రకు డాక్టర్ ఎస్.ఎల్. సీతారామ శర్మ, డాక్టర్ నందన రావు, డాక్టర్ వి. శ్రీనివాసరావు సమన్వయం చేశారు. అకడమిక్ వ్యవహారాల డీన్ ప్రొ. రజనీకాంత్ శుక్లా, విద్యార్థుల సంక్షేమ విభాగం డీన్ ప్రొ. ఎస్. దక్షిణామూర్తి, ప్రొ. వి. విష్ణుభట్టాచార్యులు, ప్రొ. కృష్ణేశ్వర్ ఝా, ప్రొ. రాధాగోవింద త్రిపాఠి, ప్రొ. కె.సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. అనంతరం వాగ్వర్ధిని పరిషత్ ఆధ్వర్యంలో చెలికాని అన్నారావు అకడమిక్ బ్లాక్ ఆడిటోరియంలో ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించారు. వేద విద్యార్థుల మంగళాచరణ పఠనం, జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమం ప్రారంభమైంది. అనంతరం జాతీయ గీతం, వందేమాతరం ఆలపించారు. కన్వీనర్ ప్రొ. సోమనాథ్ దాష్ స్వాగతోపన్యాసంచేశారు. అకడమిక్ వ్యవహారాల డీన్ ప్రొ. రజనీకాంత్ శుక్లా అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సంస్కృత భాషకు ఉన్న శాశ్వత ప్రాధాన్యాన్ని వివరించారు. సంస్కృతంలో నిక్షిప్తమైన శాస్త్రీయ దృక్పథం, విశాలమైన విజ్ఞానం ఆధునిక విద్యా రంగానికి ఎంతో కీలకమని పేర్కొన్నారు. రిజిస్ట్రార్ కడియం వెంకట నారాయణ రావు మాట్లాడుతూ భారతీయ భాషా వారసత్వాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. యువతలో సంస్కృత భాషపై ఆసక్తిని పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని తెలిపారు. అతిథులుగా ప్రొఫెసర్ ఎస్. దక్షిణామూర్తి శర్మ, ప్రొఫెసర్ పి. వెంకట రావు, ప్రొఫెసర్ కె. గణపతి భట్ పాల్గొని సంస్కృత భాష, సాహిత్యం, విద్య తదితర అంశాలపై ప్రసంగించారు. అతిథుల సన్మానం, సహ కన్వీనర్ డాక్టర్ కృష్ణ కుమార్ భార్గవ్ వందన సమర్పణ, శాంతి మంత్ర పఠనంతో ప్రారంభోత్సవ కార్యక్రమం ముగిసింది. డాక్టర్ నాగరాజ భట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. వారం రోజుల పాటు జరిగే సంస్కృత వారోత్సవాల్లో భాగంగా వ్యాసరచన, సంస్కృత గానం, ఉపన్యాసం తదితర సాహిత్య

# దుర్గమ్మ ఆలయంలో వేదోక్తంగా పవిత్రోత్సవాలు

**ఇంద్రకీలాద్రి, ఆగస్టు 27, ప్రభాతవార్త :** దుర్గమ్మవారి ఆలయంలో గురువారం పవిత్రోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఇఒ వికె శీనా నాయక్, చైర్మన్ బొర్రా రాధాకృష్ణలు పవిత్రాలను సమర్పించారు. గురువారం మొదటి రోజు తెల్లవారుజామున అమ్మవారికి స్నపనాభిషేకం, పవిత్ర మాలాధారణ నిర్వహించారు. ఉదయం 8 గంటల తర్వాత భక్తులకు అమ్మవారి దర్శనం కల్పించారు. వివిధ వైదిక హోమాలు, జపాలు,మూల మంత్ర హవనములు తదితర కార్యక్రమాలు దేవస్థానంలో నిర్వహించారు. దేవస్థానం మహామండపంలో సమావేశమందిరం దుర్గమ్మవారి ఆలయంలోని శ్రీ మల్లిఖార్జున మహామండపంలో 4వ అంతస్తులో నూతనంగా ఏర్పాటు చేసిన సమావేశ మందిరాన్ని గురువారం మంగళ వాయిధ్యాలు, వేద మంత్రాల నడుమ ఇఒ వికె శీనా నాయక్, చైర్మన్ బొర్రా రాధాకృష్ణ ప్రారంభించారు. పూజా కార్యక్రమం అనంతరం సిబ్బందితో చైర్మన్, ఈవో మాట్లాడుతూ దేవస్థానంలో సమావేశ మందిరం ప్రాముఖ్యత అవసరం గుర్తించి ఏర్పాటు చేసామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉప ప్రధాన అర్చకులు శంకర శాండిల్య, ట్రస్ట్ బోర్డు సభ్యులు పి.రాఘవరాజు, ఏ.శ్రీనివాసరావు, ఎస్.సరిత, ఎం.కళావతి, దేవస్థానం ఇంజినీరింగ్, పరిపాలన అధికారులు పాల్గొన్నారు.



## మంత్రాలయం రాఘవేంద్రస్వామికి టిటిడిశేషవస్త్రం



**తిరుమల,ఆగస్టు 27ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లో కర్నూలు జిల్లా మంత్రాలయం గురురాఘవేంద్ర స్వామికి టిటిడి పట్టువస్త్రాలు సమర్పించింది. రాఘవేంద్రస్వామి 355వ ఆరాధన మహోత్సవాల సందర్భంగా టిటిడి తరపున ఇఒ ముద్దాడ రవిచంద్ర గురువారం శేషవస్త్రం సమర్పించారు. హైందవ సనాతన ధర్మవ్యాప్తికి కృషి చేసిన సద్గురువుల భగవత్ భాగవత సేవల దృష్ట్యా 2006వ సంవత్సరం నుండి రాఘవేంద్రస్వామికి శ్రీవారి శేషవస్త్రాన్ని టిటిడి అందిస్తోంది. ముందుగా మంత్రాలయంలోని రాఘవేంద్రస్వామి మఠాధిపతి సుబుదేంద్రతీర్థ స్వామికి ఇఒ ముద్దాడ రవిచంద్ర శేషవస్త్రాలను అందజేశారు. అనంతరం సుముదేంద్రతీర్థస్వామి తీర్థప్రసాదాలు అందించారు.

## అన్నవరం పుణ్యక్షేత్రంలో మందుబాబుల వీరంగం

**అన్నవరం, ఆగస్టు 27, (ప్రభాతవార్త):** అన్నవరం సత్యనారాయణస్వామి కొండపై మందుబాబులు గురువారం తెల్లవారుజామున వీరంగం సృష్టించారు. మద్యం మత్తులో ఉన్న వ్యక్తులు ఉచిత కళ్యాణ మండపాల వద్ద ఎదురుగా వస్తున్న కారు డ్రైవర్ తో గొడవకు దిగారు. దూషణలతో రెచ్చిపోవడంతో కొండపై తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. కొండపై జరుగుతున్న వివాహాలకి వచ్చిన సందర్భంగా కొంతమంది ఎలాంటి ఘటనాలకి పాల్పడి ఉండవచ్చని ఆలయ అధికారులు తెలిపారు. అర్ధరాత్రి జరిగిన సంఘటనతో భక్తులు భయాందోళన చెందారు. పుణ్యక్షేత్రంలో భద్రతాచర్యలు పూర్తిగా కొరవడ్డాయని భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మద్యం తాగిన వారిని టోల్ గేట్ వద్ద ఎలా అనుమతించారని, తనిఖీలు సక్రమంగా చేయకపోవడం వల్లే తరచూ ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయని భక్తులు ఆరోపిస్తున్నారు. రత్నగిరిపై మద్య నిషేధం ఉన్నప్పటికీ కొంత మంది యథేచ్ఛగా మద్యం సేవించి వాహనాలతో హంగామా చేయడం పరిపాటిగా మారిందని దేవస్థానం అధికారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విషయం తెలుసుకున్న తొండంగి పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని నిందితులను అదుపులోకి తీసుకున్నారు. ఘటన జరిగిన వెంటనే మళ్లీ ఘర్షణ జరుపుకుంటా దేవస్థాన సెక్యూరిటీ గట్టి చర్యలు చేపట్టింది..

## మైనార్టీల అభివృద్ధికి ప్రభుత్వం కృషి మంత్రి ఫరూఖ్

**గన్నవరం(కృష్ణా), ఆగస్టు 27, ప్రభాతవార్త :** మైనార్టీల అభివృద్ధికి రాష్ట్రప్రభుత్వం చిత్తశుద్ధితో కృషిచేస్తుందని రాష్ట్రమైనార్టీసంక్షేమశాఖామంత్రి ఎన్.యం.డి.ఫరూఖ్ తెలిపారు. కృష్ణాజిల్లా గన్నవరం మండలం ముస్తాబాద గ్రామంలో గురువారం సాయంత్రం ఉరుసు ఉత్సవంలో ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా దర్గాలో చాదర్ సమర్పించి ప్రత్యేక ప్రార్ధనలు చేసారు. ముస్లింమత పెద్దలు వీరిద్దరినీ సాంప్రదాయ పద్ధతిలో సత్కరించారు. అనంతరం ముస్లింలతో కలిసి ర్యాలీ నిర్వహించారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, సంవృద్ధిగా వర్షాలు కురిసి రాష్ట్రంలో పంటలు బాగా పండాలని ఆకాంక్షించారు. గ్రామంలో రూ.17.50లక్షల నిధులతో నూతనంగా నిర్మించిన సిమెంట్‌రోడ్లను ప్రారంభించారు. గన్నవరం మండలం వీరపనేనిగూడెం, విజయవాడరూరల్ మండలం నిడమానూరు గ్రామాల్లో షాదీఖానాల నిర్మాణానికి, దర్గాకు ప్రత్యేక రహదారి ఏర్పాటుకు నిధులు మంజూరు చేయాలని యార్లగడ్డ మంత్రిని కోరారు. సానుకూలంగా స్పందించిన మంత్రి ఫరూఖ్ తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో ఉర్దుఅకాడమీ చైర్మన్ ఫారూఖ్‌షుబ్లీ, దర్గా పెద్దలు అల్తాఫ్‌రాజా, తదితరులు పాల్గొన్నారు.



# తెల్ల మచ్చల నివారణ కోసం..



చర్మంపై అక్కడక్కడా వచ్చే తెల్ల మచ్చలు అందాన్ని పాడుచేస్తాయి. శరీరంలో మెలనిన్ ఉత్పత్తి తక్కువ కావడంతో ఈ మచ్చలు ఏర్పడు తుంటాయి. కొన్ని చిట్కాలను పాటించడం ద్వారా నివారించవచ్చు.

**దానిమ్మ తొక్కలు ...** చెంచా దానిమ్మ తొక్కల పొడికి అదే పరిమాణంలో రోజ్ వాటర్‌ను కలిపి ముఖానికి రాయాలి. పావుగంటాగి చల్లటి నీటితో కడిగి శుభ్రం చేస్తే సరి. ఇది చర్మాన్ని లోపలి నుంచి హైడ్రేట్ చేస్తుంది. దురద, యాక్నే నుంచి రక్షణ కల్పించి ముఖాన్ని మెరిపిస్తుంది. మచ్చలనీ తగ్గిస్తుంది. ఇందులో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు ఫ్రీరాడికల్స్‌తో పోరాడి చర్మాన్ని ఇన్‌ఫెక్షన్ల నుంచి కాపాడతాయి.

**టీ ట్రీ ఆయిల్..** చర్మంపై మచ్చలు, మురికిని తొలగించడంలో సమర్థవంతంగా పని చేస్తుంది. ఇందులోని యాంటీ మైక్రోబియల్, యాంటీ ఫంగల్ లోణాలు చర్మాన్ని ఇన్‌ఫెక్షన్ల నుంచి కాపాడతాయి. శరీరం నుంచి వెలువడే చెమట బ్యాక్టీరియాను వృద్ధి చేస్తుంది. దీని కారణంగా అనేక చర్మ సమస్యలు కలుగుతాయి. ఇలా కాకూడదంటే టేబుల్‌స్పూన్ ఆలివ్ ఆయిల్‌కి అదే పరిమాణంలో కొబ్బరి నూనె, పదిచుక్కల టీ ట్రీ ఆయిల్ కలిపి మృదువుగామర్దన చేయాలి. అరగంటాగి గోరువెచ్చని నీళ్లతో శుభ్రపరచాలి. ఇలా రోజూ రెండు సార్లు చేస్తే ఫలితం ఉంటుంది.

**కొబ్బరినూనె:** ఇందులో యాంటీ మైక్రోబియల్ లక్షణాలు పుష్కలం.ఇవి చర్మంపై ఫంగల్ ఇన్‌ఫెక్షన్లను తొలగించి ముఖాన్ని మెరిపిస్తాయి. రోజూ నిద్రించే ముందు రాస్తే..తగిన తేమ అంది చర్మం నిగనిగలాడుతుంది.

నిమ్మ, చక్కెర స్క్రబ్.. చెంచా చక్కెరకొద్దిగా నిమ్మరసం తేనె కలిపి సమస్యల ఉన్న చోట రాయాలి. నిమ్మలోని సి విటమిన్ పిహెచ్ స్థాయుల్ని సమతుల్యం చేస్తుంది. తెల్లమచ్చలను నివారిస్తుంది. తేనెలోని యాంటీ ఆక్సిడెంట్లు చర్మానికి తగినంత తేమను అందించిమెరిసేలా చేస్తాయి.

**చందనం, రోజ్‌వారట్ మాస్క్ :** తగినంత చందనం పొడికి సరిపడా గులాబీనీరు కలిపి మెత్తని పేస్టు చేసుకోవాలి. దీన్ని తెల్లమచ్చలున్న చోట రాసి ఆరాక చల్లటి నీటితో శుభ్రం చేస్తే సరి. గంధంలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు ముఖాన్ని తేమగా కాంతమంతంగా కనిపించేలా చేస్తాయి. □

## ద్రాక్ష కొత్తిమీర పచ్చడి

కొత్తిమీర: రెండు కట్టలుఎండు ద్రాక్షలు: అరకప్పుపచ్చి మీర్చి: రెండు లేదా మూడుఉప్పు: తగినంతపుట్నాల పప్పు: ఒక టేబుల్ స్పూన్ నిమ్మకాయ: ఒకటి

**తయారు చేసే విధానం..** ముందుగా అరకప్పు ఎండుద్రాక్షలు తీసుకొని వాటిని అరగంటసేపు నీటిలో నానబెట్టుకోవాలి. మరోవైపు రెండు కొత్తిమీర కట్టలను తీసుకొని వాటిని శుభ్రంగా కడిగి కాడలతో సహా వాటిని కట్ చేసుకోవాలి. ఆ తరువాత నానబెట్టిన ఎండుద్రాక్షలు, తరిగిన కొత్తిమీర, పచ్చిమిర్చి, నిమ్మరసం, తగినంత ఉప్పు వేసి బాగా కలుపుకోవాలి. ఆ తరువాత చిక్కదనం కోసం ఒక టేబుల్ స్పూన్ పుట్నాల పప్పును వేసుకొని కలపాలి. ఈ మిశ్రమాన్ని మిక్సీలో వేసి మెత్తగా చేసుకుంటే నోరూరుంచే ద్రాక్ష కొత్తిమీర పచ్చడి సిద్ధమైనట్టే! □



# అన్నా చెల్లెళ్ల అనుబంధం రక్షా బంధన్



రక్షాబంధన్ లేక రాఖీ పౌర్ణిమ. పూర్ణిమ పౌర్ణమి రెండూ వ్యవహారికమే. శ్రావణ పూర్ణిమ అన్నాచెల్లెల అనుబంధాన్ని చిహ్నంగా అప్యాయతతో సోదరుల కుడిచేతి మణికట్టుకి, సోదరీమణులు కట్టు అందమైన దారాలతో చేయబడిన తోరమును రక్షగా ఉండమని కోరుతూ బంధించే రోజు.

శ్రావణమాసం మధ్యలో ఈ పూర్ణిమ రోజు రక్షాబంధనం పండుగను శ్రీమహావిష్ణువు హయగ్రీవా వతారంలో విజయగాధా పరంపరలో కూడా ఉందని చెబుతారు. రక్షగా కట్ట బడే సాధనాన్ని అంటే బంధింపబడేదానిని సులువుగా రాఖీ అని పిలుస్తున్నాం. హిందూ సంప్రదాయ కాలమాన పట్టిక ప్రకారం శ్రావణ పౌర్ణిమ రోజు ఈ రక్షను సోదరులకు కట్టి, 'రక్షణ, బాధ్యత లేదా బంధం 'నీ నుండి జీవిత కాలం కోరుకుంటున్నాను అని అక్క, చెల్లెళ్ళు అన్నదమ్ములకు కుడిచేతి మణికట్టుకు బంధిస్తారు. ఈ పండుగను రాఖీ, సలునో, సిలోనో, రాక్రి అని ప్రాంతాలను బట్టి పేర్లతో చేసుకుంటారు. ఏ నామంతో పిలిచినా జరుపుకునే విధానం ఒకే రకంగా ఉంటుంది. పురాణ కథనం ప్రకారం శ్రీమహావిష్ణువు బలిచక్రవర్తి కోరిక మేరకు అతనితోపాటు పాతాళంలో ఉండి పోయాడు. శ్రీమహాలక్ష్మి ్మ వెళ్ళి బలిచక్రవర్తికి రక్షాబంధం కట్టి, తన భర్తను వైకుంఠానికి తీసుకుని వెళ్ళింది. ఆ కారణంగా రక్షాబంధానికి ప్రాధాన్యత ఏర్పడింది. మహాబలవంతుడైన రాక్షస రాజును సోదరబంధంతో బలిచక్రవర్తిని బంధించిన శ్రీమహాలక్ష్మి ్మని స్ఫూర్తిగా తీసుకుని సోదరీమణులందరూ సోదరులకు రాఖీ కట్టే పండుగ ఘనంగా చేసుకోవడం వేడుకగా జరుగుతోంది.

ఇతిహాసాల ప్రకారం కూడా ద్రౌపది, శ్రీకృష్ణుల అన్న చెల్లెల అనుబంధం అత్యంత గొప్పబంధంగా కనిపిస్తుంది. శిశుపాలుడిని శిక్షి ంచే క్రమంలో సుదర్శన చక్రాన్ని ప్రయోగించిన కృష్ణుని చూపుడువేలుకు రక్తం ధారగా కారుతున్న సమయంలో ద్రౌపది తన పట్టుచీర కొంగు చింపి కృష్ణుని వ్రేలుకి కట్టుకట్టింది. దానికి కృతజ్ఞతగా ఎల్లవేళలా అండగా ఉంటానని ద్రౌపదికి హామీ ఇచ్చాడు శ్రీకృష్ణుడు. దుశ్శాసనుడి దురాగతం నుండి ఆమెను కాపాడుతాడు ఇచ్చిన మాటకు కట్టబడిన కృష్ణుడు. దేవతలకు, రాక్షసులకు మధ్య పుష్కరకాలం యుద్ధం సాగింది. యుద్ధంలో ఓడిపోయిన దేవతలరాజు దేవేంద్రుడు నిర్వీర్యుడై, తన పరివారంతో సహా అమరావతిలో తలదాచుకుంటాడు. భర్త నిస్సహాయతను చూసిన ఇంద్రాణి తరుణోపాయం ఆలోచించి, రాక్షస రాజు



అమరావతిని దిగ్బంధనం చేస్తున్న సమయంలో భర్త దేవేంద్రుడికి ప్రోత్సాహం చేస్తుంది. సరిగ్గా ఆరోజు శ్రావణ పౌర్ణిమ కావడంతో పార్వతీ పరమేశ్వరులను, లక్ష్మీ ్మనారాయణులను పూజించి రక్షను దేవేంద్రుడి చేతికి కడుతుంది. అది గమనించిన దేవతలందరూ వారు పూజించిన రక్షలను తీసుకునివచ్చి ఇంద్రుడికి కట్టి సమరానికి పంపిస్తారు. సమరంలో గెలిచిన ఇంద్రుడు తిరిగి త్రిలోక ఆధిపత్యాన్ని పొందుతాడు. శచీదేవి ప్రారంభించిన ఆ రక్షాబంధనం నాడు రాఖీ పండుగగా భూలోకంలో అనేక చోట్ల ఆచారమైందని తెలుస్తోంది. ఈ రక్షా బంధనం ప్రాముఖ్యత గురించి భవిష్య పురాణంలో ఉత్తర పర్వంలో కూడా చెప్పబడింది. ఇందులో కృష్ణుడు మరియూ యుధిష్టరునికి వారి రాజ పురోహితుడు తన కుడిమణికట్టుకు రక్షకట్టే ఆచారాన్ని వివరించటం జరిగింది. రక్షణగా ఉండుట కొరకు హిందువుల శ్రావణ పౌర్ణిమ నాటి విశిష్టతను ముఖ్య ప్రకరణంలో కృష్ణుడు వివరించాడు. శ్రావణంలో, తడి నేలలో కొత్తగా నాటిన పంటలు వేళ్ళూనుకోవడంతో పచ్చిదనం పుష్కలంగా ఉంటుంది. ఇది ఆనందం, ఉల్లాసం కలిగించే నేల, ఎత్తైన చెట్లకు వేలాడుతూ ఉంటుంది. మహిళలు, బాలికలు తమ ఆనందాన్ని అంబరాన్నంటే విధంగా ఆడుతూ పాడుతూ గడుపు తారు. వారు వివాహిత మహిళలైతే ఈ మాసంలో పుట్టినింటివారితో సంతోషంగా గడపడానికి సోదరుల నుంచి కానుకలు పొందడానికి ఏడాదంతా ఎదురు చూసి శ్రావణ పౌర్ణిమకి జన్మ స్థలాలకు వెళ్ళి పండుగ జరుపుకుంటారు. రాఖీ పౌర్ణిమ రోజు సోదరుల ఇంటికి వెళ్ళి, నూతన వస్త్రములు ధరించి, అన్న లేక తమ్ముడికి, అక్క చెల్లెళ్ళు ముందుగా నుదుట సింధూరం దిద్ది, అత్తరు వంటి సుగంధ ద్రవ్యములు పూసి, కుడిచేతి మణికట్టుకి సోదరి రంగు రంగుల నూలు లేక సిల్క్ దారములతో చేసిన తోరములను బంధించి, సోదరునికి తీపి మిఠాయిలు తినిపిస్తారు. తన కంటే వయసులో పెద్దవాడైతే అన్న పాదాలకి చెల్లెలు నమస్క రించి, అక్షి ంతలతో ఆశీర్వాదం తీసుకుంటుంది. సోదరుడు చిన్న వాడైతే అక్కకి మిఠాయి తినిపించి , ఆశీస్సులు పొందుతాడు. సోదరికి రక్షణగా ఉంటూ నీ శ్రేయస్సు కోరుకుంటూ ఉంటాను అని తెలియజేసే సందేశం మనం కూడా

**- డాక్టర్ దేవులపల్లి పద్మజ**

# పండ్లు కడిగేద్దాం..



ఆరోగ్యానికి పండ్లు ఎంతో మంచిది. పుచ్చకాయ నుంచి మామిడి వరకూ ఎన్నో పండ్లను తింటుంటాం. త్వరగా పక్వానికి రావాలని కొన్ని రకాల మందులు వాటిపై చల్లుతుంటారు. ఒకసారి నీటితో శుభ్రం చేస్తే చాలు తినేయొచ్చు అనుకుం టాం. కానీ వాటిపై ఉండే రసాయ నాలు అంత తొందరగా పోవు. కాబట్టి వీటిని సరైన పద్ధతిలో శుభ్రం చేసి తినాలని నిపుణులు సూచిస్తున్నారు. అదెలానో చూసేద్దాం. పండ్లు శుభ్రం చేస్తున్నారా.. ఒక గిన్నెలో నీళ్లు తీసుకొని అందులో స్పూన్ బేకింగ్ సోడా వేసి పండ్లను 15 నిమిషాలు నానబెట్టాలి. తరవాత వాటిని మంచి నీటితో శుభ్రం చేసుకుంటే క్రిములన్నీ తొలగి పోతాయి. మూడు వంతుల నీటికి ఒక వంతు వైట్ వినెగర్ కలపాలి. పండ్లను ఆ మిశ్రమంలో పది నిమిషాలు ఉంచి ఆపై చేత్తో రుద్ది కడిగితే రసాయనాలు తొలగిపోతాయి. స్పూన్ ఉప్పు, చిటికెడు పసుపు కలిపిన నీటిలో పండ్లు వేసి అరగంట పాటు నానబెట్టాలి. ఆపై నీటితో చక్కగా శుభ్రం చేస్తే చాలు. వాటిపై ఉండే బ్యాక్టీరియా తొలగిపోతుంది. ఇవన్నీ చేయలేమను కుంటే కనీసం మార్కెట్ నుంచి తెచ్చిన పండ్లను వెంటనే నీటిలో ఒక పది నిమిషాల పాటు ఉంచాలి. తరవాత మళ్లీ వేరే నీటితో శుభ్రం చేసుకుని తిన్నా మంచిదే. □

# మనసొప్పటం లేదు !



పసిపాపను వదిలేసి విధులకు వెళ్లాలంటే ఏ తల్లికి మనసొప్పుతుంది? ఇంట్లో వాళ్లని చూసుకునేదుకు ఎవరూ లేకపోతే ఆ ఇబ్బంది వర్ణనాతీతం. అలాగని కేర్‌టేకర్‌ని నియమించుకన్నా ఎన్నో భయాలు. మరేం చేయాలి? మీకోసం ఈ చిట్కాలు. పాప అన్నం సరిగా తిందో లేదో నిద్రపోతుందో, ఆడుకుంటుందో.. అంటూ బోలెడు సందేహాలు, అనుమానాలు వస్తుంటాయి. దీనికి బెంగ ఎందుకు?

ఇంట్లో రెండు హిడెన్ కెమెరాలు, రెండు సిసి కెమెరాలను బిగించుకోండి. ఒకవేళ డేకేర్ సెంటర్‌లో వదిలి వెళ్లినా.. అక్కడా ఆ సౌకర్యం ఉందో లేదో చూసి చేర్చండి. వాటిని మీ ఫోన్‌కి అనుసంధానించుకుంటే సరి. భరోసాగా ఉంటుంది. పిల్లలు లేవకముందే గడపదాటి,వాళ్ల నిద్రపోయాక ఇంటికి చేరుకుంటున్నారా? దాంతో పిల్లల్లో అభద్రత చేరుతుంది. వాళ్లతో గడిపే సమయం లేక మీకూ బెంగగా ఉంటుంది. సెలవురోజులే కాబట్టి.. వారిని ముందే నిద్రలేపండి. మీతోపాటు ఉదయ నడకకు తీసుకెళ్లండి. రోజంతా ఎలా గడిచిందో? తన అవసరాలు, అభిప్రాయాలూ.. అడిగి తెలుసుకోండి. వేసవి సెలవుల్లోనూ పిల్లల్ని ఇంట్లోనే వదిలి ఆఫీసుకెళ్లాల్సి వస్తోందా? ఇలాంటప్పుడు స్నేహితులు, సరదాలు లేకపోతే వారు మరింత ఇబ్బందిగా ఫీలవుతారు. వీలైతే ఏ హాబీ, క్లాసుల్లోనో చేర్చండి. ఇంట్లోనే ఉండి ఆన్‌లైన్ శిక్షణ తీసుకునేలా చేయండి. అప్పుడు మీకు కాస్త బెంగ తగ్గుతుంది. అత్యవసర పరిస్థితులు ఎదురైనప్పుడూ, ఇతరత్రా అవసరాలు ఏర్పడినప్పుడు.. ఆఫీసు నుంచి తక్కువ సమయంలోనే వారిని చేరుకునేంత దగ్గరలో ఇల్లు తీసుకోండి. ఇరుగు పొరుగుతో, స్నేహితులతో సాన్నిహిత్యం ఉన్నప్పుడు కాస్త భద్రంగానూ ఉండచ్చు. □


# దిగి వచ్చాం పండగ చేసుకోండి..



కామెడీ హీరో అల్లరి నరేష్ దాదాపు దశాబ్దం తర్వాత తనకి బాగా కలిసివచ్చిన కామెడీ జానర్‌లోకి రీఎంట్రీ ఇస్తూ నటి స్తున్న చిత్రం రంభ ఊర్వశి మేనక. చంద్రమోహన్ చింతడ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని అన్నపూర్ణ స్టూడియోస్, హాస్య మూవీస్ పతాకాలపై రాజేష్ దండా, నిమ్మకాయల ప్రసాద్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. సెప్టెంబర్ 4న సినిమాను థియేటర్లలోకి తీసుకురావడానికి మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. ఇప్పటికే విడుదలైన టీజర్, గ్లింప్స్, పాటలు ప్రేక్షకులను ఆకట్టుకుని సినిమాపై అంచనాలను పెంచేశాయి. ఈ ప్రచార జోరును మరింత పెంచుతూ తాజాగా చిత్రబృందం ఈ సినిమా టైటిల్ సాంగ్‌ను విడుదల చేసింది.

"మా ఊరు ఎక్కడో స్వర్గం అండీ.. అది ఆకాశం అంచున ఉంటదండీ.. అరే దిగి వచ్చాం పండగ చేసుకోండ్డి అంటూ సాగే ఈ మాస్ డ్యాన్స్ నంబర్‌కు సురేష్ బానిశెట్టి సాహిత్యం అందించారు. చేతన్ భరద్వాజ్ స్వరపరిచిన ఈ ఎనర్జిటిక్ ట్రాక్‌ను సాహితి చాగంటి, ధనుంజయ్ సీపాన కలిసి ఆలపించారు. విజయ్ పొలంకి కంపోజ్ చేసిన స్టెప్పులతో హీరో అల్లరి నరేష్, కథానాయికలు రాశి సింగ్, ప్రిసా సింగ్, విష్ణు ప్రియ కలిసి అలరించారు. ఆకట్టుకునే సాహిత్యం, హీరో హీరోయిన్ల మాస్ డ్యాన్స్ మూమెంట్స్‌తో అలరిస్తున్న ఈ పాట విడుదలైన కొద్దిసేపటికే సోషల్ మీడియాలో వైరల్‌గా మారి ట్రెండింగ్‌లో నిలిచింది.

# తెర



## చరిత్రలో అత్యంత చీకటి అధ్యాయం..

విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న జంటగాటిస్తున్న తాజా పీరియాడిక్ యాక్షన్ డ్రామా రణబాలి విడుదల తేదీలో మార్పు చోటుచేసుకుంది. ముందుగా ప్రకటించిన తేదీ కంటే కాస్త ఆలస్యంగా, దసరా కానుకగా ఈ చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా అక్టోబరు 16న ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు మేకర్స్ అధికారికంగా వెల్లడించారు. రాహుల్ సాంకృత్యాన్ దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తోంది. మొదట ఈ సినిమాను 2026 సెప్టెంబర్ 11న విడుదల చేయాలని భావించినప్పటికీ, నిర్మాణానంతర కార్యక్రమాలు మరియు ఇతర కారణాల వల్ల విడుదల వాయిదా పడింది. పండగ సీజన్ కలెక్షన్లకు బాగా కలిసివస్తుందనే ఆలోచనతో దసరా బరిలో దింపేందుకు చిత్రబృందం నిర్ణయించింది."మన చరిత్రలో అత్యంత చీకటి అధ్యాయం ఈ అక్టోబర్‌లో మొదలవుతుంద్ది అనే ఆసక్తికరమైన క్యాప్షన్‌తో నిర్మాతలు కొత్త రిలీజ్ డేట్ పోస్టర్‌ను సోషల్ మీడియా వేదికగా పంచుకున్నారు. ఈ సినిమాలో సౌత్ ఆఫ్రికన్ నటుడు ఆర్నాల్డ్ వోస్లూ (ది మమ్మీ ఫేమ్) పవర్ ఫుల్ విలన్ పాత్రలో నటిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ప్రమోషనల్ కంటెంట్‌కు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభించగా, కొత్త విడుదల తేదీ ప్రకటనతో విజయ్ అభిమానుల్లో మళ్లీ ఉత్సాహం నెలకొంది.

# దెబ్బపడినా వెనక్కి తగ్గేదే లేదు..



ఒక సినిమా విజయం తర్వాత తదుపరి చిత్రాన్ని ఎంచుకోవడం అంత సులభం కాదని, ప్రేక్షకుల అభిరుచికి తగ్గట్టుగా కథను ఎంచుకోవడానికే తాను ప్రాధాన్యమిస్తానని విలక్షణ నటుడు వరుణ్ తేజ్ తెలిపారు. కొరియన్ కనకరాజు సక్సెస్ ఇచ్చిన జోష్‌తో ఆయన ప్రస్తుతం తన తదుపరి చిత్రం బరి పై పూర్తి దృష్టి సారించారు. స్పోర్ట్స్ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ చిత్రంలో వరుణ్ తేజ్ వాలీబాల్ ప్లేయర్‌గా కనిపించనున్నారు. కమిటీ కుర్రోళ్లు చిత్రంతో జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్న యదు వంశీ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. కాగా, వరుణ్ తన సోదరి నిహారిక కొణిదెలతో కలిసి పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ బ్యానర్‌పై ఈ ప్రాజెక్ట్ చేస్తుండటం విశేషం. సందర్భంగా వరుణ్ మాట్లాడుతూ గతంలో తాను నటించిన గని చిత్రంలో చాలా అంశాలను ఒకేసారి కలపడం వల్ల అది ఆశించిన ఫలితాన్ని ఇవ్వలేకపోయిందని, అయితే బరి షయంలో తమ టీమ్‌కు కథపై, చెప్పాలనుకున్న అంశంపై పూర్తి స్పష్టత ఉందని స్పష్టం చేశారు. నేటివిటీకి దగ్గరగా ఉండే కథలు, స్పోర్ట్స్ నేపథ్యం తనకు ఎంతగానో ఇష్టమని, అందుకే ఈ ప్రాజెక్ట్‌కు వెంటనే కనెక్ట్ అయ్యానని చెప్పారు. ఇటీవల రిహార్సల్స్ సమయంలో మోకాలి గాయం కావడంతో శస్త్రచికిత్స చేయించుకున్న వరుణ్ తేజ్, కోలుకున్న వెంటనే తిరిగి షూటింగ్‌లో పాల్గొననున్నారు. కొత్త ఆలోచనలు, ప్యాషన్ ఉన్న యువ ప్రతిభావంతులతో పనిచేయడం ఎంతో సంతోషాన్నిస్తుందని ఆయన పేర్కొన్నారు.



# సినిమా నచ్చకపోతే ..

హీరోయిన్ శ్వేతా లక్ష్మణ్

## అమీర్‌పేట్‌లో గుండు గీయించుకుంటా

శివకుమార్ కాసారం, శ్వేతా లక్ష్మణ్ హీరో హీరోయిన్లుగా నిశాంత్ దోటి దర్శకత్వంలో తెరకెక్కిన లవ్ అండ్ ఎమోషనల్ డ్రామా సహా. ఈ చిత్రం సెప్టెంబర్ 4న థియేటర్లలో విడుదల కానున్న నేపథ్యంలో, గురువారం హైదరాబాద్‌లో నిర్వహించిన ట్రైలర్ లాంచ్ కార్యక్రమంలో ప్రొడ్యూసర్ బన్నీ వాసుతో పాటు చిత్ర యూనిట్ పాల్గొంది. ఈ ఈవెంట్‌లో హీరోయిన్ శ్వేతా లక్ష్మణ్ మాట్లాడగా, సినిమా విజయంపై ఆమె చూపించిన ధీమా అందరినీ ఆశ్చర్యపరిచింది. "మా సినిమా చూసిన ప్రేక్షకు లను డిసప్పాయింట్ చేస్తే.. నేను అమీర్‌పేట్ సెంటర్‌లో నిలబడి గుండు గీయించుకుంటా్ అని ఆమె సంచలన వ్యాఖ్యలు చేశారు. మరోవైపు హీరో శివకుమార్ కూడా అదే స్థాయిలో స్పందిస్తూ.. "ఒక తోపు సినిమాను చూడబోతున్నామని అంచనాలు పెట్టుకోవద్దు. కానీ మీ అంచనాలకు ఒక్క పర్సెంట్ తగ్గినా నాకు కాల్ చేసి బూతులు తిట్టండ్డి అంటూ వేదికపైనే తన ఫోన్ నెంబర్‌ను వెల్లడించారు. సినిమాపై ఎంత నమ్మకం ఉన్నప్పటికీ, పబ్లిసిటీ కోసం ఇలాంటి వివాదాస్పద శపథాలు చేయడం, స్టేజీపైనే ఫోన్ నెంబర్లు ఇవ్వడం అవసరమా అని సోషల్ మీడియాలో నెటిజన్లు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు.

## జీవీ నారాయణరావు ఇకలేరు



తెలుగు సినీ పరిశ్రమలో విషాదం చోటుచేసుకుంది. ప్రముఖ సీనియర్ నటుడు జీవీ నారాయణరావు (73) ఇకలేరు. కొంతకాలంగా వృద్ధాప్య సంబంధిత ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆయన గురువారం తెల్లవారుజామున తుదిశ్వాస విడిచారు. తెలుగు వెండితెరపై నటుడిగా తనదైన పాత్రలతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న జీవీ నారాయణరావు 1976లో ప్రముఖ దర్శకుడు కె. బాలచందర్ తెరకెక్కించిన అంతులేని కథ చిత్రంతో సినీ రంగానికి పరిచయమయ్యారు. తొలి సినిమాతోనే మంచి పేరు తెచ్చుకున్న ఆయన, ఆ తర్వాత వందకు పైగా చిత్రాల్లో విభిన్న పాత్రలు పోషించి ప్రేక్షకులను అలరించారు. సినిమాలతో పాటు పలు టీవీ సీరియళ్లలోనూ నటించి బుల్లితెర ప్రేక్షకులకు దగ్గరయ్యారు. ఆయన నటించిన చివరి చిత్రం ఆలోచన త్వరలో విడుదల కానుంది. ప్రస్తుతం ఆయన పార్థివదేహాన్ని ఫిల్మ్‌నగర్‌లోని మహాప్రస్థానం మార్చురీలో ఉంచారు. అమెరికాలో ఉంటున్న ఆయన కుమారుడు అవినాష్, యూకేలో ఉంటున్న కుమార్తె లలిత యామిని నగరానికి చేరుకున్న అనంతరం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయన మృతి పట్ల టాలీవుడ్ ప్రముఖులు, అభిమానులు దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ తీవ్ర సంతాపం తెలిపారు.

## ఈ పరిశ్రమ అందరిదీ..



రవితేజ ఇరుముడి సినిమా విజయంపై మెగాస్టార్ చిరంజీవి చేసిన ప్రశంసల పోస్ట్ సోషల్ మీడియాలో తీవ్ర చర్చనీయాంశమైంది. మాస్ మహారాజా రవితేజ కథానాయకుడిగా నటించిన లేటెస్ట్ సెన్సేషన్ ఇరుముడి మూవీని తాజాగా మెగాస్టార్ చిరంజీవి స్వయంగా వీక్షి ంచి సుదీర్ఘమైన పోస్ట్ పెట్టారు. దర్శకుడు శివ నిర్వాణ భావోద్వేగాల మేళవింపును, రవితేజ నటనను, బేబీ నక్షత్ర ప్రతిభను, మైత్రీ మూవీ మేకర్స్‌ను మనస్ఫూర్తిగా కొనియాడిన చిరు, పోస్ట్ చివర్లో రాసిన పదునైన వాక్యాలు సంచలనం సృష్టిస్తున్నాయి. "ఒక సినిమా విజయం పరిశ్రమలోని అందరికీ పండుగే. ఈ పరిశ్రమ అందరిదీ.. ఏ కొందరిదో కాదు. మనం బత కాలి.. ఇతరులనూ బతికించాల్లి అంటూ ఆయన వ్యాఖ్యానించారు. చిరంజీవి చేసిన ఈ వ్యాఖ్యలు సాధారణ అభినందనల పరిధిని దాటి, ఇండస్ట్రీలోని ఏకఛత్రాధిపత్య ధోరణులకు, థియేటర్ల గుత్తాధిపత్యానికి గట్టి చెంపపెట్టులా ఉన్నాయని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు. కంటెంట్ ఉన్న చిన్న, మధ్య తరహా హిట్ సినిమాలను బలవంతంగా థియేటర్ల నుంచి తప్పించాలని చూసే స్వార్థ శక్తులకు పరిశ్రమ పెద్దగా చిరు ఇచ్చిన స్ట్రాంగ్ వార్నింగ్ ఇదని నెటిజన్లు కామెంట్స్ చేస్తున్నారు. కంటెంట్ బాగుంటే ప్రేక్షకులు ఏ సినిమానైనా ఆదరిస్తారని నిరూపించిన ఇరుముడికి టీమ్‌కి మెగాస్టార్ ఇచ్చిన ఈ మద్దతుపై సినీ ప్రియుల నుంచి విశేష స్పందన లభిస్తోంది.

## 100 గ్లింప్స్‌తో.. సెలబ్రేట్ చేసుకుందాం



కింగ్ నాగార్జున 100వ చిత్రంపై తాజాగా నిర్మాణ సంస్థ అన్నపూర్ణ స్టూడియోస్ అధికారిక అప్‌డేట్‌ను ప్రకటించింది. ఆగస్టు 29న నాగార్జున పుట్టినరోజును పురస్కరించుకుని ఈ సినిమా టైటిల్, స్పెషల్ గ్లింప్స్ విడుదల చేయనున్నట్లు సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు. "లక్షలాది మంది హృదయాలలో చెరగని ముద్ర వేసిన ఈ ప్రత్యేక రోజున 100 గ్లింప్స్‌తో ఘనంగా సెలబ్రేట్ చేసుకుందాం్ అంటూ మేకర్స్ తెలిపిన సందేశం ఫ్యాన్స్‌లో అంచనాలను మరింత పెంచేసింది.

ఈ చిత్రానికి నిథమ్ ఒరు వానమ్ ఫేమ్ రా కార్తీక్ దర్శకత్వం వహిస్తుండగా, రాక్‌స్టార్ దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు. ఈ మైలురాయి సినిమాలో నాగార్జున సరసన సీనియర్ నటి టబు ముఖ్య పాత్రలో నటిస్తుండడం విశేషం. సాయి కుమార్, రవీంద్ర విజయ్ ఇతర కీలక పాత్రల్లో కనిపిస్తున్నారు. ఆగస్టు 29న గ్లింప్స్‌తో పాటు టైటిల్, విడుదల తేదీపై కూడా స్పష్టత రానుండటంతో అక్కినేని అభిమానులు పండుగ వాతావరణంలో ఉన్నారు.

## అరుదైన గౌరవం





నేషనల్ అవార్డ్ విన్నింగ్ యాక్టర్, ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ ఖాతాలో మరో అరుదైన అంతర్జాతీయ గౌరవం చేరింది. ప్రతిష్టాత్మక ఫోర్బ్స్ ఇండియా మ్యాగజైన్ ముఖచిత్రంపై ఆయన స్థానం సంపాదించారు. దేశ వ్యాప్తంగా వివిధ రంగాలకు చెందిన 100 మంది అత్యం త ప్రభావవంతమైన ప్రముఖులతో రూపొందించిన ఫోర్బ్స్ ఇండియా షో స్టాపర్స్ 2026 ప్రత్యేక ఎడిషన్ కవర్ పేజీపై బన్నీ తనదైన రాయల్ స్టైల్‌లో మెరిశారు. ఈ ప్రత్యేక కవర్ పేజీ ద్వారా భారతీయ సెలబ్రిటీల రేంజ్, బాక్సాఫీస్ స్టామినా క్రేజ్ విభాగాల్లో అల్లు అర్జున్ అగ్రస్థానంలో నిలిచారని స్పష్టమవుతోంది.

## గుంపులో ఉండకండి



"ఆడవాళ్లు మగవాళ్లతో సమానం అని చెప్పే ఫెమినిస్టులు.. అవకాశాలు ఇస్తాం అంటే పడుకున్నాం, మమ్మల్ని వాడుకున్నారు అని చెప్పే మాటల్ని ఎలా సమర్థిస్తారు? నీ లైవ్ హుడ్ కోసం నువ్వే వాడిని వాడుకున్నావ్ అనే యాంగిల్‌లో ఎందుకు ఆలోచించరు్? అని దర్శకుడు బండి సరోజ్ కుమార్ ప్రశ్నించారు. ఫెమినిజం అంశాలపై ఆయన ఎక్స్ (ట్విట్టర్) వేదికగా స్పందిస్తూ . ఎలాంటి సొంత ప్రతిభ లేనివారే ఇలాంటి ఎఫైర్లు, కమిట్‌మెంట్లు పెట్టుకుంటారని, వీరు తీసే సినిమాలు ఎవరికీ తెలియవని పేర్కొన్నారు. నిజమైన ప్రొఫెషనల్ ఫిలిం మేకర్స్ అలా ఉండరని స్పష్టం చేశారు. వ్యక్తిగత ప్రతీకారం, ఇమేజ్ డ్యామేజ్ కోసం కొందరు తప్పుడు కేసులు పెట్టి కుటుంబాలను రోడ్డున పడేస్తున్నారని ఆరోపించారు. తక్కువ సమయంలో ఫేమస్ కావాలనుకునే ప్రతిభ లేని మనుషులు.. సక్సెస్‌లో ఉన్నవారిని అల్లరి చేయడానికి రాబందుల్లా కాచుకుని కూర్చుంటారని, అందుకే గుంపులో ఉండకండి, చిల్లర గొడవలకు దూరంగా ఉండండి అంటూ ఆయన హితవు పలికారు.

# యుఎస్ ఓపెన్‌లో ముచోవా-మెన్సిక్‌కు మిక్స్‌డ్ డబుల్స్ టైటిల్



**న్యూయార్క్:** ముచోవా-మెన్సిక్ ద్వయం యూఎస్ ఓపెన్ 2026 మిక్స్‌డ్ డబుల్స్ టైటిల్‌ను గెలుచుకున్నారు. ఈ మిక్స్‌డ్ డబుల్స్ ఫైనల్‌లో కరోలినా ముచోవా-జాకుబ్ మెన్సిక్ ద్వయం 6-3 1-6 10-6 తేడాతో స్విట్జర్లాండ్‌కు చెందిన బెలిండా బెన్సిక్-ఇటలీకి చెందిన ఫ్లావియో కోబోలి జోడీని ఓడించి టైటిల్ గెలుచుకుంది. జట్టుగా వారికి ఇదే తొలి గ్రాండ్‌స్లామ్. న్యూయార్క్‌లోని ఆర్థర్ ఆషే స్టేడియంలో చెక్ జంట అద్భుతమైన ఆరంభాన్ని అందుకుంది. బలంగా సర్వ్ చేసే మెన్సిక్, సెట్ పాయింట్ వద్ద బెన్సిచ్‌ను దాటుకుంటూ ఏస్ కొట్టి 30 నిమిషాల లోపే తొలి సెట్‌ను కైవసం చేసుకున్నాడు. రెండవ సెట్‌లో, బెన్సిచ్ ఒక రిటర్న్ విన్నర్‌తో సర్వ్‌ను బ్రేక్ చేసి 3-1 ఆధిక్యాన్ని సాధించింది. ఆ తర్వాత, ఆమె కొట్టిన ఫోర్‌హ్యాండ్ షాట్ నెట్ కార్డ్‌కు తగిలి ముచోవాను దాటి వెళ్లడంతో ఆ స్విస్ క్రీడాకారిణి మ్యాచ్‌ను సమం చేసింది. నిర్ణయాత్మకమైన 10పాయింట్ల మ్యాచ్ టైబ్రేక్‌లో, మెన్సిక్ యొక్క శక్తివంతమైన సర్వ్, నెట్ వద్ద అతని చురుకైన ఆట చెక్ జట్టు ఆధిక్యం సాధించడానికి సహాయపడ్డాయి. 20 ఏళ్ల యువతి ఒక గట్టి వాలీతో 8-4 ఆధిక్యాన్ని సాధించగా, ముచోవా మ్యాచ్‌లోనే తన అత్యుత్తమ సర్వ్‌తో ఛాంపియన్‌షిప్ పాయింట్లను సంపాదించింది.



# శ్రీలంక 2వ టెస్టు డ్రా:
# 51.52కు పడిపోయిన పాయింట్ల శాతం
## భారత్ ఫైనల్ ఆశలకు గట్టి దెబ్బ

**న్యూఢిల్లీ:** కొలంబోలో శ్రీలంకతో జరిగిన రెండో టెస్టును డ్రా చేసుకోవడంతో, 2025-27 ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ (డబ్ల్యూటిసి) ఫైనల్‌కు అర్హత సాధించే భారత్ అవకాశాలకు గండి పడింది. ఈ ఫలితంతో, టీమిండియా ఐదు విజయాలు, 68 పాయింట్లతో డబ్ల్యూటీసీ పాయింట్ల పట్టికలో ఐదవ స్థానంలో నిలవగా, పాయింట్ల శాతం (పీసీటీ) 53.33 నుంచి 51.52కు పడిపోయింది. ఇక టీమిండియాకు మిగిలిన ఏడు టెస్టుల్లో, ఫైనల్ చేరే ఆశలను సజీవంగా ఉంచుకోవాలంటే భారత్‌కు వరుసగా మంచి ఫలితాలు రావాలి. అయితే, ప్రత్యర్థుల నాణ్యత దృష్ట్యా ఇది అంత సులభం కాదు. ప్రస్తుతం ఆస్ట్రేలియా 80 శాతం పాయింట్లతో పట్టికలో అగ్రస్థానంలో ఉండగా, న్యూజిలాండ్ 72.22 శాతం పాయింట్లతో మూడో స్థానంలో ఉంది. సుదీర్ఘ ఫార్మాట్‌లో భారత్, న్యూజిలాండ్ చివరిసారిగా తలపడినప్పుడు, బ్లాక్ క్యాప్స్ 3-0తో గెలిచి, 12 ఏళ్లలో స్వదేశంలో భారత్‌కు తొలి టెస్ట్ సిరీస్ ఓటమిని అందించింది. భారత్ తదుపరి సిరీస్ నవంబర్‌లో న్యూజిలాండ్‌తో వారి సొంతగడ్డపై రెండు టెస్టుల సిరీస్ కాగా, ఆ తర్వాత 2027 ఆరంభంలో ఆస్ట్రేలియాతో స్వదేశంలో ఐదు టెస్టుల సిరీస్ ఆడనుంది. మిగిలిన టెస్టుల్లో కనీసం 7 మ్యాచ్‌లు గెలిస్తే పాయింట్ల శాతాన్ని 60 శాతానికి పైగా చేరి భారత్ ఫైనల్ రేసులో నిలబడగలదు. టీమిండియా ముందున్న 7 టెస్టుల ప్రయాణం అంత తేలికైనదేమీ కాదు. శ్రీలంక పర్యటన ముగిసిన నేపథ్యంలో తర్వాత స్వదేశంలో న్యూజిలాండ్‌తో రెండు టెస్టుల సిరీస్ ఆడాల్సి ఉంది. ఆ తర్వాత అత్యంత కీలకమైన ఆస్ట్రేలియా పర్యటనలో ఐదు టెస్టుల బోర్డర్‌గవాస్కర్ ట్రోఫీ ఎదురుచూస్తోంది. ఈ కఠినమైన షెడ్యూల్‌లో మెజారిటీ మ్యాచ్‌లు గెలవడం భారత జట్టుకు పెద్ద సవాలుగా మారనుంది.



# డ్రాగా ముగిసిన కొలంబో టెస్ట్
## 1-0తో సిరీస్ భారత్ కైవసం

**కొలంబో:** శ్రీలంకతో కొలంబోలో జరిగిన రెండో టెస్టు మ్యాచ్ ఉత్కంఠ భరితంతో డ్రాగా ముగిసింది. శ్రీలంక బ్యాటర్లు గురువారం అద్భుత ఆటతో మ్యాచ్‌ను కాపాడుకున్నారు. కొలంబో టెస్ట్ డ్రా అయినప్పటికీ, మొదటి మ్యాచ్‌ను గెలుచుకున్న భారత్ 1-0 తేడాతో టెస్టు సిరీస్‌ను కైవసం చేసుకుంది. ట్రాక్ రికార్డ్ ఆధారంగా కొలంబోలో టాస్ గెలిచిన భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ మొదట బ్యాటింగ్ ఎంచుకున్నాడు. భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 503 పరుగుల భారీ స్కోరు వద్ద ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది. దేవదత్ పడిక్కల్ సెంచరీ (117), ధ్రువ్ జురెల్ అజేయ సెంచరీతో (115 నాటౌట్) రాణించారు. రిషభ్ పంత్ (63), కెప్టెన్ గిల్ (50), యశస్వి జైస్వాల్ (45), రవీంద్ర జడేజా (43) జట్టు స్కోరును 500 దాటించడంలో కీలక పాత్ర పోషించారు. అయితే భారత్ ఫాలో ఆన్ అస్త్రం ఉపయోగించింది. తొలి ఇన్నింగ్స్‌లోకి దిగిన శ్రీలంకను భారత బౌలర్లు తీవ్రంగా ఒత్తిడిలోకి నెట్టారు. సోనల్ దినుష (103), పసిందు సూరియబండార (80)తో లంక తొలి ఇన్నింగ్స్‌లో 290 పరుగులు చేసింది. మొదటి ఇన్నింగ్స్ ముగిసేసరికి టీమిండియాకు 213 పరుగుల భారీ ఆధిక్యం లభించడంతో కెప్టెన్ గిల్ ప్రత్యర్థి జట్టుకు ఫాలోఆన్ ఇచ్చి రెండోసారి బ్యాటింగ్‌కు ఆహ్వానించాడు. రెండో ఇన్నింగ్స్‌లో ఓటమి ఖాయమనుకున్న స్థితి నుంచి శ్రీలంక బ్యాటర్లు ఊహించని రీతిలో కోలుకున్నారు. ఆ జట్టు యువ బ్యాటర్ సోనల్ దినుష (264 బంతుల్లో 133) నాటౌట్‌గా నిలిచి భారత బౌలర్లకు చెమటలు పట్టించాడు. లంక ఆఖరి రోజు ద్వితీయ ఇన్నింగ్స్‌లో 9 వికెట్ల నష్టానికి 429 పరుగులు సాధించింది. లంక వద్ద 200 పైగా ఆధిక్యం ఉండటం, మ్యాచ్‌లో కేవలం 17 ఓవర్ల ఆట మాత్రమే మిగిలి ఉండటంతో విజయం సాధించే అవకాశం రెండు జట్లకూ లేకుండా పోయింది. దీంతో మ్యాచ్‌ను డ్రాగా ముగించారు. మొదటి టెస్టులో భారత్ విజయం సాధించడంతో ఈ 2 మ్యాచ్‌ల టెస్టు సిరీస్ 1-0తో టీమిండియా వశమైంది.

# దులీప్ ట్రోఫీ: దేశవాళీలో రచ్చరచ్చే
## ఈ నెల 30 నుండి సెమీఫైనల్స్‌కు 4 జట్లు

**న్యూఢిల్లీ:** దులీప్ ట్రోఫీ క్వార్టర్ ఫైనల్స్ ముగిశాయి. తూర్పు, ఉత్తర జోన్ జట్లు సెమీఫైనల్స్‌కు అర్హత సాధించాయి. ఈ నెల 30న బెంగళూరులో రెండు సెమీఫైనల్స్ జరగనున్నాయి. బెంగళూరులో జరుగుతున్న ఈ దులీప్ ట్రోఫీ క్వార్టర్ ఫైనల్




రౌండ్ లోని మొదటి మ్యాచ్‌లో నార్త్ ఈస్ట్ జోన్‌తో జరిగిన మ్యాచ్‌లో ఈస్ట్ జోన్ జట్టు ఒక ఇన్నింగ్స్ 210 పరుగుల తేడాతో విజయం సాధించగా, రెండవ క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో నార్త్ జోన్ జట్టు వెస్ట్ జోన్ జట్టును 52 పరుగుల తేడాతో ఓడించి సెమీఫైనల్స్‌లోకి ప్రవేశించాయి. దీంతో ఈస్ట్ జోన్, నార్త్ జోన్ జట్లు రెండూ సెమీఫైనల్స్‌కు అర్హత సాధించాయి. ఇక మొదటి సెమీఫైనల్ ఈ నెల 30న జరగనుంది. ఈ మ్యాచ్ బెంగుళూరులో ప్రారంభం కానుండగా, ఇందులో సెంట్రల్ జోన్, ఈస్ట్ జోన్ జట్లు తలపడతాయి. సెంట్రల్ జోన్ జట్టుకు రజత్ పాటిదార్ నాయకత్వం వహించగా, ఈస్ట్ జోన్ జట్టుకు ఇషాన్ కిషన్ సారథ్యం వహించనున్నారు. అదేవిధంగా, రెండవ సెమీ ఫైనల్ మ్యాచ్ సౌత్ జోన్, నార్త్ జోన్ జట్ల మధ్య బెంగళూరులో ఈనెల 30నే జరగనుంది. సౌత్ జోన్ జట్టుకు తిలక్ వర్మ, నార్త్ జోన్ జట్టుకు కన్హయ్య వాధవన్ కెప్టెన్‌గా వ్యవహరిస్తారు. కాగా సెంట్రల్ జోన్ జట్టులో రజత్ పాటిదార్ (కెప్టెన్), రింకు సింగ్ (వైస్ కెప్టెన్), ఆర్యన్ జువల్ (వికెట్ కీపర్), శరాన్‌షా జైన్, అమన్ మొఖడే, కునాల్ చందేలా, జీషన్ అన్సారీ, ఆర్యన్ పాండే, అర్షద్ ఖాన్, ఆయుష్ పాండే, యశ్ సింగ్ రాథోడ్, యశ్ రాథోడ్, పర్వ్ రాథోడ్, పర్వ్ ఉన్నారు. ఈస్ట్ జోన్ జట్టులో అభిమన్యు ఈశ్వరన్, సుదీప్ ఘరామి, మహ్మద్ షమీ, ముఖేష్ కుమార్, షాబాజ్ అహ్మద్, సూరజ్ జైస్వాల్, ఇషాన్ కిషన్ (కెప్టెన్), వైభవ్ సూర్యవంశీ (వైస్ కెప్టెన్), విరాట్ సింగ్, కుమార్ కుషాగ్రా, శిఖర్ మోహన్, సుబ్రాన్షు సేనాపతి, అభిజిత్ ద రోకర్, అనీషుర్ ద రోకర్, సౌత్ జోన్ జట్టులో తిలక్ వర్మ (కెప్టెన్), రికీ భుయ్, అభినవ్ తేజ్రానా, షేక్ రషీద్, కె. హిమతేజ, స్మరణ్ రవిచంద్రన్, ఎన్. జగదీషన్, కరుణ్ నాయర్, టి. త్యాగరాజన్, శ్రేయాస్ గోపాల్, సాయి తేజ, టి. విజయ్, విద్వాత్ కావేరప్ప, అమన్ ఖాన్, నార్త్ జోన్ జట్టులో కన్హయ్య వాధావన్ (కెప్టెన్), ఆయుష్ బదోని (వైస్ కెప్టెన్), సనత్ సాంగ్వాన్, కమ్రాన్ ఇక్బాల్, యశ్ ధుల్, ఆయుష్ దోసెజా, అబ్దుల్ సమద్, నిషాంత్ సింధు, అర్జున్ శర్మ, అబిద్ ముస్తాక్, అర్ష్‌దీప్ సింగ్, సునీల్ కుమార్, అన్షుల్ కాంబోజ్, యుధ్‌వీర్ సింగ్, యుధ్‌వీర్ సింగ్‌ప్ ఉన్నారు.



# నేటి నుండి మహిళల ఆసియా కప్
## టైటిల్ లక్ష్యంగా బరిలోకి భారత్ జట్టు


**న్యూఢిల్లీ:** మహిళల టీ20 ఆసియా కప్ 2026 టోర్నమెంట్‌లో మరో టైటిల్‌ను కైవసం చేసుకునేందుకు భారత మహిళల జట్టు సిద్ధమవుతోంది. పొట్టి ఫార్మాట్‌లో పట్టు సాధించి, తమ ఆధిపత్యాన్ని చాటుకోవాలని భారత్ భావిస్తోంది. మహిళల క్రికెట్‌కు ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న ఆదరణ నేపథ్యంలో ఈసారి ఆసియా కప్‌పై కూడా అభిమానుల్లో భారీ ఆసక్తి నెలకొంది. ముఖ్యంగా భారత్, పాకిస్థాన్, శ్రీలంక వంటి బలమైన జట్లు బరిలో ఉండటంతో పోటీ మరింత రసవత్తరంగా మారే అవకాశాలు కనిపిస్తున్నాయి. దుబాయ్ వేదికగా ఈ నెల 28 నుంచి సెప్టెంబర్ 13 వరకు మహిళల టీ20 ఆసియా కప్ జరుగనుంది. దీనికి యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ ఆతిథ్యం ఇవ్వనుండగా ఈ ప్రతిష్ఠాత్మక టీ20 టోర్నీలో భారత్, పాకిస్థాన్, శ్రీలంక సహా మొత్తం ఎనిమిది జట్లు ఆసియా అగ్రస్థానం కోసం పోటీపడనున్నాయి. ఈసారి మహిళల ఆసియా కప్‌ను టీ20 అంతర్జాతీయ ఫార్మాట్‌లో నిర్వహించనున్నారు. యూఏఈలోని దుబాయ్ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం ఈ టోర్నీకి పూర్తి స్థాయి వేదికగా నిలవనుంది. ఈ టోర్నమెంట్‌లోని శ్రీలంక మహిళల జట్టు డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగుతోంది. హర్మన్‌ప్రీత్ కౌర్ కెప్టెన్సీలో భారత జట్టుపై భారీ అంచనాలు ఉన్నాయి. భారత్ ఏడు సార్లు టైటిల్ గెలవగా, మిగిలిన రెండు ఎడిషన్లలో బంగ్లాదేశ్, శ్రీలంక ఒక్కోసారి విజేతలుగా నిలిచాయి. దీంతో మహిళల ఆసియా కప్‌లో ఇప్పటివరకు ఆధిపత్యం చలాయించిన భారత్ మరోసారి టైటిల్‌ను సొంతం చేసుకోవాలనే లక్ష్యంతో బరిలోకి దిగుతోంది. గతంలో ఒకసారి ఆసియా కప్‌ను గెలుచుకున్న బంగ్లాదేశ్ రెండోసారి కప్‌ను ముద్దాడాలనే పట్టుదలతో సిద్ధమవుతోంది. మరోవైపు డిఫెండింగ్ ఛాంపియన్ శ్రీలంక తన టైటిల్‌ను నిలబెట్టుకోవాలనే పట్టుదలతో రంగంలోకి దిగనుంది. ఇక ఇప్పటివరకు ఆసియా కప్‌ను గెలవని ఇతర జట్లు తొలిసారి ట్రోఫీని సొంతం చేసుకోవాలనే పట్టుదలతో పోటీకి సిద్ధమవుతున్నాయి. దీంతో పోటీలు అత్యంత రసవత్తరంగా సాగే అవకాశాలు కనిపిస్తున్నాయి. భారత్ జట్టులో హర్మన్‌ప్రీత్ కౌర్ (కెప్టెన్), స్మృతి మంధాన (వైస్‌కెప్టెన్), షఫాలీ వర్మ, భారతీ ఫుల్మాలి, దీప్తి శర్మ, రిచా ఘోష్, జి. కమలిని, అరుంధతి రెడ్డి, ప్రేమా రావత్, రాధా యాదవ్, శ్రీ చరణి, రేణుకా ఠాకూర్, నందిని శర్మ, క్రాంతి గౌడ్, ప్రతీకా రావల్ ఉన్నారు.

# ఐదు ఐపిఒలకు మార్కెట్లలో భారీ స్పందన




**ముంబయి, ఆగస్టు 27:** ఐపిఒల మార్కెట్‌లో పలు కంపెనీల ఇష్యూలకు గురువారం భారీ స్పందన లభించింది. స్టాక్ ఎక్స్ఛేంజ్ గణాంకాల ప్రకారం ఐదు ఐపిఒల సబ్‌స్క్రిప్షన్ భేషుగ్గా ఉంది. ల్యూమినో ఇండస్ట్రీస్ ఆఫర్‌లో ఉన్న 6,32,05,127 షేర్లకు గాను 7,98,37,212 షేర్లకు బిడ్లు వచ్చాయి. ఇష్యూ 1.26 రెట్లు కొనుగోలు అయింది. ఈనెల27న ప్రారంభమైన ఇష్యూ ఆగస్టు 31న ముగియనుంది. ధరల శ్రేణి రూ.78-82. కనీసం 182 షేర్లకు, ఆ తర్వాత వాటి గుణిజాల్లో బిడ్ చేయవచ్చు. అను ప్రాజెక్ట్స్ ఐపిఒలో 1,76,83,000 షేర్లకు గాను 1,52,28,501 షేర్లకు బిడ్లు వచ్చాయి. ఇష్యూ 0.86 రెట్లు బిడ్లు రాగాఇ ష్యూ శుక్రవారం ముగుస్తుంది. ధరల శ్రేణి రూ.94-99. కనీస బిడ్ 151 షేర్లు.ఇక స్కైవేస్ ఎయిర్ సర్వీసెస్‌కు సంబంధించి 2,95,83,600 షేర్లకు గాను ఏకంగా 2,09,85,50,200 షేర్లకు బిడ్లు వచ్చాయి. దీంతో ఇష్యూ 70.94 రెట్లు సబ్‌స్క్రైబ్ అయింది. ధరల శ్రేణి రూ.131-138. కనీస బిడ్ 100 షేర్లు.సింబయోటెక్ ఫార్మాల్యాబ్ పరంగాచూస్తే 1,31,24,929 షేర్లకు గాను 93,36,33,525 షేర్లకు బిడ్లు వచ్చాయి. ఇష్యూ 71.13 రెట్లు సబ్‌స్క్రైబ్ అయింది. ధరల శ్రేణి రూ.938-988. కనీస బిడ్ 15 షేర్లు.హైటెక్ ఇంజినీర్స్ కంపెనీకి 1,81,45,406 షేర్లకు గాను 4,40,88,82,187 షేర్లకు బిడ్లు వచ్చాయి. దీంతో ఇష్యూ 242.98 రెట్లు సబ్‌స్క్రైబ్ అయింది. ధరల శ్రేణి రూ.50-53. కనీస బిడ్ 283 షేర్లు.ఈ ఐదు ఇష్యూలలో హైటెక్ ఇంజినీర్స్ ఐపీఓకు అత్యధికంగా 242.98 రెట్ల సబ్‌స్క్రిప్షన్ లభించగా, ఆ తర్వాత సింబయోటెక్ ఫార్మాల్యాబ్ 71.13 రెట్లు, స్కైవేస్ ఎయిర్ సర్వీసెస్ 70.94 రెట్ల సబ్‌స్క్రిప్షన్‌తో నిలిచాయి.

# రుణంకంటే ఎక్కువే వసూలుచేసారు
## సోషల్ మీడియా పోస్టులో విజయ్ మాల్యా



**లండన్, ఆగస్టు 27:** బ్యాంకులకు వేల కోట్ల రూపాయలు ఎగవేసి విదేశాలలో తలదాచుకుంటున్న ప్రముఖ వ్యాపారవేత్త విజయ్ మాల్యా మరోసారి తనకు అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. బ్యాంకులకు తాను చెల్లించాల్సిన అసలు మొత్తం కంటే అధికంగానే రికవరీ చేశారని, అయినా న్యాయం జరగడం లేదని ఆయన వాపోయారు. సోషల్‌మీడియా పోస్టులో ఆయన స్పందిస్తూ మీడియా అధినేత సుభాష్ చంద్ర, ఇన్సాల్వెన్సీ అండ్ బ్యాంక్రప్టసీ కోడ్ (ఐబిసి) కింద కేవలం రూ.6.5 కోట్లు చెల్లించి, రూ. 22,006 కోట్ల రుణ క్లెయిమ్‌లను సెటిల్ చేసుకోబోతున్నారంటూ వచ్చిన ఒక మీడియా కథనాన్ని విజయ్ మాల్యా ప్రస్తావించారు. ఇది నిజమైతే నా స్నేహితుడు సుభాష్‌కు అభినందనలు. నా నుంచి రూ. 6,203 కోట్ల అప్పునకు గాను రూ. 14,100 కోట్లు రికవరీ చేసినట్లు బ్యాంకులు, ప్రభుత్వం అంగీకరించాయి. గత యేడాది డిసెంబర్‌లోనూ విజయ్ మాల్యా ఇవే తరహా ఆరోపణలు చేశారు. తన నుంచి రికవరీ చేసిన మొత్తంపై ప్రభుత్వానికి, బ్యాంకులకు మధ్య లెక్కల్లో పొంతన లేదని ఆయన ప్రశ్నించారు. ప్రభుత్వం పార్లమెంటులో రూ. 14,100 కోట్లు వసూలు చేసినట్లు పేర్కొనగా, బ్యాంకులు మాత్రం రూ. 10,000 కోట్లు అంటున్నాయని, ఈ వ్యత్యాసపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. రికవరీ లెక్కలను నిర్ధారించేందుకు ఒక రిటైర్డ్ న్యాయమూర్తిని నియమించాలని ఆయన కోరారు.

# ఒకటోతేదీ వచ్చేస్తోంది.. మార్పులివే

**ముంబయి, ఆగస్టు 27:** ఆగస్టు నెల ముగింపునకు వచ్చింది. మరో ఐదు రోజుల్లో సెప్టెంబర్ నెలలోకి వస్తున్నందున కీలక మార్పులు వస్తున్నాయి. సెప్టెంబర్ 1నఎల్పీజీ గ్యాస్ సిలిండర్ ధరలకు సంబంధించింది. చమురు విక్రయ సంస్థలు ప్రతి నెల ప్రారంభంలో కొత్త ధరలను ప్రకటిస్తాయి. ఆగస్టు 1న 19 కిలోల కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధరపై రూ.202 తగ్గింపు లభించినప్పటికీ, 14.2 కిలోల గృహ వినియోగ సిలిండర్ ధరలలో ఎలాంటి మార్పు లేకపోవడం గమనార్హం. ఇక మీరు ప్రస్తుతం పొందుతున్న సబ్సిడీ లేదా నిరంతర సిలిండర్ సరఫరాను ఎలాంటి అంతరాయం లేకుండా పొందాలంటే మీకో ముఖ్యమైన సూచన. గ్యాస్ ఏజెన్సీలు ఈకేవైసి చేసుకునేందుకు ఆగస్టు 31 వరకు పొడిగించాయి. ఈ ఐదు రోజుల్లోగా ఐఓసిఎల్, బిపిసిఎల్, హెచ్‌పిసిఎల్ వినియోగదారులు తమ ఇకేవైసి పూర్తి చేయకపోతే, సెప్టెంబర్ 1 నుంచి గ్యాస్ సిలిండర్ పంపిణీలో ఇబ్బందులు ఎదురుకావచ్చు లేదా ఎక్కువ ధర చెల్లించాల్సి రావచ్చు. ఎల్పీజీ ధరలతో పాటు వైమానిక ఇంధనం, సిఎన్‌జీ, పిఎన్‌జీ ధరల్లో కూడా సెప్టెంబర్ 1న సవరణలు జరగనున్నాయి. ఎటిఎఫ్ ధరల్లో వచ్చే మార్పుల వల్ల విమాన ప్రయాణ ఛార్జీలు మారే అవకాశం ఉంది.కొత్తగా కారు కొనాలని భావిస్తున్న వారికి సెప్టెంబర్ నెల కాస్త షాక్ ఇవ్వనుంది. ప్రముఖ వాహన తయారీ సంస్థ టాటా మోటార్స్ తమ అన్ని రకాల కార్లు, ఎస్‌యూవీల ధరలను గరిష్ఠంగా రూ.25వేలకు వరకు పెంచుతున్నట్లు ప్రకటించింది. ఈ ధరల పెంపు పెట్రోల్, డీజిల్ వాహనాలతో పాటు ఎలక్ట్రిక్ మోడళ్లకు కూడా వర్తిస్తుంది.



# స్టాక్ మార్కెట్లకు రెండో రోజూ నష్టాలు

**ముంబయి, ఆగస్టు 27:** దేశీయ స్టాక్ మార్కెట్లు గురువారం వరుసగా రెండో సెషన్‌లోనూ నష్టాల్లోముగిశాయి. హెవీవెయిట్ షేర్లలో అమ్మకాల ఒత్తిడి పెరగడంతో నిఫ్టీ కీలకమైన 24,100 స్థాయి దిగువన స్థిరపడింది. లాభాల స్వీకరణ, నెలవారీ సెన్సెక్స్ ఎక్స్‌పైరీ, అమెరికాలో అధిక ద్రవ్యోల్బణంపై ఆందోళనలు, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు మార్కెట్ సెంటిమెంట్‌పై ప్రభావం చూపాయి.స్ట్రెయిట్ ఆఫ్ హార్ముజ్ ప్రాంతంలో సరఫరా అంతరాయాలు తగ్గేఅవకాశం ఉందన్నచర్చలతో చమురు ధరలు కొంత తగ్గడం మార్కెట్లకు స్వల్ప ఊరట నిచ్చింది. విదేశీ, దేశీయ సంస్థాగత పెట్టుబడిదారులు నికర కొనుగోలుదారులుగా ఉన్నప్పటికీ, గురువారం అమ్మకాల ఒత్తిడికొనసాగింది.రంగాల వారీగా కన్స్యూమర్ డ్యూరబుల్స్, ఫార్మా షేర్లు లాభపడగా, మెటల్స్, పీఎస్‌యూ బ్యాంక్ షేర్లు నష్టపోయాయి. బిఎస్‌ఇ సెన్సెక్స్ 539.35 పాయింట్లు నష్టపోయి 76,933.59 వద్ద ముగిసింది. నిఫ్టీ 50 సూచీ 116.90 పాయింట్లు క్షీణించి 24,090.85 వద్ద స్థిరపడింది. రెండు సెషన్లలో సెన్సెక్స్ 0.93 శాతం, నిఫ్టీ 1 శాతం చొప్పున నష్టపోయాయి.నిఫ్టీ నష్టాలకు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ప్రధానంగా దోహదపడింది. ఈ షేరు 2.23 శాతం పడిపోయింది. భారతి ఎయిర్‌టెల్ 1.25 శాతం, రిలయన్స్ ఇండస్ట్రీస్ 1.22 శాతం చొప్పున క్షీణించాయి. బిఎస్‌ఇ 150 మిడ్‌క్యాప్ సూచీ 0.38 శాతం, బిఎస్‌ఇ 250 స్మాల్‌క్యాప్ సూచీ 0.04 శాతం నష్టపోయాయి. బిఎస్‌ఇలో 1,824 షేర్లు లాభపడగా, 2,491 షేర్లు నష్టపోయాయి. మరో 211 షేర్లు మార్పులేకుండా ముగిశాయి. కమోడిటీ మార్కెట్లో అక్టోబర్ నాటి డెలివరీ బ్రెంట్ క్రూడ్ 27 సెంట్లు పెరిగి బ్యారెల్‌కు 87.21 డాలర్లకు చేరింది. డాలర్‌తో రూపాయి మారకం విలువ స్వల్పంగా తగ్గింది. గత సెషన్‌లో 95.4400 వద్ద ముగిసిన రూపాయి, గురువారం 95.5500 వద్ద కొనసాగింది. భారత 10 యేళ్ల బెంచ్‌మార్క్ ప్రభుత్వ బాండ్ రిటర్న్లు 6.851 శాతం నుంచి 6.884 శాతానికి పెరిగింది.

## వాణిజ్యం

# రూ.20 లక్షల కోట్లకు ఇవి మార్కెట్ టర్నోవర్ : నితిన్ గడ్కరీ



**న్యూఢిల్లీ, ఆగస్టు 27:** భారత్‌లో ఎలక్ట్రిక్ వాహనాలు ఇవి మార్కెట్ 2030 నాటికి రూ.20 లక్షల కోట్లకు చేరుకుంటుందని కేంద్ర రోడ్డు రవాణా మంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు. అదే సమయంలో ఈ రంగం ద్వారా ఐదు కోట్ల ఉద్యోగాలు లభించే అవకాశం ఉందని వెల్లడించారు. సుస్థిర అభివృద్ధికోసం అన్న థీమ్‌తో సెంటర్‌ఫర్ ఎక్సెలెన్స్ నిర్వహించిన సదస్సులో గడ్కరీ మాట్లాడుతూ ప్రస్తుతం దేశంలో 57 లక్షల ఎలక్ట్రిక్ వాహనాలు రిజిస్టర్ అయి ఉన్నాయని, మొత్తం వాహన మార్కెట్‌లో ఇవిల వాటా 7 శాతంగా ఉందని చెప్పారు. 2030 నాటికి భారీ వృద్ధి 2030 నాటికి భారత ఇవి మార్కెట్ విలువ రూ.20 లక్షల కోట్లకు చేరుతుంది. ఈ రంగం ఐదు కోట్ల ఉద్యోగాలను కూడా సృష్టిస్తుందని గడ్కరీ తెలిపారు. దేశంలోని ప్రముఖ ద్విచక్ర వాహన తయారీ సంస్థలు బజాజ్ ఆటో, హీరో మోటోకార్ప్ తమ ఉత్పత్తుల్లో 50 శాతానికి పైగా విదేశాలకు ఎగుమతి చేస్తున్నాయని ఆయన పేర్కొన్నారు.దేశంలో ఏటా లక్ష ఎలక్ట్రిక్ బస్సులకు డిమాండ్ ఉన్నప్పటికీ ప్రస్తుతం 50 వేల నుంచి 60 వేల బస్సులను మాత్రమే తయారు చేయగలుగుతున్నామని చెప్పారు.ప్రపంచంలో నంబర్ వన్‌గా ఆటో పరిశ్రానున్న ఐదేళ్లలో భారత ఆటోమొబైల్ పరిశ్రమను ప్రపంచంలోనే నంబర్ వన్ స్థానానికి తీసుకెళ్లడమే ప్రభుత్వ లక్ష్యమని గడ్కరీ వెల్లడించారు. లక్ష్యం కష్టమైనదే అయినప్పటికీ అసాధ్యం కాదని అన్నారు. దేశంలో శిక్షణ పొందిన మానవ వనరులు అందుబాటులో ఉండటం పరిశ్రమకు పెద్ద బలమని చెప్పారు. భారత్‌లో తయారవుతున్న వాహనాల నాణ్యత మెరుగ్గా ఉండటంతో పాటు వాటి తయారీ వ్యయం తక్కువగా ఉందని, అందుకే ప్రపంచంలోని ప్రముఖ ఆటోమొబైల్ కంపెనీలన్నీ భారత్‌లో కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయని గడ్కరీ వివరించారు.తాను రోడ్డు రవాణా మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన సమయంలో భారత ఆటోమొబైల్ పరిశ్రమ పరిమాణం రూ.14 లక్షల కోట్లుగా ఉండేదని, ప్రస్తుతం అది సుమారు రూ.22-23 లక్షల కోట్లకు చేరిందని తెలిపారు. అమెరికా ఆటో పరిశ్రమ పరిమాణం సుమారు రూ.78 లక్షల కోట్లు, చైనా పరిశ్రమ రూ.47 లక్షల కోట్లుగా ఉందని చెప్పారు. భారత్‌లో లాజిస్టిక్స్ వ్యయాన్ని 8 శాతానికి తగ్గించాలన్నది ప్రభుత్వ లక్ష్యమని గడ్కరీ తెలిపారు. దేశంలో ఎక్స్‌ప్రెస్‌వేలు, ఎకనామిక్ కారిడార్ల నిర్మాణం కారణంగా లాజిస్టిక్స్ వ్యయం గతంలో ఉన్న 16 శాతం నుంచి ప్రస్తుతం 10 శాతానికి తగ్గిందని తెలిపారు.లాజిస్టిక్స్ వ్యయాన్ని 8 శాతానికి తీసుకురాగలిగితే అంతర్జాతీయ మార్కెట్లలో భారత్ మరింత పోటీతత్వాన్ని సాధించగలదని గడ్కరీ పేర్కొన్నారు.

# రూ.22వేల కోట్లకు సంబంధించి
# 6.5 కోట్లకే రీపేమెంట్ ప్లాన్

**ముంబయి, ఆగస్టు 27:** మీడియా రంగ ప్రముఖులు, జీ గ్రూప్ వ్యవస్థాపకుడు సుభాష్ చంద్ర రుణాల చెల్లింపు విషయానికి సంబంధించి నేషనల్ కంపెనీ లా ట్రైబ్యునల్ సంచలన నిర్ణయం ప్రకటించింది. ఆయన వ్యక్తిగత దివాలా పరిష్కార ప్రక్రియలో తాజాగా కీలక పరిణామం చోటు చేసుకుంది. సుమారు రూ. 22,006.57 కోట్ల మేర ఆమోదించిన రుణ దాతల క్లెయిమ్స్‌కు సంబంధించి కేవలం రూ. 6.5 కోట్ల రీపేమెంట్ ప్లాన్‌కు ఎన్సీఎల్టీ ఆమోదం తెలిపింది. ఈ నిర్ణయంతో బ్యాంకులు దాదాపు 99.97 శాతం మేర తమ డబ్బుల్ని కోల్పోనున్నాయి. దీనిని బ్యాంకింగ్ పరిభాషలో హెయిర్ కట్ అంటారు. అంటే వారు క్లెయిమ్ చేసిన మొత్తంతో పోలిస్తే చాలా తక్కువ మొత్తం మాత్రమే తిరిగి పొందనున్నారు. సుభాష్ చంద్ర ప్రతిపాదించిన రీపేమెంట్ ప్లాన్ ప్రకారం రుణ దాతలకు రూ. 6.25 కోట్లు చెల్లించనున్నారు. మరో రూ. 25 లక్షలు దివాలా పరిష్కార ప్రక్రియలకు సంబంధించిన ఖర్చుల కోసం కేటాయించారు. అయితే మెజార్టీ బ్యాంకులు/రుణ దాతలు ఈప్రతిపాదనకు అంగీకరించినప్పటికీ, మరి కొందరు మాత్రం తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేశారు. ముఖ్యంగా ఎల్ఐసి హౌసింగ్ ఫైనాన్స్ నేతృత్వంలోని రుణ దాతలు, ఇంత తక్కువ మొత్తంలో రికవరీని ఆమోదించడం సరైనది కాదని వాదించారు. ఎల్ఐసి హౌసింగ్ ఫైనాన్స్‌కు అంగీకరించిన క్లెయిమ్ మొత్తం రూ. 1322.39 కోట్లుగా ఉంది. ప్రతిపాదిత ప్లాన్ ప్రకారం సంస్థకు కేవలం రూ. 38.09 లక్షలు మాత్రమే అందనుంది. ఇది మొత్తం క్లెయిమ్‌లో దాదాపు 0.028 శాతం మాత్రమే. ఈ కేసులో మొదట




ఎన్సీఎల్టీడివిజన్ బెంచ్‌లోని ఇద్దరు సభ్యులు భిన్నమైన తీర్పులు ఇచ్చారు. దీంతో అభిప్రాయ భేదం కారణంగా మూడో సభ్యుడిని నియమించారు. ఎన్సీఎల్టీ జుడీషియల్ సభ్యుడు నీలేశ్ శర్మ, మూడో సభ్యుడిగా మెజార్టీ అభిప్రాయానికి అనుగుణంగా రీపేమెంట్ ప్లాన్‌ను ఆమోదించారు. దీనికి 80.81 శాతం ఓటింగ్ వాటా సభ్యుల మద్దతు లభించిందని, వ్యతిరేకించిన రుణ దాతల ఓటింగ్ వాటా 20 శాతానికి తక్కువగా ఉందని స్పష్టం చేశారు. సుభాష్ చంద్ర వ్యక్తిగత ఆస్తుల విలువ, రీపేమెంట్ ప్లాన్‌లోప్రతిపాదించిన మొత్తంతో పోలిస్తే తక్కువగానే ఉందని, అందుకే ప్లాన్‌ను తిరస్కరిస్తే సుభాష్ చంద్ర పూర్తి స్థాయి దివాలా ప్రక్రియలోకి వెళ్లే అవకాశం ఉందని ట్రైబ్యునల్ అభిప్రాయపడింది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.